

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 40

మంగళవారం 2-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



లక్నో సూపర్ 'ఫ్లాప్'

127 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకొని గెలిచిన బెంగళూరు.

- 12లో



బ్యూటీ స్టార్

జైపూర్‌లో జరిగిన వోగ్‌స్టార్ పోటీలో విజేతగా నిలిచిన తెలుగమ్మాయి కీర్తి

- 11లో



ఎవరిదో 'రాజ'ధాని

బెంగళూరులో ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీయే అధికారంలోకి వస్తుందన్న విశ్లేషణలతో బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

- వివరాలు 6లో



కర్ణాటక ఎన్నికలు మీ కోసం కాదు

కర్ణాటక ఎన్నికలు ఆయన కోసం కాదన్న విషయాన్ని ప్రధాని అర్థం చేసుకోవాలని రాహుల్ గాంధీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.


- వివరాలు 6లో



మోదీ 'అసమర్థుడైన కొడుకు'

బంజారాలను పట్టించుకోని ప్రధాని మోదీ అసమర్థుడైన కొడుకని ప్రియాంక్ ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

- వివరాలు 6లో



దేశ ద్రోహ చట్ట సవరణకు సిద్ధం

దేశ ద్రోహచట్టంపై సంప్రదింపుల ప్రక్రియ కీలక దశలో ఉందని కేంద్ర ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి తెలియజేసింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు లక్ష్యం..



వచ్చే వానాకాలం సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం నూతన సచివాలయంలో వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులతో తొలి సమీక్ష నిర్వహించారు.

- వివరాలు 5లో

అధిక పెన్షన్ ఆప్షన్‌కు రేపే ఆఖరు!

ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) చందాదారులకు అధిక పెన్షన్ ఆప్షన్ గడువు ఈనెల 3వ తేదీతో ముగుస్తోంది. కానీ ఇప్పటికీ వెబ్‌సైట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలు తీరలేదు. అధిక పెన్షన్ అర్హత అవకాశాలు, అధిక పెన్షన్ లెక్కింపు సూత్రం తేలలేదు.

- వివరాలు 14లో



పెద్దపల్లి జిల్లా కొత్తపల్లి కేంద్రంలో చెరువును తలపిస్తున్న వర్షపునీరు

సుల్తానాబాద్‌లో మొలకెత్తిన వడ్లను చూపిస్తున్న రైతు

రాష్ట్రవ్యాప్తంగా ఈదురుగాలులు, వడగళ్ల వానల బీభత్సం

లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు.. నేలకొరిగి, గింజలు రాలిన వరి

- పూర్తిగా నేల రాలిన మామిడి.. మొక్కజొన్న, శనగ, పెసర
- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో తడిసి.. మొలకెత్తుతున్న ధాన్యం
- ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో తీవ్ర ప్రభావం
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులకు తప్పని ఇబ్బందులు

వాన పడి.. కంట తడి

సాక్షి నెట్‌వర్క్: అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తీవ్ర వేగంతో వీస్తున్న ఈదురుగాలులు దాటికి చాలా చోట్ల వరి నేలకొరిగింది. వరి గింజలు రాలిపోయాయి. మరోవైపు వరి కోతలు పూర్తిచేసి.. ధాన్యాన్ని కల్లాలకు, కొనుగోలు కేంద్రాలకు తరలించిన రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కళ్ల ముందే ధాన్యం తడిసిపోతున్నా, నీటిలో కొట్టుకుపోతున్నా ఏమీ చేయలేక కన్నీళ్లు పెడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు పాట్లు పడుతున్నారు. వానకు తడిసిన ధాన్యాన్ని ఆరబోయడం, మళ్లీ వానకు తడిసిపోవడం, మళ్లీ ఆరబోయాల్సి రావడంతో అరిగోస పడుతున్నారు. వరుసగా వానలతో తడిసే ఉంటుండటంతో.. చాలాచోట్ల ధాన్యంలో మొలకలు వస్తున్నాయి. మరోవైపు మామిడి పూర్తిగా దెబ్బతినగా.. మొక్కజొన్న, శనగ, పెసర, మామిడి, పెసర, నువ్వుల పంటలకు నష్టం జరిగింది. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో నష్టం ఎక్కువగా ఉంది. మరికొన్ని రోజులూ వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో.. రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు.

కొనుగోళ్లలో ఆలస్యంతో..

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం సమస్యగా మారిందని.. కొనుగోళ్లు ఊపందుకుని ఉంటే ఈ బాధ

మిగతా 3వ పేజీలో ▶

తడిసిన ధాన్యం కొంటాం: గంగుల 3లో

మరో రెండు రోజులు వడగళ్ల వానలు

ఆగస్టులోగా 'పాలమూరు'

తాగునీళ్లు!

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు అందిస్తాం: సీఎం కేసీఆర్

- జూలై నాటికి కరివెన జలశయానికి నీటి తరలింపు
- తర్వాత ఉద్దండాపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోత
- నూతన సచివాలయంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై సీఎం తొలి సమీక్ష
- జూన్‌లోగా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయల్‌సాగర్ పూర్తికి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: 'పాలమూరు'ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి వచ్చే ఆగస్టులోగా ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు తాగునీటిని అందిస్తామని సీఎం కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఇందుకు అనుగుణంగా జూలై నాటికి కరివెన జలాశయానికి, తర్వాతి నెలరోజుల్లో ఉద్దండాపూర్ జలాశయానికి నీళ్లను ఎత్తిపోసేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివెన, ఉద్దండాపూర్ జలాశయాల మిగులు పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మిగతా 2వ పేజీలో ▶

నేడు ఢిల్లీకి సీఎం కేసీఆర్ 2లో 4న పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

క్రమబద్ధీకరణ గడువు నెల రోజులు పొడిగింపు

జీవో 58, 59 విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం

- వ్యవసాయ నోటరీ భూములకు సైతం పరిష్కారం
- ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సీఎం సానుకూల స్పందన

3లో

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంపు

- మేడే కానుకగా రూ. 1,000 పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- రాష్ట్రంలోని అన్ని పురపాలికలు, పంచాయతీల్లో అమలు
- త్వరలో ఆర్టీసీ కార్మికుల జీతాలు పెంచుతామన్న సీఎం

3లో



3 ఉచిత సిలిండర్లు

- రోజుకు అర లీటరు పాలు
- ఉమ్మడి పౌర స్మృతి, జాతీయ పౌరపట్టీ
- కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీలు

6లో

ఢిల్లీలో వ్యాపారం.. హైదరాబాద్‌లో ఆస్తులు

ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కు ప్రమేయం

- ఫీనిక్స్ సంస్థ, క్రియేటివ్ డెవలపర్స్‌ను చార్జిషీట్‌లో ప్రస్తావించిన ఈడీ..
- కవితకు బినామీ అరుణ్ పిళ్లై అని మరోసారి వెల్లడి
- ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో రెండు చార్జిషీట్లను కోర్టుకు సమర్పించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో ఆసక్తికర అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఢిల్లీలో మద్యం వ్యాపారంలో సాధించిన లాభాలతో హైదరాబాద్‌లో భూములు కొనుగోలు చేశారని, ఇందులో సౌత్‌గ్రూపుదే కీలకపాత్ర అని పేర్కొంది. భూముల కొనుగోలు వ్యవహారంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత భర్త అనిల్‌కుమార్ ప్రమేయం ఉందని తెలిపింది. గౌతమ్ మల్హోత్రా, అమన్‌దీప్, మాగుంట రాఘవ, అరుణ్ పిళ్లై వాంగ్మూలాల ఆధారంగా రెండు చార్జిషీట్లను సోమవారం ఈడీ ప్రత్యేక కోర్టుకు సమర్పించింది. మరిన్ని వివరాలు రాబట్టేందుకు నిందితుల్ని కస్టడీలోకి ఇవ్వాలని ఈడీ కోరింది. రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు జడ్జి ఎంకే నాగ్‌పాల్ ఈడీ చార్జిషీట్లను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ చార్జిషీట్లలో

మిగతా 10వ పేజీలో ▶

థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

పటాయాలో అక్రమంగా గ్యాంబ్లింగ్ డెన్ నిర్వహిస్తుండగా పట్టుకున్న థాయ్ పోలీసులు

- చీకోటి, అతని ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి సహా ఆరుగురి అరెస్ట్
- పేకాట ఆడుతున్న 83 మంది భారతీయులు అదుపులోకి.. జరిమానా అనంతరం విడుదల
- రూ. 16 లక్షల భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ స్వాధీనం
- పట్టుబడ్డ వారిలో మెదక్ డీసీసీబీ చైర్మన్ సహా తెలంగాణ, ఏపీకి చెందిన ప్రముఖులు



గ్యాంబ్లింగ్ డెన్‌ను పరిశీలిస్తున్న థాయ్ పోలీసులు



చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్/సిద్దిపేట: థాయ్‌లాండ్‌లోని పటాయాలో అక్రమంగా కెసినో నిర్వహిస్తున్న ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన చీకోటి ప్రవీణ్‌తోపాటు అతడి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని అక్కడి చోన్బూరీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అలాగే ఈ దందాకు సహకరించిన థాయ్ మహిళ సిత్రానన్ కౌల్వర్‌తోపాటు మరో ముగ్గురినీ కటకటాల్లోకి పంపారు. పటాయాలోని బంగ్‌లమూంగ్ జిల్లా చోన్బూరీ ప్రావిన్స్‌లో ఉన్న ఆసియా హోటల్‌లోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో అక్రమంగా

మిగతా 10వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శిపై

ఈడీ ప్రశ్నలవర్షం

పేపర్ లీకేజీపై ఏకధాటిగా 11 గంటలపాటు విచారణ

లీకేజీ ముందు, తర్వాత తీసుకున్న చర్యలపై వాంగ్మూలాల నమోదు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో సుమారు రూ. 40 లక్షలు చేతులు మారినట్లు తేలడం, ఇందులో మనీలాండరింగ్ కోణం ఉండటంతో రంగంలోకి దిగిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)... తాజాగా పరీక్షల నిర్వహణ తీరుతెన్నులు, లీకేజీ పరిణామాలపై కమిషన్ చైర్మన్ బి. జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌లను సోమవారం సుదీర్ఘంగా విచారించింది. వారిని ఏకదాటిగా 11 గంటలపాటు విచారించి వాంగ్మూలాలు నమోదు చేసింది.

అన్ని కోణాల్లో ప్రశ్నలు..: ఈడీ అధికారుల నోటీసుల మేరకు జనార్దన్‌రెడ్డి, అనితా రామచంద్రన్‌లు సోమవారం ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిని వేర్వేరుగా అన్ని కోణాల్లో విచారించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల నిర్వహణ ఎలా ఉంటుంది..? ప్రశ్నపత్రాల తయారీ, వాటి భద్రత, చైర్మన్, కార్యదర్శిల పర్యవేక్షణ, కాన్ఫిడెన్షియల్ సెక్షన్‌లో ఉద్యోగుల విధులు, ఆ విభాగంలోకి ఇతర ఉద్యోగులు వెళ్లేందుకు ఉన్న అవకాశాలు వంటి అంశాలపై వివరాలు సేకరించారు. అలాగే పేపర్ల లీకేజీ వ్యవహారం వెలుగులోకి

మిగతా 2వ పేజీలో ▶



టెలిఫోన్ భవన్ వద్ద రేవంత్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు


సచివాలయానికి ఎంపీ వెళితే

అడ్డుకుంటారా?

ఆర్టీఐ కింద దరఖాస్తు ఇచ్చేందుకు సెక్రటేరియట్‌కు వెళ్లాను: రేవంత్‌రెడ్డి

- రూ. లక్ష కోట్ల విలువైన ఓఆర్‌ఆర్‌ను ప్రైవేటుకు కట్టబెట్టారు.. అవినీతి బయటపడుతుందనే అడ్డుకున్నారు
- కేటీఆర్‌ను జైల్లో పెట్టే వరకు పోరాడతామని వెల్లడి

2లో




వరంగల్ శివారు కరుణాపురంలో 11 ఎకరాల్లో, రూ. 70 కోట్లతో నిర్మితమైన ఆసియాలోనే అతిపెద్ద చర్చి ఇది. ఈనెల 4న ప్రారంభం కానుంది.

- వివరాలు 2లో

ఇదండీ సంగతి



వెంటనే విడాకులు



కలిసి ఉండలేకుంటే తక్షణం విడిపోవచ్చు

దంపతులు పరస్పరం అంగీకరిస్తే చాలు

- ఆర్నెల్ల వెయిటింగ్ పీరియడ్ అక్కర్లేదు
- ఆ విచక్షణాధికారం సుప్రీంకోర్టుకు ఉంది
- రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు

న్యూఢిల్లీ: వివాహ బంధం పునరుద్ధరించలేనంతగా దెబ్బ తింటే దంపతులు పరస్పర అంగీకారంతో తక్షణం విడాకులు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఇలాంటి సందర్భాల్లో హిందూ వివాహ చట్టం (1955)లో విధించిన ఆరు నెలల తప్పనిసరి వెయిటింగ్ పీరియడ్ వర్తించదని స్పష్టం చేసింది. ఆర్టికల్ 142 కింద ఉన్న అసాధారణ అధికారాలతో వెంటనే విడాకులు మంజూరు చేసే విచక్షణాధికార పరిధి అత్యున్నత న్యాయస్థానానికి ఉందని తేల్చి చెప్పింది. ఫ్యామిలీ కోర్టులతో నిమిత్తం లేకుండా సుప్రీంకోర్టు నేరుగా విడాకులు మంజూరు చేయడంపై పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆర్టికల్ 142(1) కింద తక్షణం విడాకులు మంజూరు చేసే అధికార పరిధి సుప్రీంకోర్టుకు ఉందా వంటి ప్రశ్నలను లేవనెత్తాయి. న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.కె.కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎ.ఎస్.ఓకా, జస్టిస్ విక్రం నాథ్, జస్టిస్ జె.కె. మహేశ్వరిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. వాదనలు విన్న అనంతరం గత సెప్టెంబర్‌లో తీర్పును రిజర్వు చేసింది. తాజాగా సోమవారం తీర్పు వెలువరించింది.

ఆ అధికారాన్ని ఆచితూచి వాడాలి

ఆర్టికల్ 142(1) కింద దఖలు పడిన అసాధారణ అధికారాల ద్వారా సుప్రీంకోర్టు జారీ చేసే ఆదేశాలు దేశవ్యాప్తంగా అమలవుతాయి. వాటి పరిధి అత్యంత విస్తృతమైనదని ధర్మాసనం గుర్తు చేసింది. కనుక ఆ అధికారాలను ఆచితూచి వాడాలని అభిప్రాయపడింది. ''వివాహ బంధం పూర్తిగా

మిగతా 2వ పేజీలో ▶

అలలపై పడవ ప్రయాణం..

సహజ నీరా పానీయం

నగర పర్యాటకానికి సరికొత్త సొబగులు

సాగర్ ఒడ్డున నీరా కేఫ్ ప్రారంభం రేపే

నీరాతోపాటు అనుబంధ ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి..



సాక్షి, హైదరాబాద్: సాగర తీరం మరో ఆతిథ్యానికి సన్నద్ధమైంది. సహజమైన నీరాతో పాటు తెలంగాణ రుచులను అందజేసే నీరా కేఫ్ ప్రారంభోత్సవానికి సర్వం సన్నద్ధమైంది. పర్యాటక, ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న నీరాకేఫ్‌ను ఈ నెల 3వ తేదీన ప్రారంభించనున్నారు. హుస్సేన్‌సాగర్

మిగతా 2వ పేజీలో ▶

వచ్చే ఐదేళ్లలో నికరంగా...

1.4 కోట్ల కొలువులకు కోత



వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా

వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాల సృష్టిలో నికరంగా భారీ తగ్గుదల నమోదవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. కొత్తగా 6.9 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగనుండగా ఏకంగా 8.3 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయని పేర్కొంది. నికరంగా 1.4 ఉద్యోగాలకు కోత పడుతుందని 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' పేరిట విడుదల చేసిన ద్వైవార్షిక నివేదికలో వివరించింది. ప్రస్తుతం మొత్తం ప్రపంచ ఉద్యోగితలో ఇది 2 శాతం. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 23 శాతం ఉద్యోగుల వలస చోటుచేసుకోవచ్చని పేర్కొంది.

ఏఐతో 2.6 కోట్ల ఉద్యోగాలకు ఎసరు

భారత్‌లో 22 శాతం ఉద్యోగుల వలస

'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదికలో వెల్లడి

- వివరాలు 6లో

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి సీఎం కేసీఆర్

4న పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు మంగళవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లను న్నారు. వసంత్ విహార్‌లో నిర్మించిన బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 4న ప్రారం భించాలని ఇటీవల కేసీఆర్ నిర్ణయం తీసుకు న్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంగళవారం ఢిల్లీకి వెళ్లను న్నారని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలపై అధిక దృష్టి సారించిన నేపథ్యంలో.. ఢిల్లీ పర్యటన సందర్భంగా ఆయన పలువురు జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలతో సమావేశమయ్యే అవకాశం ఉంది.

గల్లీలో తిడుతూ ఢిల్లీలో అవార్డులిస్తున్నారు



సాక్షి, సిద్దిపేట: బీజేపీ నాయకులు గల్లీలో తిడుతున్నారని, ఢిల్లీలో అవార్డులు ఇస్తున్నారని ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన మేడే, గొర్రెల పంపిణీ కార్యక్రమాల్లో ఆయన మాట్లా డారు. ఇక్కడి పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొడుతోందని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి మాంసాన్ని దిగుమతి చేసుకో కుండా.. ఇక్కడి గొల్లకుర్మలకే గొర్రెలు ఇచ్చి మాంసం ఉత్పత్తి చేయడం కోసం రూ.11 వేల కోట్ల నిధులతో గొర్రెల పంపిణీ పథకాన్ని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని వివరిం చారు. కార్మికులకు కులం, మతం లేదని, కార్మి కుల శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మి కుల హక్కులు కాలరాస్తుందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కార్మికులు శ్రమదోపిడీకి గురవుతు న్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

నిలకడగా కిషన్‌రెడ్డి ఆరోగ్యం



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోగ్యం నిలక డగా ఉందని ఎయిమ్స్ వైద్యులు తెలిపా రు. ఆదివారం రాత్రి ఎగువ ఉదరభాగంలో నొప్పి కారణంగా ఆయ న ఆసుపత్రిలో చేరారని, ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయనను అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు వైద్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీఎంకి పంచాయతీ కార్యదర్శులు గుర్తు లేదా?


బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సమ్మె శిబిరంలో కూర్చున్న ప్రవీణ్ కుమార్

మునుగోడు: కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ వెట్టిచాకిరీ చేయా ల్సిన పరిస్థితి నెలకొందని, సీఎం కేసీఆర్ కుటుంబ పాలన వల్లనే ఇది దాపురించిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడులో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు ప్రవీణ్‌కుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా ప్రొబేషనరీ కాలం రెండేళ్లు ఉంటుందని, పంచాయతీ కార్యద ర్శులని నియమించి నాలుగేళ్లు పూర్తయినా పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. సచివాలయం ప్రారంభో త్సవం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగులని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తున్నామని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు పంచాయతీ కార్యదర్శులు, ఎంతో కాలంగా సమ్మె చేప డుతున్న వీఓఏలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. దళిత బంధు పథకంలో వేల కోట్ల అవినీతి జరుగుతోందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆయన మునుగోడులో విలేక రులతో మాట్లాడుతూ.. అర్హులకు దళిత బం ధు యూనిట్ మంజూరు చేసేందుకు ఒక్కొక్కరి వద్ద ఎమ్మెల్యేలు రూ.3 లక్షలు తీసు కుంటున్నారని ఆరోపించారు. గత ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో మునుగోడుని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించిన కేటీఆర్ ఇప్పటి వరకు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు.

ఫిర్యాదు చేయడానికొస్తే రేవంత్‌ను అడ్డుకుంటారా?



సాక్షి, హైదరాబాద్: ఓఆర్ఆర్ లీజులో అవినీతిపై ఫిర్యాదు చేయడానికి కొత్త సచి వాలయానికి వస్తే టీపీసీసీ చీఫ్, ఎంపీ రేవంత్‌రెడ్డిని అడ్డుకోవడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చెరుకు సుధాకర్ ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. రేవంత్‌ను అడ్డగించడం ఏమి సందేశమిస్తుందో కేసీఆరే చెప్పాలని సోమవారం ఒక ప్రకటనలో ఆయన నిలదీ శారు. ఆత్మగౌరవ ప్రతీక, సుపరిపాలన వేది కగా ప్రచారం చేసుకొని ప్రారంభించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో ఎంపీని అడ్డుకోవడం విడ్డూరమన్నారు.

ఎటుచూసినా ఉట్టిపడుతున్న కళాసంపద...
జెరూసలెం నుంచి తెచ్చిన మట్టి..
బైబిల్ నియమాల ప్రకారం కట్టడాలు..
భక్తులే భాగస్వాములై రోజుకు 500 మంది
చొప్పున స్వచ్ఛందంగా నిర్మాణ పనుల్లో
పాలుపంచుకున్న వైనం.. ఏకకాలంలో సుమారు
30 వేల మంది ప్రార్థన చేసుకొనే వీలు..

ఇవీ వరంగల్ శివారు కరుణాపురంలో 11 ఎకరాల్లో నిర్మితమైన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం విశిష్టతలు. ఆసియా ఖండంలో అతిపెద్ద చర్చిగా నిర్వాహకులు పేర్కొంటున్న ఈ ప్రార్థనా మందిరం ఈ నెల 4న అంగరంగ వైభవంగా ప్రారంభానికి సిద్ధమైంది. ప్రారంభోత్స వానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు, అన్ని వర్గాల వారిని అహ్వానిస్తు న్నట్లు నిర్వాహకులు, దైవజనులు పాల్సన్‌రాజ్, జయప్రకాష్‌లు తెలిపారు. లక్ష మందికి భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. - సాక్షి, వరంగల్ డెస్క్



భక్తులే భాగస్వాములుగా వరంగల్ శివారులో నిర్మాణం

4న ప్రారంభోత్సవానికి క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం ముస్తాబు..

ఏకకాలంలో 30 వేల మంది ప్రార్థనలకు వీలు

ఆసియాలో అతి పెద్ద చర్చి

కరుణాపురం క్రీస్తు జ్యోతిప్రార్థన మం దిరం అపురూప కట్టడంగా దర్శనమిస్తోంది. 11 ఎకరాల సువిశాల స్థలంలో 2016 జూన్ 11న ఈ మందిరానికి పునాది వేశారు. రెండంతస్తుల్లో హాల్‌ను రూపొందించారు. చర్చి నిర్మాణానికి ఇప్పటివరకు రూ. 70 కోట్లు ఖర్చయినట్లు నిర్వా హకులు



పాల్సన్‌రాజ్




జయప్రకాష్

అద్భుత కట్టడంగా..

తెలిపారు. చర్చి ప్లింత్ ఏరియా 1,50,000 చద రపు అడుగులు కాగా, మొత్తంగా 240 అడుగుల వెడల్పు, 240 అడుగుల ఎత్తుతో దీన్ని నిర్మిం చారు. ఇందులో ఒకేసారి 30 వేల మంది భక్తులు ప్రార్థనలు చేసుకోవచ్చు. వికీపీడియా ప్రకారం ఆసియాలో అతిపెద్ద చర్చిగా నాగాలాం డ్‌లోని జున్‌హెబోటోలో ఉన్న బాప్టిస్ట్ చర్చి ఉంది. ఆ చర్చి పొడవు 203 అడుగులు, వెడల్పు 153 అడుగులు, ఎత్తు 166 అడుగులు. అందులో ఏకకాలంలో 8,500 దాకా ప్రార్థనలు చేసుకొనే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం కరుణాపురంలో నిర్మితమైన క్రీస్తుజ్యోతి ప్రార్థనా మందిరం నాగాలాండ్ బాప్టిస్ట్ చర్చికన్నా పెద్దది కావడం విశేషం.

ప్రత్యేకతలు ఇవీ..

- చర్చి పైభాగంలో అమర్చిన అల్యూమినియం గోపురాన్ని (డోమ్) అమెరికా నుంచి తెప్పించారు. ఫ్రాన్స్ నుంచి నెక్సో సౌండ్ సిస్టం కొనుగోలు చేశారు.
- మందిరం లోపల రీసౌండ్ రాకుండా సౌండ్‌ప్రూఫ్ మెటీరియల్ అద్దారు.
- భక్తుల కోసం హెలికాప్టర్ పంకా తరహాలో భారీ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు.
- ప్రార్థనామందిరం లోపల వియత్నాం నుంచి తెచ్చిన మార్బుల్స్ వేశారు.
- పిల్లర్ల నిర్మాణంలో హాలెండ్ టెక్నాలజీ వాడారు. చర్చి భవనం చుట్టూ ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని అద్దాల చిత్తరువులతో రూపొందించారు.
- ఎల్ఈడీ స్క్రీన్స్‌తో కూడిన ప్రత్యేక వేదిక, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- చుట్టూ దీపస్తంభాలు.. ఇంకుడు గుంతలు నిర్మించారు.
- భవనం శంకుస్థాపనలో జెరూసలెం నుంచి మట్టి.. బైబిల్‌లో పేర్కొన్న విధంగా వజ్రాలు, రాళ్లు వేశారు. చర్చి చుట్టూ ఆలివ్ (ఏసుక్రీస్తు ప్రార్థనలు ఈ ఆలివ్ చెట్ల మధ్యనే ప్రార్థనలు చేసేవారు) చెట్లు ఏర్పాటు చేశారు.



ఏసుక్రీస్తు తన శిష్యులతో ఓడలో ప్రయాణం చేసిన చిత్తరువు

గేదెలూ ఇవ్వలేదు.. డబ్బులూ వేయలేదు


దళిత బంధులో దగా

- సూర్యాపేట జిల్లా తొండ గ్రామంలో 23 మంది లబ్ధిదారులకు అందని డెయిరీ యూనిట్లు
- నిరసన వ్యక్తం చేసిన లబ్ధిదారులు

తిరుమలగిరి (తుంగతుర్తి): ఓ కాంట్రాక్టర్.. దళిత బంధు పథకం లబ్ధిదారులను నిలువునా దగా చేసిన ఉదంతం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. దళితబంధు పథకంలో భాగంగా తొండ గ్రామానికి చెందిన 23 మంది దళితులు డెయిరీ ఫామ్ యూనిట్లు ఎంపిక చేసుకున్నారు. గేదెలను ఉంచేందుకు కాంట్రాక్టర్ వీరికి ఒక్కొక్క రికీ రూ.1.50 లక్షలతో షెడ్లు నిర్మించాడు. మిగిలిన రూ.8.40 లక్షలతో 8 గేదెలను లబ్ధిదారుకు ఇవ్వాల్సి ఉంది.ఈ మేరకు మొదటగా ఒక్కో లబ్ధిదారుడికి నాలుగు చొప్పున గేదెలను అందజే శారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలిం చక కొన్ని చోట్ల గేదెలు, దూడలు చనిపోయాయి. ఇదే అదునుగా భావించిన కాంట్రాక్టర్ గేదెలకు బదులు, నగదు ఇస్తానని నమ్మ బలికించాడు. ఈక్ర మంలో కాంట్రాక్టర్ 11 మంది లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తణుకుకి తీసుకెళ్లి మూడు రోజుల పాటు అక్కడే ఉంచి గేదెల ఎదుట లబ్ధిదా రులతో ఫొటోలు తీయించుకొని అప్‌లోడ్ చేశాడు. మిగతా 4 గేదెలకు రూ.4 లక్షలు జమ చేస్తానని, అకౌంట్ నంబర్లు ఇవ్వాలని లబ్ధిదారులను కోరాడు. కొందరికి రూ.90వేలు, మరికొందరికి లక్షన్నర.. ఇలా కేవలం ముగ్గురు నలుగురి అకౌం ట్లలో వేశాడు. మిగిలిన వారు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడంలేదు. ఆ తర్వాత స్విచ్ఛాఫ్ చేసేశాడు. దీంతో మోసపోయామని గుర్తించిన మిగిలిన లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు. గేదెలైనా, లేదంటే డబ్బులైనా ఇప్పించాలని సోమవారం తొండలోని ఎస్సీకాలనీలో ఆందోళన చేశారు.

విడాకులు ఎక్కడ ఎలా?

విడాకులపై సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు సంగతి అలా ఉంచితే.. ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే అతి తక్కువ విడాకుల కేసులు నమోదవుతున్నాయి. దేశంలో ప్రతీ వెయ్యి వివాహాల్లో 13 పెళ్లిళ్లు పెటాకులవుతున్నాయి. అంటే భారత్‌లో విడాకులు కేవలం ఒక్కశాతమే. ఈ నేపథ్యంలో విడాకులు ఏఏ దేశాల్లో ఎక్కువగా, ఏఏ దేశాల్లో తక్కువగా నమోదవుతున్నాయో చూద్దాం...!
– సాక్షి, సెంట్రల్ డెస్క్



వెంటనే విడాకులు

▶ మొదటి పేజీ తరువాయి

దెబ్బ తిన్న సందర్భాల్లో విడాకుల మంజూరు సుప్రీంకోర్టు అధికారానికి సంబంధించిన విషయం కాదు. విచక్షణకు సంబంధించినది. సుప్రీంకోర్టు సమస్యల పరిష్కర్తగా వ్యవహరిస్తుంది. కనుక ఇలాంటి విచక్షణాధికారాలను ఇరుపక్షాలకూ పరిపూర్ణ న్యాయం జరిగే రీతిలో అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటూ అత్యంత జాగరూకతతో వినియోగించాల్సి ఉంటుంది. వివాహం పూర్తిగా విఫలమైందని, దంపతులు కలిసి జీవించే పరిస్థితులు లేవని రుజువై, ఆ బంధాన్ని ఇంకా కొనసాగించడం అన్యాయమని న్యాయస్థానం విశ్వసిస్తే తక్షణం విడాకులు మంజూరు చేయవచ్చు'' అని పేర్కొంది. భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు భరణం (సీఆర్‌పీసీ సెక్షన్ 125), వివాహితపై గృహ హింస (ఐపీసీ 498–ఎ) తదితరాల నిబంధనలను కూడా ఇలాంటి సందర్భాల్లో సుప్రీంకోర్టు పక్కన పెట్టవచ్చని స్పష్టం చేసింది.

సచివాలయానికి ఎంపీ వెళితే అడ్డుకుంటారా?

- ఆర్టీఐ కింద దరఖాస్తు ఇచ్చేందుకు సెక్రటేరియట్‌కు వెళ్లాను: రేవంత్‌రెడ్డి
- అనుమతి లేదని పోలీసులు టెలిఫోన్ భవన్ వద్ద అడ్డుకున్నారు
- రూ.లక్ష కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను ప్రైవేటుకు కట్టబెట్టారు
- అవినీతి బయటపడుతుందనే ప్రభుత్వం అడ్డుకుంది
- కేటీఆర్‌ను జైల్లో పెట్టే వరకు పోరాడతామని వెల్లడి



రేవంత్ వాహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగురోడ్డు టెండర్లలో జరిగిన అవినీతి బయటపడుతుందనే ప్రభుత్వం తనను సెక్రటేరియట్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి ఆరోపించారు. లక్ష కోట్ల విలువైన ఔటర్ రింగ్ రోడ్డును కేసీఆర్, కేటీఆర్ తెగనమ్ముకున్నారని విమర్శించారు. సోమవారం ఓఆర్ఆర్‌పై వివరాల కోసం ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయానికి వచ్చిన రేవంత్‌రెడ్డిని టెలిఫోన్ భవన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌కు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. మాసాబ్‌ట్యాంక్‌లోని మున్సిపల్ (ఎంఏయూడీ) కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పోలీసులు సూచించడంతో రేవంత్ అక్కడికెళ్లారు. అక్కడ సెక్షన్ ఆఫీసర్‌కు దరఖాస్తు అందజేసిన అనంతరం రేవంత్ మీడియాతో మాట్లాడారు. ఆదివారం నుంచే సెక్రటేరియట్ నుంచి పరిపాలన సాగుతుందంటూ అంబేడ్కర్ సిద్ధాంతాల గురించి ఉపన్యాసం ఇచ్చిన కేసీఆర్ 24గంటలు తిరగక ముందే మరిచారని ఎద్దేవాచేశారు. గత 20 ఏళ్లలో ఎప్పుడూ ఎమ్మెల్యేలు, ఎంపీలను సచివాలయానికి రాకుండా అడ్డుకోలేదన్నారు. అధికారులను కలిసి సమాచార హక్కు కింద దరఖాస్తు చేయడానికి వెళ్తున్నానని చెప్పినా పోలీసులు వినలేదని చెప్పారు. ఒక ఎంపీకి ప్రత్యేకంగా అనుమతేంటని ప్రశ్నించారు. 'హెచ్ఎండీఏ కార్యాలయం ఇంకా షిఫ్ట్ కాలేదని చెప్పి ఇక్కడికి తెచ్చారు. కానీ ఇక్కడికి వచ్చి దరఖాస్తు ఇస్తే అక్నాలెడ్జిమెంట్‌పై రబ్బరు స్టాంప్ కూడా వేయలేదు. ఆఫీసు సచివాలయానికి షిఫ్ట్ అయ్యిందని సమాధానం ఇచ్చారు. ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ ఇక్కడా లేరు.. అక్కడా లేరు. మరి ఆయన ఎక్కడ ఉన్నారు? కేసీఆర్ ఫామ్ హౌస్‌లో ఉన్నారా? లక్ష కోట్ల విలువైన ఓఆర్ఆర్‌ను అమ్ముకున్నారు. ఇది వేల కోట్ల కుంభకోణం. దీనివెనక కేసీఆర్, కేటీఆర్ ఉన్నారు. దీనిపై విచారణ సంస్థలకు ఫిర్యాదు చేస్తాం. న్యాయస్థానాల తలుపు తడతాం. కేటీఆర్‌ను జైల్లో పెట్టే వరకు పోరాడతాం'అని చెప్పారు.

పోలీసులకు అభ్యంతరమేంటి?

సచివాలయ భవనంలోకి వెళ్లేందుకు పార్లమెంటు సభ్యుడికి అనుమతి అవసరం లేదని.. అయినా కిలోమీటర్ దూరంలోనే పోలీసులు తనను అడ్డుకున్నారని రేవంత్ చెప్పారు. కనీసం సెక్రటేరియట్ గేటు వద్దనైనా తన దరఖాస్తును తీసుకోవాల్సిందన్నారు. కానీ సచివాలయం గేటు వద్దకు కూడా తనను రానివ్వలేదని మండిపడ్డారు. తానొక్కడినే వెళ్లి అరవింద్‌కుమార్‌ను కలుస్తానంటే పోలీసులకు అభ్యంతరమేంటని నిలదీశారు. భవిష్యత్ తరాలకు వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చాలని, అభివృద్ధిని అందించాలనే సంకల్పంతో ఓఆర్ఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. ఇందుకోసం ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6,696 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఖర్చు చేసిన డబ్బులను తిరిగి రాబట్టుకోవడానికి టోల్ విధానాన్ని ప్రభుత్వం తెచ్చిందని పేర్కొన్నారు. 'ఓఆర్ఆర్‌పై ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్ల టోల్ ఆదాయం ఉంది. అలాంటి దాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.246 కోట్లకే ముంబై కంపెనీ ఐఆర్‌బీకి కట్టబెట్టింది. బంగారు బాతు ఓఆర్ఆర్‌ను కేటీఆర్ 30 ఏళ్ల కాలానికి రూ.7,388 కోట్లకు తెగనమ్మారు. బీఆర్ఎస్‌ను ప్రజలు బొంద పెట్టే రోజు దగ్గర్లోనే ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే మొత్తం టెండర్లపై విచారణ చేయిస్తాం. ఎవరినీ వదిలే ప్రసక్తి లేదు'అని పేర్కొన్నారు.



నీరా కేఫ్‌లో కుల వృత్తులకు అద్దం పట్టే ఓ దృశ్యం

అలలపై పడవ ప్రయాణం.. సహజ నీరా పానీయం..

▶ మొదటి పేజీ తరువాయి

ఒడ్డున ఏర్పాటు చేసిన నీరాకేఫ్ నగరవాసులకు సరికొత్త అనుభూతినివ్వనుంది. ఇక్కడి నుంచి సాగర్‌లో విహరించేందుకు పర్యాటకశాఖ బోటు షికారును కూడా అందుబాటులోకి తెచ్చింది. పీపుల్స్ ప్లాజా వైపు వచ్చే సందర్శకులు నీరా సేవనంతో పాటు పడవ ప్రయాణం కూడా చేయవచ్చు. తాటి, ఈత చెట్ల నుంచి లభించే ప్రకృతి సిద్ధమైన నీరా పానీయాన్ని నగరవాసులకు అందించేందుకు ఎక్సైజ్ శాఖ సుమారు రూ.10 కోట్లతో నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజా సమీపంలో ఈ కేఫ్‌ను నిర్మించింది.

ఆకర్షణీయంగా భవనం..

నీరాభవనం తాటాకుతో చేసిన రేక ఆకృతిలో ఎంతో ఆకర్షణీయంగా నిర్మించారు. పల్లెల్లో తాటి, ఈత కల్లును తాటాకులతో చేసిన రేకలు, మోదుగాకు డొప్ప(దొన్నె)లలో సేవించడానికి ఇష్టపడతారు. ఇలా ఆకుల్లో తాగడం వల్ల పానీయం సహజత్వం ఏ మాత్రం కోల్పోకుండా ఉంటుంది. అలాంటి తాటాకు రేక కప్పినట్టుగా నీరా భవనాన్ని నిర్మించడం విశేషం. తెలంగాణ పల్లెలను తలపిస్తూ అందమైన మ్యూరల్స్, చేతివృత్తులను ప్రతిబింబించే శిల్పాలతో భవనం ప్రాంగణాన్ని రూపొందించారు. ఈ కేఫ్‌లో మొత్తం ఏడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఒక కౌంటర్‌ను పూర్తిగా నీరా కోసం కేటాయించగా మిగతా ఆరింటిలో వివిధ రకాల ఆహార పదార్థాలు, ఐస్‌క్రీమ్‌లు, బిర్యానీలు లభిస్తాయి. హుస్సేన్ సాగర్ జలాలను, పోటెత్తే అలలను వీక్షిస్తూ నచ్చిన రుచులను ఆస్వాదించవచ్చు. ఇందుకనుగుణంగా సీటింగ్ సదుపాయం ఉంటుందని పర్యాటకాభివృద్ధి సంస్థ అధికారి ఒకరు తెలిపారు. భవనం మొదటి అంతస్తులో ఉన్న విశాలమైన హాల్లో పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి వేడుకలు నిర్వహించుకోవచ్చు. విందులు ఏర్పాటు చేసుకొనే సదుపాయం కూడా ఉంటుంది.

ఆహార ఉత్పత్తులు	ధర (సుమారుగా)
300 ఎంఎల్ తాటి నీరా	రూ. 90
200 ఎంఎల్ తాటి నీరా	రూ. 60
తాటిబెల్లం (కిలో)	రూ.1000
తాటి చక్కెర (కిలో)	రూ. 1050
తాటి బూస్ట్	రూ. 1100
తాటి తేనె (లీటర్)	రూ.1200
ఈత బెల్లం (కిలో)	రూ.900
ఈత తేనె (లీటర్)	రూ.1000

ఆరోగ్య ప్రదాయిని....

తాటి, ఈత చెట్ల నుంచి తెల్లవారుజామునే సేకరించే నీరాలోని సహజమైన పోషకవిలువలు ఏ మాత్రం పోకుండా శీతలీకరణ పద్ధతిలో నిల్వ చేసి విక్రయిస్తారు. ఇందుకోసం నీరా భవనంలో ప్రత్యేక శీతలీకరణ యంత్రాలను ఏర్పాటు చేశారు. భువనగిరి సమీపంలోని నందనం, కద్తాల్ సమీపంలోని ముద్విన్‌లో ఏర్పాటు చేసిన తాటివనాల్లో నీరా కోసమే ప్రత్యేకంగా పెంచిన తాటి, ఈత చెట్ల నుంచి నీరా సేకరిస్తారు. దాంతోనే అనుబంధ ఉత్పత్తులను కూడా తయారు చేస్తున్నారు. 'పానీయంలోని స్వచ్ఛతకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు.. తాటి చెట్ల నుంచి నీరాను సేకరించడం మొదలు.. దానిని వినియోగదారులకు చేర్చే వరకు శాస్త్రీయమైన పద్ధతిని పాటిస్తున్నాం'అని నిర్వాహకులు తెలిపారు. నీరాలో శరీరానికి అవసరమైన ప్రోటీన్, ఐరన్, పొటాషియం, కాల్షియం, విటమిన్లు, మినరల్స్ లభిస్తాయి. నీరాతో పాటు తాటి, ఈత చెట్ల నుంచి సేకరించిన నీరా ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను కూడా విక్రయించనున్నారు. ఆడ, మగ తాటి చెట్ల నుంచి సేకరించే రెండు రకాల తాటి బెల్లం కూడా ఇక్కడ లభించనుంది.

కేసీఆర్ కుటుంబమే వెలిగిపోతోంది

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- ఖర్చులు, అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



కొలనుపాకలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, యాదాద్రి: ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబమే వెలిగిపోతోందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో ప్రారంభమై కొలనుపాక, రాజానగరం, రాజాపేట మండలం దూదివెంకటాపురం మీదుగా రఘునాథపురానికి చేరుకుంది. కొలనుపాక, రఘునాథపురంలలో జరిగిన కార్నర్ మీటింగ్‌లలో భట్టి మాట్లాడారు. ఆ తర్వాత కొలనుపాక గ్రామ శివారులో ఆయన ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్లఅయిలయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కుడుదుల నగేశ్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. మైసూర్ ప్యాలెస్ తరహాలో నూతన సెక్రటేరియట్‌ను నిర్మించి తెలంగాణ వెలిగిపోతోందని సీఎం అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రగతిశీల భావనతో సామాజిక తెలంగాణ కావాలని తెచ్చుకున్న రాష్ట్రంలో సీఎం నయా ఫ్యూడల్ సంప్రదాయాన్ని తీసుకువస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ కూడా దేశంలో భాగమేనని ఒక్కొక్కరికీ వందల ఎకరాల్లో ఫాం హౌస్‌లు ఎట్లా ఉంటాయని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదాయం, ఖర్చులు, చేసిన అప్పులు, అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజెప్పేందుకు శ్వేతపత్రం విడుదల చేయాలని భట్టి డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ వల్ల జరుగుతున్న నష్టం ప్రజలకు తెలుస్తోందన్నారు. ధరణి వల్ల భూములపై హక్కులు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే హక్కులు కల్పిస్తామని చెప్పారు.



పాలమూరుపై సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో మంత్రులు సబిత, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ శాంతకుమారి

ఆగస్టులోగా 'పాలమూరు' తాగునీళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణ నూతన సచివాలయంలో సోమవారం పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీఎం కేసీఆర్ తొలి సమీక్ష నిర్వహించారు. తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు పనులను కొనసాగించడానికి సుప్రీంకోర్టు అనుమతించిన నేపథ్యంలో.. అందుకు సంబంధించిన పనుల పురోగతిపై చర్చించారు. పంపుహౌస్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, కన్వేయర్ సిస్టమ్‌లో మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ పనుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. వాటిలో మిగిలిన కొద్దిపాటి పనులను జూన్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే, ఈఎన్సీ మురళీధర్‌రావు, అడ్వైజర్ పెంటారెడ్డి, మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ద్వితీయం పూజల్లో పాల్గొన్న సీఎం

నూతన సచివాలయంలో సీఎం కేసీఆర్ సోమవారం బిజీబిజీగా గడిపారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆయన తూర్పు ప్రధాన ద్వారం ద్వారా సచివాలయంలోకి ప్రవేశించారు. నేరుగా యాగశాలకు చేరుకున్నారు. అక్కడ వేదపండితులు నిర్వహించిన ద్వితీయం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆరో అంతస్తుకు చేరుకున్నారు. తన కార్యదర్శులు, అదనపు కార్యదర్శులు, పీఆర్వో కార్యాలయాలను పరిశీలించారు. కారిడార్లలో కలియదిరిగారు. అనంతరం తన చాంబర్‌లో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సమీక్ష నిర్వహించారు. సాయంత్రం 5.20 గంటల ప్రాంతంలో ప్రగతి భవన్‌కు బయలుదేరారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శిపై ఈడీ ప్రశ్నల వర్షం

▶ మొదటి పేజీ తరువాయి



జనార్దన్‌రెడ్డి



అనిత

వచ్చిన తీరు, తీసుకున్న చర్యలు తదితర అంశాలపైనా ప్రశ్నించారు. అనంతరం ఈ కేసులోని కీలక నిందితులైన ప్రవీణ్ కుమార్, రాజశేఖర్‌రెడ్డిల పాత్రపై ఆరా తీసినట్లు తెలిసింది. ఉద్యోగంలో వారి చేరికతోపాటు విధులు, బాధ్యతలు, ప్రవర్తన ముఖ్యంగా టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చే మహిళా అభ్యర్థులతో ప్రవీణ్ స్నేహాల గురించి అనితా రామ్‌చంద్రన్‌ను ఈడీ ప్రశ్నించినట్లు సమాచారం. లీకేజీకి పాల్పడిన ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఈ కేసులో ఇంకెవరైనా సంబంధం ఉన్నట్టు అంతర్గత దర్యాప్తులో తెలిసిందా? అని జనార్దన్‌రెడ్డిని అడిగినట్లు తెలిసింది. తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ ఉద్యోగులనూ ఈడీ ప్రశ్నించినట్లు తెలిసింది.

క్లుప్తంగా...

కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మేడే సందేశంలో సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా కర్షక, కార్మిక, వృత్తి పనులవారు, కూలీలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. మహోన్నతమైన విశ్వమానవ సాధానికి శ్రమజీవుల త్యాగాలే పునాదిరాళ్లని కొని యాడారు. కార్మిక, కర్షక సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంద న్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చొప్పున 35,796 కుటుంబాలకు రూ.288 కోట్లను, కుటుంబాల్లో 1,49,536 మంది లబ్ధిదారులకు రూ.94 కోట్లను, 39,797 మంది కార్మికుల అంత్యక్రియలకు రూ.98 కోట్లను, కోవిడ్ సమయంలో రూ.1,005 కోట్లను ఖర్చు చేశామని సీఎం వెల్లడించారు. తెలంగాణ కార్మిక సంక్షేమ ప్రగతి నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కృషి కొనసాగుతోందన్నారు.

సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి: మంత్రి మల్లారెడ్డి



గన్‌ఫౌండ్రీ: 'దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న ఖరీదైన ప్రధాని మోదీ అయితే.. సీఎం కేసీఆర్ కార్మికుల పక్షపాతి' అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. కార్మికశాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల పిల్లల కోసం పాఠశాలలు, కార్మికులకోసం ఆస్పత్రులను నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులకు, పలు కంపెనీల ప్రతినిధులకు, కార్మికులకు 'శ్రమశక్తి'పురస్కారాలను అందజేశారు.

పాలేరు నుంచే పోటీ చేస్తా

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల



పాలేరులో మొలకెత్తిన ధాన్యాన్ని షర్మిలకు చూపిస్తున్న రైతులు

ఖమ్మంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో కార్మికులను పురుగుల్లా చూస్తున్నారని ఆరోపించారు. ఖమ్మం రూరల్ మండలం సాయి గణేశ్ నగర్‌లోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో సోమవారం మేడే వేడుకల్లో భాగంగా షర్మిల పార్టీ జెండా ఎగురవేశారు. కేసీఆర్ ఆర్టీసీ కార్మికులు హక్కుల కోసం పోరాడకుండా సంఘాలనే రద్దు చేశారని, విద్యుత్ శాఖలోనూ అదే తీరు అవలంబిస్తున్నారని ఆమె అన్నారు. రాబోయే ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఆమె కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు.

మోదీవి కార్మిక వ్యతిరేక విధానాలు

ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు సాదినేని



జెండా ఎగురవేస్తున్న సాదినేని వెంకటేశ్వరరావు

కవాడిగూడ: ప్రాణత్యాగాలు చేసి కార్మికులు హక్కులు సాధించుకుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆ హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలబడుతోందని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. మేడే సందర్భంగా సోమవారం చంద్రపుల్లారెడ్డి భవన్ ప్రాంగణంతో పాటు నగరంలోని కార్మిక వాడల్లో ఆయన మేడే జెండాను ఎగరవేశారు. మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రతిఘటించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా కార్మిక హక్కులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, లేబర్ కోర్డు రద్దు కోసం పోరాడుదామని పిలుపు నిచ్చారు.

ఏపీ అంతటా కుండపోత

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: తీవ్రమైన ఎండలు మండే మే నెలలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రమంతా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, నంద్యాల, అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీవర్షాల కారణంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలంలో సోమవారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి ముచ్చుపోలు శ్రీనివాసులు (57)అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు.



కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని ఐకేపీ సెంటర్‌లో వర్షపు నీటిని మోటర్‌తో తొలగిస్తున్న రైతులు



నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లో వర్షానికి వడ్లు తడవకుండా కాపలా ఉన్న రైతు

వాన పడి.. కంటతడి

▶ మొదటి పేజీ తరువాయి

ఉండేది కాదని రైతులు అంటున్నారు. ధాన్యాన్ని అరబెట్టేందుకు కూడా వర్షాలు తెరిపినివ్వడం లేదని.. తడిసిన ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పలుచోట్ల కొనుగోళ్లు జరుగుతున్నా తేమ, తరుగు పేరుతో మిల్లర్లు ధాన్యం తీసుకునేందుకు మెలిక పెడుతున్నారు. లేకుంటే క్వింటాల్‌కు నాలుగైదు కిలోలకు పైగా కోత పెడుతున్నారని రైతులు వాపోతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో..

అకాల వర్షం మరోసారి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులను ఆగమాగం చేసింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి 19,568 ఎకరాల్లో పంటలు నష్టపోగా.. అందులో 17 వేల ఎకరాల్లో వరి పంటే దెబ్బతిన్నది. ఇంకా పంట నష్టం సర్వే కొనసాగుతూనే ఉంది. ఇక వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో 40వేల టన్నులకుపైగా ధాన్యం తడిసిపోయినట్టు అధికారులు చెప్తున్నారు. రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. టార్పాలిన్లు అందుబాటులో లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలకలెత్తుతోంది. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, పెగడపల్లి, వెల్గటూర్ మండలాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏకధాటిగా కురిసిన వానతో భారీగా ధాన్యం తడిసిపోయింది. పలుచోట్ల కొట్టుకుపోయింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో

వరంగల్ ఉమ్మడి జిల్లాలో వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. అన్ని పంటలు కలిపి 1,52,577 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. మహబూబాబాద్ జిల్లాలో భారీగా వరి చేన్లు నీట మునిగాయి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

ఉమ్మడి మెదక్ జిల్లాలో..

అకాల వర్షాలు ఉమ్మడి మెదక్ జిల్లా రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. సిద్దిపేట జిల్లాలో 91,569 ఎకరాల్లో, మెదక్ జిల్లాలో 13,947 వేల ఎకరాల్లో, సంగారెడ్డిలో 5,682 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోతకొచ్చే దశలోని వరి నేలకొరిగింది. మామిడికి తీవ్ర నష్టం వాటిల్లింది.

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పంట నష్టం గణనీయంగా ఉంది. కామారెడ్డి జిల్లాలో 42వేల మంది రైతులకు చెందిన 60,289 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. నిజామాబాద్ జిల్లాలో 25 వేల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతినగా.. అందులో వరి 19,500 ఎకరాలు, నువ్వులు 4,500 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిపోతున్నాయి.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

నల్లగొండ ఉమ్మడి జిల్లా పరిధిలో 52 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రధానంగా సూర్యాపేట జిల్లాలో 30 వేల ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 13,905 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 8,014 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా వరి పంట దెబ్బతిన్నది. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల్లో నష్టం ఎక్కువగా ఉంది. ఇప్పటివరకు 40వేల క్వింటాళ్ల ధాన్యం తడిసినట్టు అంచనా. యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, మోటకొండూరు, వలిగొండ మండలాల్లో ధాన్యం తడిసి మొలకెత్తుతోంది.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని మంచిర్యాల, నిర్మల్, కుమురం భీం, ఆదిలాబాద్ జిల్లాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వరి, మొక్కజొన్న, శనగ, పెసర, మామిడి దెబ్బతిన్నాయి.

ఖమ్మం ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరితోపాటు మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో 15,494 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఏన్కూరు, ఖమ్మం అర్బన్, కూసుమంచి, సత్తుపల్లి, వేంసూరు, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వరి నేలవాలింది. జిల్లాలో ఇప్పటి వరకు 197 కొనుగోలు కేంద్రాలను తెరవగా.. 102 కేంద్రాల్లోనే కొనుగోళ్లు చేపట్టారు. పెద్ద సంఖ్యలో రైతులు ధాన్యాన్ని తీసుకురాగా.. వానలకు తడిసిపోతోందని వాపోతున్నారు.



ఖమ్మం వైరా మండలం ఖానాపురంలో ఈదురుగాలులకు నేలకొరిగిన వరి పైరు

పాలమూరు ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో అకాల వర్షాలకు 3,299 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో ధాన్యం తడిసిపోయింది. వరితోపాటు మామిడికి నష్టం వాటిల్లింది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో..

రంగారెడ్డి ఉమ్మడి జిల్లాను వడగళ్ల వానలు వణికిస్తున్నాయి. ఈదురుగాలులు, వడగళ్లతో పంటలు చేలలోనే దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. ఆదివారం రాత్రి కొందుర్గు మండలంలో వడగళ్ల వానకు వరి, మామిడి, కూరగాయల పంటలకు నష్టం జరిగింది.

ధాన్యం తడిసి.. మొలకెత్తి..



ఈ ఫొటోలో ఉన్న రైతు మహబూబాబాద్ జిల్లా ముడుపుగల్లు గ్రామానికి చెందిన చిత్త లూరి వెంకన్న. నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇరవై రోజుల క్రితం కోతలు పూర్త య్యాయి. కొనుగోళ్లు ఇంకా ప్రారంభించక పోవడంతో ధాన్యాన్ని ఆరబోశాడు. కానీ వాన కు తడిసిపోయింది. ఆరబెడితే మళ్లీ తడిసింది. చివరికి ధాన్యంలో మొలకలు వస్తున్నాయి. దీనితో ఆందోళనలో పడిపోయాడు.



చేనులోనే వాలిపోయి..

మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం రామానుజాపురంలో నేలకొరిగిన వరి ఇది. వరి చేతికొచ్చింది. కోతలు మొదలు పెడదామని అనుకున్నానని.. కానీ ఈదురు గాలులు, వానతో వరి నేలకొరిగిందని రైతు వేల్పుల ప్రభాకర్ వాపోతున్నారు. పొలంలో నిలిచిన నీరు తీసేయడానికే వారం పడుతుందని.. ఒకవేళ మళ్లీ వర్షం కురిస్తే మొత్తంగా నష్టపోయినట్టేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న ఈ రైతు పేరు కాటారపు కిరణ్. కుమురంభీం జిల్లా దహెగాంకు చెందిన ఆయన మూడెకరాల్లో వరి వేశాడు. వారం క్రితం పంట కోసి స్థానిక కొనుగోలు కేంద్రం స్థలంలో ఆరబోశాడు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసింది. కొనుగోళ్లు ఇంకా ప్రారంభించకపోవడంతో.. మళ్లీ వర్షం వస్తే ఎలాగని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

తడిసిన ధాన్యం కొంటాం..

- మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి
- తడిసిన ధాన్యంతో 1.28 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ తయారీ
- ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఇందులో భాగంగా వానకు తడిసిన ధాన్యంతో బాయిల్డ్ రైస్ తయారు చేయడానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా వేసవి కాలంలో కురుస్తున్న భారీ వర్షాలతో ధాన్యం తడిసిపోతోందని, దీనితో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు 1.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అత్యవసరంగా బాయిల్డ్ రైస్ చేయడానికి ఉత్తర్వులు జారీ చేశామని, ధాన్యం సేకరణలో మరింత వేగం పెంచుతామని స్పష్టం చేశారు. సోమవారం మంత్రి సచివాలయంలో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలతో అత్యధికంగా నష్టపోయిన నల్లగొండ జిల్లాలో 22 వేల మెట్రిక్ టన్నులు, కామారెడ్డి, సిద్దిపేట, పెద్దపల్లి, సూర్యాపేట, కొత్తగూడెం జిల్లాల్లో 14,706 మెట్రిక్ టన్నులు, నిజామాబాద్‌లో 14,700, కరీంనగర్‌లో 7,350, యాదాద్రి, జగిత్యాలలో 5,000 మెట్రిక్ టన్నుల చొప్పున బాయిల్డ్ రైస్ కోసం ధాన్యం సేకరణకు ఉత్తర్వులు జారీ చేశామని మంత్రి గంగుల వెల్లడించారు. ఇప్పటివరకు గత యాసంగి కన్నా రెండున్నర రెట్లు అధికంగా ధాన్యం సేకరణ చేశామని వివరించారు. గతేడాది ఇదే రోజునాటికి 3.23 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించగా.. ఈసారి 7.51 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించామన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ధాన్యం కొనుగోళ్లు చురుగ్గా చేస్తున్నామన్న మంత్రి, రోజుకు 80 వేల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరిస్తున్నామన్నారు. ఇప్పటివరకూ 5,000 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 40 వేల మంది రైతుల నుంచి 7.51 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించామని, వీటి విలువ రూ.1,543 కోట్లని తెలిపారు. నిధులకు ఎలాంటి కొరత లేదని స్పష్టంచేశారు. ఈ సమీక్షలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో అప్రమత్తం

మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్/ సూర్యాపేట: రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరాకి అంతరాయం కలగకుండా విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉండాలని మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. అకాల వర్షం వల్ల విద్యుత్‌శాఖకు జరిగిన నష్టంపై సోమవారం ఆయన సచివాలయంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డితో సమీక్ష నిర్వహించారు. ధ్వంసమైన స్తంభాలు, లైన్లకు సత్వరంగా మరమ్మతులు చేయాలని ఆయన సూచించారు.

అది గవర్నర్ విజ్ఞతకే వదిలేస్తున్నాం..

రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రగతి నిరోధకులు తట్టుకులేక పోతున్నారని జగదీశ్‌రెడ్డి అన్నారు. సచివాలయం ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై రాకపోవడం అందులో భాగమేనన్నారు. సోమవారం సూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రారంభోత్సవానికి రావడం, రాకపోవడం అనేది ఆమె విజ్ఞతకే వదిలి పెడుతున్నామన్నారు.

మరో రెండు రోజులు వడగళ్ల వానలు

- పది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- మిగతా ప్రాంతాల్లోనూ విస్తారంగా వర్షాలకు అవకాశం
- సోమవారం రాష్ట్రంలో 2.97 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- సాధారణం కంటే తగ్గిపోయిన ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు పడే అవకాశాలు ఉన్నాయని ప్రకటించింది. ఈ పది మినహా మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. చాలాచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. పశ్చిమ విదర్భ నుంచి మరాఠ్వాడ, దక్షిణ కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో వర్షాలు కొనసాగుతాయని వివరించింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

వర్షాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల కన్నా తక్కువగానే నమోదవుతాయని వెల్లడించింది. సోమవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గిపోయాయి. రాష్ట్రంలో అత్యధికంగా భద్రాచలంలో 35.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. మెదక్‌లో 18.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

2.97 సెంటీమీటర్ల సగటు వర్షపాతం

సోమవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటున 2.97 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జనగామ జిల్లాలో 6.47 సెంటీమీటర్లు, హనుమకొండ జిల్లాలో 5.76, వరంగల్ జిల్లాలో 5.08, కరీంనగర్ జిల్లాలో 4.42, మంచిర్యాల జిల్లాలో 4.0, జగిత్యాల జిల్లాలో 4.0 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సాధ్యంకాని ఘనత నిమ్స్ సొంతం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రశంస

లక్డీకాపూల్



అరుదైన రికార్డులకు చిరునామాగా నిలిచే నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) మరో సరికొత్త రికార్డును నమోదు చేసింది. గత నాలుగు నెలల్లో 50 మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి నిమ్స్ తన ప్రత్యేకతను చాటుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షలు ఖర్చయ్యే సర్జరీని పైసా ఖర్చు లేకుండా చేయడం విశేషం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం సాధ్యం కాని ఈ అవయవ మార్పిడి ఆపరేషన్లతో 50 మంది జీవితాల్లో వెలుగులు నింపినట్లయింది.



2014 నుంచి ఇప్పటివరకు 862 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి ఇప్పటి వరకు నిమ్స్ ఆసుపత్రి చరిత్రలో 862 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి.గత ఏడాది 93 ఆపరేషన్లు జరగ్గా, ఈ ఏడాది కేవలం నాలుగు నెలల్లోనే 50 మూత్రపిండ మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. జీవన్‌దాన్ కార్యక్రమం ద్వారా చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్న మూత్రపిండ మార్పిడి ఆపరేషన్‌ను అతి తక్కువ సమయంలో పూర్తి చేస్తున్నారు. నిమ్స్ యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్ ఆధ్వర్యంలో వైద్య బృందం విశేషమైన సేవలు అందిస్తూ నిమ్స్ ఖ్యాతిని మరింత పెంచడంతో సఫలీకృతులవుతున్నారు. కాగా, 4 నెలల్లో 50 కిడ్నీ మార్పిడి సర్జరీలు చేసి, పునర్జన్మను ప్రసాదించిన నిమ్స్ వైద్యులను మంత్రి హరీశ్ రావు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంపు

- మేడే కానుకగా రూ. 1,000 పెంచాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- రాష్ట్రంలోని అన్ని పురపాలికలు, పంచాయతీల్లో అమలు
- శానిటేషన్, శానిటేషన్ కమ్ మల్టీపర్పస్ వర్కర్లకు వర్తింపు
- పెంపు భారం పురపాలికలు, పంచాయతీలపైనే..
- త్వరలో ఆర్టీసీ కార్మికుల జీతాలు పెంచుతామన్న సీఎం



సాక్షి, హైదరాబాద్: కార్మిక దినోత్సవం మే డే కానుకగా రాష్ట్రంలోని 1,06,474 మంది పారిశుధ్య కార్మికులు, శానిటేషన్ కమ్ మల్టీపర్పస్ వర్కర్లకు రూ.1,000 చొప్పున వేతనాలు పెంచుతున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారు. జీహెచ్‌ఎంసీ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మెట్రో వాటర్ వర్క్స్‌తోపాటు అన్ని గ్రామ పంచాయతీల పారిశుధ్య కార్మికులకు ఈ వేతన పెంపును తక్షణమే అమలు చేయాలని ఆదేశించారు. 'సఫాయన్న.. నీకు సలాం అన్న' నినాదంతో పారిశుధ్య కార్మికుల కృషి, త్యాగాలను గుర్తిస్తూ వారి సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కష్టించి పనిచేసే ప్రతి కార్మికుడి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. తెలంగాణ పల్లెలు, పట్టణాలు గుణాత్మక అభివృద్ధి సాధించడంలో పారిశుధ్య కార్మికుల శ్రమ గొప్పదని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన పల్లెలు, పట్టణాలకు అవార్డులు రావడం వెనుక వారి కృషి దాగి ఉందని పేర్కొన్నారు. కార్మికుల కష్టసుఖాలను తెలుసుకుంటూ, వారి జీతాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పెంచింద న్నారు. పారిశుధ్య కార్మికులు కూడా అదే కృతజ్ఞతా భావంతో మనస్ఫూర్తిగా పనిచేస్తూ, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

మంత్రి ఎర్రబెల్లి హర్షం

పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచడంపై మంత్రి ఎర్రబెల్లి హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐదు వందలు, వెయ్యి రూపాయలుగా మాత్రమే ఉన్న పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇప్పుడు రూ.9,500కు పెరిగాయని వివరించారు.

అదనపు భారం పురపాలికలు, పంచాయతీలపైనే

సీఎం ఆదేశాల మేరకు పురపాలికలు, పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపును మే 1 నుంచి అమల్లోకి తెస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రూ.1,000 వేతనం పెంపుతో భారాన్ని సంబంధిత పురపాలికలు, గ్రామ పంచాయతీలే భరించాలని స్పష్టం చేశారు. పల్లె/పట్టణ ప్రగతి కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు గాను ఈ మేరకు ప్రోత్సాహకం మంజూరు చేసినట్టు తెలిపారు.

త్వరలో ఆర్టీసీ కార్మికుల వేతనాలు పెంపు..

రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల జీతాలను సైతం పెంచాలని నిర్ణయించామని.. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ఆదేశించామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. దీనితో చాలా కాలం నుంచి వేతన సవరణ కోసం నిరీక్షిస్తున్న ఆర్టీసీ కార్మికులకు కొంత ఊరట లభించినట్టు అయింది. సీఎం ప్రకటన నేపథ్యంలో 2017 నాటి వేతన సవరణకు మోక్షం రాబోతోంది. అయితే, ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో అతికష్టమ్మీద నెట్టుకొస్తున్న ఆర్టీసీ ఇప్పటికప్పుడు వేతన సవరణ భారాన్ని మోసే పరిస్థితిలో లేదు. ఇప్పటికే ఈ విషయాన్ని ఆర్టీసీ అధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇప్పుడు స్వయంగా ముఖ్యమంత్రే వేతన సవరణ అంశంపై దృష్టి సారించిన పక్షంలో, ఆ భారాన్ని ఆర్టీసీ మీద పడకుండా ఎలా సర్దుబాటు చేస్తారో స్పష్టత రావాల్సి ఉంది.

క్రమబద్ధీకరణ గడువు నెల రోజులు పొడిగింపు

- జీవో 58, 59 విషయంలో సీఎం కేసీఆర్ నిర్ణయం
- ఎమ్మెల్యేల విజ్ఞప్తికి సీఎం సానుకూల స్పందన

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూముల నోటరీ సమస్యలను పరిష్కరించడంతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని పేదల ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. పేదల ఇళ్లకు ఇబ్బందులు లేకుండా, నిబంధనల మేరకు వారికి న్యాయపరమైన హక్కులను కల్పిస్తామన్నారు. ఇందుకు వీలుగా జీవో 58, 59 కింద నోటరీ స్థలాల క్రమబద్ధీకరణకు గడువును మరో నెల రోజులపాటు గడువు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. తక్షణమే తమ నియోజకవర్గాల పరిధిల్లోని ఎమ్మెల్యేలను కలసి తమ నోటరీ, తదితర ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ సమస్యలను తెలుపుకోవాలన్నారు. అన్ని సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయపరమైన హక్కులతో కూడిన పట్టాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఏకకాలంలో ఒకే మొత్తంలో పేదల ఇళ్ల సమస్యలు పరిష్కారం కావాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఇందుకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూముల నోటరీ సమస్యలపై త్వరలో జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. జంట నగరాల ఎమ్మెల్యేలు సోమవారం సచివాలయంలో సీఎం కేసీఆర్‌ను కలసి విజ్ఞప్తి చేయగా, ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, నవీన్ కుమార్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, దానం నాగేందర్, మాధవరం కృష్ణారావు, జాజుల సురేందర్, ఆత్రం సక్కు పాల్గొన్నారు.

జూన్‌లో ఎస్సై పరీక్షా ఫలితాలు!

మొదటి వారంలో విడుదల చేసేందుకు కసరత్తు

సాక్షి, హైదరాబాద్: పోలీస్ కొలువుల భర్తీలో భాగంగా నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్ తుది రాత పరీక్ష ఫలితాలు జూన్ మొదటి వారంలో విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. వివిధ విభాగాల్లోని ఎస్సై, తత్సమాన పోస్టులకు, కమ్యూనికేషన్ ఎస్సై, ఫింగర్ ప్రింట్ బ్యూరో ఏఎస్సై పోస్టులు కలిపి మొత్తం 15,644 పోస్టుల భర్తీకి తుది రాత పరీక్షలు ఏప్రిల్ 8, 9 తేదీల్లో మొత్తం 81 కేంద్రాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తుది రాత పరీక్షలకు 59,534 మంది హాజరయ్యారు. ఇప్పటికే ప్రిలిమినరీ కీని విడుదల చేయడంతోపాటు అభ్యంతరాలు తెలిపేందుకు ఏప్రిల్ 17 వరకు పోలీస్ నియామక మండలి సమయం ఇచ్చింది. వచ్చిన అభ్యంతరాలు మరోసారి పరిశీలించి, వాటిలో అర్థమైన వాటిని పరిగణనలోకి తీసుకుని మూల్యాంకనం చేస్తున్నారు. మిగిలిన విభాగాల్లోని కానిస్టేబుల్ పోస్టులకు సైతం తుది రాత పరీక్షలు ఆదివారంతో పూర్తయ్యాయి. దీంతో తుది పరీక్ష ఫలితాల వెల్లడి పనులపైనే బోర్డు అధికారులు ఫోకస్ పెట్టారు. ముందుగా ఎస్సై రాత పరీక్ష ముగించిన అధికారులు ఫలితాలను జూన్ నెల మొదటి వారంలో విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.



ప్రపంచంలో నువ్వు కోరుకుంటున్న మార్పు ముందు నీతో మొదలవ్వాలి.
- మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, 2 మే 2023

నూరు మాసాల మాట

మాటలు మంచివే. అందులోనూ మాటల్లో మనసు పరిచి, ప్రజలతో పంచుకోవడం ప్రజాస్వామ్య లక్షణం. పాలకులకు వన్నె తెచ్చే విషయం. ప్రధాని మోదీ గడచిన తొమ్మిదేళ్ళ పాలనాకాలంలో ప్రతి నెలా రేడియో వేదికగా పంచుకున్న 'మన్ కీ బాత్' (ఎంకేబీ) విశిష్టమైనది అందుకే. 2014 అక్టోబర్ 3న మొదలైన ఈ నెలవారీ ప్రసంగాలు ఈ ఏప్రిల్ 30తో వరుసగా 100 నెలలు, 100 భాగాలు పూర్తి చేసుకున్నప్పుడు అదొక మహోత్సవమైంది. ఏకంగా 20 దేశాల్లో 200 చోట్ల, న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో, దేశవ్యాప్తంగా బీజేపీ ఏర్పాటు చేసిన 4 లక్షల వేదికల్లో ఈ వందో ఎపిసోడ్ వినే వసతులు కల్పించడమే అందుకు నిదర్శనం. రాజ్‌భవన్లలో ఎంకేబీ శతమాసోత్సవాన్ని ఆహ్వానితుల ముంగిట సంబరంగా చేసుకోవడం కనివిని ఎరుగని ఘట్టం. ఇది కోట్లాది భారతీయుల మనోవాణి అని అధికార పక్షం అంటుంటే, ప్రజాసమస్యలపై మోదీ మౌనం వహిస్తున్నందున ఇది వట్టి 'మౌన్ కీ బాత్' అని ప్రతిపక్షాల విమర్శ. అసలు నిజం ఈ రెంటికీ మధ్య ఉందనేది విశ్లేషణ.

రాజకీయ రంగస్థలిపై ప్రత్యర్థుల్ని చిత్తుచేసే పాత్రలో పేరు తెచ్చుకున్న మోదీ తెలివిగా ఎంకేబీని జనంతో సంభాషణగానే మొదటి నుంచి మలిచారు. 'స్వచ్ఛ భారత్', 'హర్ ఘర్ తిరంగా', 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' లాంటి ఉద్యమాలను ఈ ప్రసంగాలతో ముందుకు నడిపారు. ఉన్నత లక్ష్యాలకు అంకితమైన ఉదాత్త పాలన, పాలకుడనే భావన కలిగించడంలో కృతకృత్యులయ్యారు. ఇది తొమ్మిదేళ్ళుగా ఆయన పెంచుకున్న పెట్టుబడి. పైకి రాజకీయ ప్రస్తావనలేమీ లేకుండానే సాగినా ఈ ప్రసంగ పరంపర ఇప్పుడు చేసుకున్న శతమాసోత్సవ ప్రచార పటాటోపంలో మాత్రం అస్సలు రాజకీయాలు లేవని అనలేం. వంద రూపాయల ప్రత్యేక నాణెం, సమాచార ప్రసారశాఖ సంపాదకీయ వ్యాఖ్యలు, ఎంకేబీ వింటున్న మంత్రుల ఫోటోలు - ఇలా దేశమంతా ఓ సంరంభం. తిరుగులేని నాయకుడి మనోధర్మ వాణి ఆసరాగా, ప్రజల్ని తమ వైపు తిప్పుకోవాలన్న కమలనాథుల ఆశ అర్థం చేసుకోదగినదే. అధికారంలో ఎవరున్నా కాస్త హెచ్చుతగ్గులుగా ఇది చేసే పనే. అదే సమయంలో ఈ ప్రసంగ పరంపరతో సమాజంలో సానుకూల ఫలితాలే లేవనుకోవడమూ తప్పే.

ఎంకేబీలో ప్రస్తావించిన అనేక అంశాలు, సామాన్యుల విజయగాథలు శ్రోతలకు విజ్ఞానాన్నీ, విశేషంగా స్ఫూర్తినీ అందించాయి. నెలకోసారి అలాంటి అంశాలనూ, వ్యక్తులనూ ఎంపిక చేయడానికి ప్రభుత్వ శాఖలు, పార్టీ యంత్రాగం ఎంతటి శ్రమ, క్షేత్రపరిశీలన చేస్తున్నాయో ఊహించవచ్చు. నిజానికి, వార్తల నుంచి వ్యవసాయ సలహాల దాకా అన్నిటికీ రేడియోనే ఆధారమై, రచ్చబండ వద్ద ఊరంతా రేడియోల ముందు పోగైన రోజుల నుంచి ఇవాళ సమాజం చాలా మారింది. దూరదర్శన్, ప్రైవేట్ కేబుల్ టీవీలు, శాటిలైట్ టీవీ ఛానల్స్, ఇప్పుడు ఓటీటీ దాకా కొత్త వేదికలతో 1990ల నుంచి రేడియో ప్రాచుర్యం తగ్గుతూ వచ్చింది. అలాంటి వేళ 2014లో మోదీ రేడియో మాధ్యమాన్ని ఎంచుకోవడం ఆశ్చర్యంతో పాటు ఫలితంపై అనుమానాలూ పెంచింది. కానీ, 501 ప్రసార కేంద్రాలతో, 23 భాషల్లో కార్యక్రమాలతో దేశంలో భౌగోళికంగా 90 శాతాన్నీ, జనాభాలో 98 శాతాన్నీ చేరుతున్న రేడియోను బలంగా వినియోగించుకున్నారు. గ్రామీణ, దిగువ మధ్యతరగతి జనానికి దగ్గరవుతూ, వారిదైన భాషలో మోదీ సమాచార ప్రసారం చేయగలిగారు. లేఖలతో వారినీ ఇందులో భాగస్వాముల్ని చేశారు. వెరసి, ఎంకేబీని కీలక ప్రసార, ప్రచారోద్యమంగా మలుచుకున్నారు.

ఇది కేవలం బీజేపీ కార్యకర్తలు వినే కార్యక్రమమని విమర్శలు వచ్చాయి. కానీ, ఎంకేబీలోని అంశాలతో సామాన్య జనం మమేకమయ్యేలా, ఆకాశవాణి, దూరదర్శన్ సహా ప్రైవేట్ టీవీ ఛానళ్ళలో, మర్నాటి పత్రికల్లో అవి ప్రధాన వార్తలుగా మారేలా తీర్చిదిద్దిన రూపకర్తల దూరదృష్టినీ, వ్యూహ చతురతనూ కొట్టిపారేయలేం. ఇంటి పెద్ద మిగతా కుటుంబ సభ్యులతో తన భావాలు పంచుకుంటున్న పద్ధతిలో సాగడం ఎంకెబీ విజయసూత్రం. ప్రసారభారతి సీఈఓ విడుదల చేసిన ఐఐఎం-రోహ్‌తక్ తాజా నివేదిక 10 వేల మందిని సర్వే చేసి, ఇప్పటికి 100 కోట్ల మంది ఈ కార్యక్రమం విన్నారని పేర్కొంది. 96 శాతానికి ఎంకేబీ గురించి తెలుసనీ, 23 కోట్ల మంది క్రమం తప్పక వింటున్నారనీ తెలిపింది. సదరు ఐఐఎం డైరెక్టర్ వివాదచరిత అటుంచితే, ప్రసిద్ధ సామాజిక శాస్త్రవేత్తలున్న సీఎస్‌డీఎస్ సంస్థ నిరుడు నవంబర్‌లో విడుదల చేసిన నివేదిక మాత్రం దేశంలో అయిదింట మూడొంతులు ఎన్నడూ ఎంకేబీ వినలేదంటోంది. లెక్కలెలా ఉన్నా... సాక్షాత్తూ ఉపరాష్ట్రపతి సైతం వదలకుండా ప్రతి నెలా ఎంకెబీ వింటానన్నారు. ఇలాంటి వీరవిధేయ శ్రోతలు తక్కువేమీ కాదు.

మోదీ 'ఆధ్యాత్మిక ప్రయాణం'గా పేర్కొన్న ఈ కార్యక్రమం ఎంతగా ప్రభుత్వ అండ ఉన్నా, ఇంతకాలం శ్రోతల ఆసక్తిని నిలబెట్టుకోవడం విశేషమే. రేడియో పునర్వైభవానికీ తోడ్పడుతున్న ఈ ప్రసార ఉద్యమం అక్కడి కన్నా ఆన్‌లైన్‌లో, టీవీలో ఎక్కువమందిని ఆకర్షిస్తోంది. దేశంలో పెరిగిన డిజిటలీకరణకు కొండగుర్తుగా నిలుస్తోంది. ప్రజల మనసుకు దగ్గరైన అంశాలతో, 'బేటీ బచావో బేటీ పఢావో' లాంటి నినాదాలతో మోదీ మంత్రముగ్ధం చేస్తున్నారు. ఇప్పటి దాకా ఒక్కసారైనా పూర్తిస్థాయి విలేఖరుల సమావేశం జరపని తొలి భారత ప్రధాని అన్న విమర్శలకు వెరవకుండా నిత్యం జనంలో ఉంటూ, వారిని ఉద్దేశించి మాట్లాడుతూ కమ్యూనికేషన్ కింగ్ అనిపించుకున్నారు. ఎంకేబీతో కొత్త వాతావరణం సృష్టించారు. మనోవాణిని తెలపడం మంచిదైనా, ఏకపాత్రాభినయ స్వగతం కన్నా స్వేచ్ఛాయుత మీడియా సంభాషణలు ప్రజాస్వామ్యానికి మరింత మేలు. మౌనం కన్నా మాట ప్రభావమే ఎక్కువని 'మౌన్ కీ బాత్' శతమాసోత్సవం సైతం నిరూపిస్తోంది.

బౌద్ధ వైభవ చిహ్నం తొలగించడమా?



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

చరిత్రలో హేతువాదాన్ని వ్యాప్తి చేయడంలో అగ్రగామి, బౌద్ధ ధర్మం. సర్వమానవ సమానత్వాన్ని కాంక్షించినది, యజ్ఞ యాగాదులను నిరసించినది కూడా ఇదే ధర్మం. అలాంటి మహత్తర ధర్మాన్ని తెలుగు నేల ఇరు చేతులా హత్తుకుంది. దేశంలోని ఏ బౌద్ధ స్థావరం నుంచి దొరకని ఆనవాళ్లు తెలుగు నేలలో దొరికాయి. అలాంటి తెలుగు నేల విశిష్ట బౌద్ధ వారసత్వపు చిహ్నంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 'పూర్ణఘటాన్ని' నెలకొల్పారు. కానీ కొత్తగా ప్రారంభమైన తెలంగాణ సచివాలయంలో ఆ ఆనవాళ్లను చెరిపేశారు. భారత దళిత ప్రజా బాహుళ్య విమోచనకు ఏ బౌద్ధ సౌభ్రాతృత్వ ధర్మాన్ని అంబేడ్కర్ ప్రబోధిస్తూ వచ్చాడో అదే అంబేడ్కర్ పేరిట ఏర్పాటైన సచివాలయంలో బౌద్ధ చిహ్నాన్ని కూల్చేశారు.

భారత సెక్యులర్ రాజ్యాంగ నిర్మాత, బౌద్ధ సంస్కృతీ ప్రియుడైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయ ఆవిష్కరణ జరిగిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికీ, ప్రజలకూ శుభాభినందనలు తెలుపుతున్నాను; కానీ ఈ సందర్భంలోనే సెక్రటేరియట్‌లో ఉండవలసిన, ఉమ్మడి తెలుగు బౌద్ధ సంస్కృతీ వైభవ ప్రతీకగా అంతకుముందు నుంచీ ఉన్న విశిష్ట శాశ్వత కట్టడాన్ని తొలగించినందుకు విచారం వెలిబుచ్చక తప్పడం లేదు.

వైఎస్ రాజశేఖరరెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో (2008) ఆయన ఆధ్వర్యాన తెలుగు ప్రజల ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవ చిహ్నంగా ఆ కట్టడం నాలుగు భాషల ఉద్దీపనతో వెలిసింది. ఎంతోమంది పర్యాటకుల్ని ఆకర్షించిన బౌద్ధ సంస్కృతీ చిహ్నమది (ఘనాకారపు గ్రానైట్ రాయి మీద తొలిచిన పూర్ణఘట ప్రతిరూపం). కానీ నేటి సెక్రటేరియట్ ఆవరణలో ఆ విశిష్ట చిహ్నం ఆనవాళ్ళు 'కలికానికైనా' కానరావు. ఇంతకూ ఆ బౌద్ధ ధర్మ సంస్కృతీ వైభవ కట్టడం ఏమైనట్టు? భారత దళిత ప్రజా బాహుళ్య విమోచనకు ఏ బౌద్ధ సౌభ్రాతృత్వ ధర్మాన్ని అంబేడ్కర్ ప్రబోధిస్తూ వచ్చాడో ఆ చిహ్నాన్నే కూల్చేశారు. ఏ యజ్ఞయాగాదులకు దూరంగా జరిగి సర్వ మానవ సమానత్వం లక్ష్యంగా అంబేడ్కర్ ముందుకు సాగాడో - అందుకు విరుద్ధంగా యజ్ఞయాగాదులతో 'బీఆర్ఎస్' నాయకుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన అంబేడ్కర్ సచివాలయ ప్రవేశం చేశారు.

విశేషమేమంటే, 'బౌద్ధ ధర్మ చక్ర ప్రశస్తి' శాసనం మన దేశం మొత్తం మీద ఏ బౌద్ధ స్థావరం నుంచీ ఇంతవరకూ వెలుగు చూడనందునే తెలంగాణలోని 'ఫణిగిరి' ధర్మ చక్ర ప్రశస్తి శాసనానికి చారిత్రక ప్రాధాన్యం లభించింది. ప్రాకృత భాషను, పాలీ లిపిని, 'బ్రాహ్మీ' లిపిని ప్రేమించి, ప్రోత్సహించిన ధర్మం కూడా బౌద్ధానిదేనని మరచిపోరాదు. క్రీ.పూ. 3 - క్రీ.శ. 18 శతాబ్దాల మధ్య వెలువడిన వేలాది శాసనాలను ఉమ్మడి తెలుగువారి సొత్తుగా భావించి ఈ విశేషాలన్నింటినీ ఆవిష్కరించిన ప్రసిద్ధ స్థపతి ఈమని శివనాగిరెడ్డి ఒకరు. ఈయనే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయ ప్రాంగణంలో తెలుగు వారి బౌద్ధ సంస్కృతిని ప్రతిబింబించే అత్యున్నత కట్టడ నిర్మాణంలో పాలు పంచుకున్నారు. సరిగ్గా ఆ కట్టడం ఆనవాళ్లే కనపడకుండా చేసింది కేసీఆర్ పాలన. కాక పోతే అంబేడ్కర్ పేరును ఒక ముసుగుగా వాడుకోవడం పాలకుల కొత్త 'సంస్కృతి'!

కొండా శ్రీనివాసులు, అవధానం ఉమా మహేశ్వరి సంపాదకులుగా శివనాగిరెడ్డి తెలుగు సంస్కృతీ వైభవాన్ని కళ్లకు కట్టి చూపే 'మీరూ శాసనాలు చదవొచ్చు' అన్న అమూల్య గ్రంథాన్ని అందించారు. ఇందులో ఆయా కాలాల్లో హైందవ, బౌద్ధ మతాలకు మధ్య జరిగిన భావ సంఘర్షణలు, లిపిలో వచ్చిన మార్పులు వగైరా చరిత్ర ఉంది. ఈ పరిణామ క్రమానికి శాశ్వత నిలువుటద్దంగా నిలిచిన, సెక్రటేరియట్ ఆవరణలో స్థాపితమైన ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవ అమూల్య చారిత్రక కట్టడాన్ని ఎందుకు తొలగించారో సమాధానం కావాలి. హేతువాదాన్ని వ్యాప్తి చేయడంలో స్థిర చిత్తంతో ముందుకు దూసుకు వెడుతున్న బౌద్ధ ధర్మాన్నీ, దాని తాలూకు ప్రచార సంస్థలనూ ఎదుర్కొంటున్న దశలో హైందవంలోని ఛాందసులు బౌద్ధారామాల్ని కూల్చకుండా ఉంటారా అని మహాపండితులు రాహుల్ సాంకృత్యాయన్, తిరుమల రామచంద్ర పదేపదే ప్రశ్నించవలసి వచ్చిందని మరవరాదు.


హైదరాబాద్‌లో మూసీ తీరాన ఉన్న క్రీ.శ. 4వ శతాబ్ది నాటి బౌద్ధారామాన్ని కాస్తా 30 ఏళ్ల క్రితమే కొనగండ్ల నరసింహస్వామి ఆలయంగా మార్చేశారని శాసనాల చరిత్రలో పేర్కొన్నారు. అహోబిలం, మంగళగిరి, భీమునిపట్నం (పావురాళ్ల కొండ), సింహాచలం మున్నగు నరసింహ క్షేత్రాలన్నీ ఒకనాటి బౌద్ధ స్థావరాలేనంటారు. హైదరాబాద్‌లో లభించిన ప్రాకృత బౌద్ధ శాసనం క్రీ.శ. 4వ శతాబ్ది నాటిది. ప్రముఖ శాసన పరిశోధకులు పీవీ పరబ్రహ్మ శాస్త్రి దానిని ధ్రువీకరించారు. బౌద్ధానికి విస్తారంగా రాజాదరణ లభించిన విష్ణుకుండినుల కాలంలో (క్రీ.శ. 6వ శతాబ్ది) విష్ణుకుండి మొదటి గోవింద వర్మ పట్టపురాణి పరమభట్టారిక మహా దేవి నల్గొండ జిల్లా తుమ్మల గూడెంలో తన పేర ఒక మహా విహారాన్ని నిర్మించి, సర్వ జీవరాసుల హితాన్ని కోరే బౌద్ధం పట్ల తన మక్కువను తెలియజేసింది. ఇక క్రీ.శ. 14-17 శతాబ్దుల్లో విజయనగర శాసనాలు బౌద్ధ ధర్మాన్ని తలదాల్చి యశస్సు గడించినవే. కాకతీయుల తరువాత మొత్తం తెలుగునేలను పాలించిన కుతుబ్‌షాహీలు తెలుగును ప్రోత్సహించినవాళ్లే. సుప్రసిద్ధ నాణేల పరిశోధకులు డాక్టర్ దేమె రాజారెడ్డి కోటిలింగాల తవ్వకాల్లో అనేక పేర్లున్న నాణేలపై గల లిపి క్రీ.పూ. 3వ శతాబ్ది నాటిదనీ, రాజుల పేర్లు తెలుగులో ఉన్నాయనీ నిర్ధారించారు. తెలుగు లిపి ఆవిర్భావ, వికాసాల గురించి పీవీ పరబ్రహ్మశాస్త్రి, డా.ఎస్. రామచంద్రమూర్తి అనేక విషయాలు వెల్లడించారు. ఇంత చరిత్ర సంస్కృతి ఉభయ ప్రాంతాలలోని తెలుగు వారికి ఉండగా, ఉమ్మడి బౌద్ధ సంస్కృతీ వైభవాన్ని వెలార్చిన సాధికార నిర్మాణ రూపాన్ని సెక్రటేరియట్‌లో నామరూపాలు లేకుండా చేయడం దుర్మార్గం. పాలకుల స్థాయికి మించిన దుశ్చర్యగా పరిగణించక తప్పదు.

ఇంతకూ 'జీవతత్వం' ఎక్కడుందన్న ప్రశ్నకు వేమన్నను అడిగితే చెబుతాడు:

"తనువులోన జీవతత్వ మెరుంగక
వేరెకలదటంచు వెదుక నేల,
భానుదుండ దివ్వెపట్టి వెదుకు రీతి?!"

abkprasad2006@yahoo.co.in

రెండో మాట



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో ఏర్పాటైనది ఈ బౌద్ధ పూర్ణ ఘట ప్రతీక

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పెళ్లిళ్ల సీజన్



సుప్రీంకోర్టులో ఈ నెలంతా పెళ్లిళ్ల వాసన - వివాహ సమానత్వం, వైవాహిక అత్యాచారం, పునరిద్ధరించలేనంతగా పాడైన వివాహ బంధాలు. - ఇందిరా జైసింగ్, న్యాయవాది

సా..గ..దీస్తుంది



ఒక సమస్యను పరిష్కరించకుండా చేయడానికి ఉత్తమమైన మార్గం, ఆ సమస్యను నివారించడానికి ప్రత్యేకంగా ఒక శాశ్వత సంస్థను ఏర్పాటు చేయడం! - సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

పునర్జన్మ



నా కూతురు నిఘాత్ నస్రీన్‌కు పదకొండు నెలల క్రితం అకస్మాత్తుగా రెండ్రోజుల వ్యవధిలో కాలేయం మొత్తం పాడైంది. ఢిల్లీలోని ఐఎల్‌బీఎస్‌లో కాలేయ మార్పిడి జరిగిన తర్వాత మళ్లీ శ్రీనగర్‌లో తన ఉద్యోగ బాధ్యతల్లో చేరింది. ఆమెకు రెండో జీవితం ప్రసాదించిన దేవుడు, కాలేయ దాత, వైద్యులు, ఇతర ఆసుపత్రి బృందం, రక్తం, ప్లాస్మా దాతలు, స్నేహితులు, సహచరులు, శుభం కోరిన అందరికీ ధన్యవాదాలు.

- అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

దక్షిణ దేశం



ఎన్నికలు, చట్టాల్లోని లొసుగులు, వ్యాజ్యాలు, శత్రువులను జైళ్లలో పెట్టడం ద్వారా బీజేపీ విన్నరించలేని రాజకీయ శక్తిగా మారింది. ఇదిలాగే కొనసాగితే, ఢిల్లీ రహితంగా ఎందుకు ఉండకూడదని దక్షిణాది అడగొచ్చు. సౌత్ ఇండియా రిపబ్లిక్ అనే ఆలోచన మొత్తంగానే కొట్టిపారేయదగినదేమీ కాదు.

- మనూ జోసెఫ్, రచయిత

తాగమంటారా?



అత్యధిక కెఫీన్ ఉండే డ్రింకుల వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్న ఈ సోకాల్డ్ సూపర్‌స్టార్లందరూ ఆ ప్రకటనల్లో చూపిస్తున్నట్టుగా నీరసంగా ఉన్నప్పుడు వాటిని తాగుతారా? తమ ఎదిగిన పిల్లలకు, ఎదిగే వయసులో ఉన్న చిన్న పిల్లలకు కూడా వాటిని తాగమని చెబుతారా?

- గుత్తా జ్వాల, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

మనసులో మాట వినరా?



'మన్ కీ బాత్' వందో ఎపిసోడ్ పూర్తయినందుకు మోదీజీకి అభినందనలు. కానీ, నిరసన చెబుతున్న రెజ్లర్ల 'మన్ కీ బాత్' కూడా వినండి. వాళ్ల బాధను అర్థం చేసుకోవడానికి మన ప్రధాని సిద్ధంగా ఉన్నారని నిరూపితం అవుతుంది.

- కపిల్ సిబాల్, రాజ్యసభ ఎంపీ

సమాన పిలుపు



రాజవంశీయులతో నేను ఎప్పుడు సమావేశమైనా, 'యువర్ హైనెస్' అనలేక పోయాను. అది నా నాట్లోంచి రాదు. అది నా డీఎన్ఏలో లేదు. (బ్రిటన్ రాకుమారులు) విలియమ్, హ్యారీలను కలిసినప్పుడు ఇద్దరినీ మేట్ (సహవాసి) అని సంబోధించాను. అలాగని వాళ్ల పట్ల నాకు మర్యాద లేదని కాదు. - రసెల్ క్రో, నటుడు

ఇన్‌బాక్స్

చిరస్మరణీయ కృషి

ద్రావిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి, నిఘంటు కర్త, వ్యాకరణ వేత్త ఆచార్య డాక్టర్ రవ్వా శ్రీహరి (79) ఇటీవల తుదిశ్వాస విడిచారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెలువర్తి గ్రామంలో సామాన్య చేనేత కుటుంబంలో 1943 సెప్టెంబర్ 12న ఆయన జన్మించారు. తెలుగు, సంస్కృత భాషల వికాసానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

యాదగిరి లక్ష్మీ నరసింహ సంస్కృత విద్యాపీఠంలోనూ, హైదరాబాదులోని సంస్కృత కళాశాలలోనూ వ్యాకరణం చదివారు. వ్యాకరణంలో ఉత్తీర్ణుడైన శ్రీహరి... వివేకవర్ధిని కళాశాలలో తెలుగు పండితుడిగా చేరి, ఎంఏ తెలుగు, ఎంఏ సంస్కృతం చదివి 1967లో ఆంధ్ర సారస్వత పరిషత్తులో లెక్చరర్‌గా చేరి సంస్కృతం, తెలుగు రెండింటినీ బోధించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు సలహాతో 'భాస్కర రామాయణం' మీద పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 17 సంవత్సరాలు బోధనా, పరిశోధనలు నిర్వహించిన శ్రీహరి 2002లో కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమితులయ్యారు. 2011లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహించారు.



రవ్వా శ్రీహరి

రవ్వా శ్రీహరి 50 వరకు తెలుగు గ్రంథాలను, సంస్కృతంలో 25 పుస్తకాలను రచించారు. పరిశోధన, సృజన, విమర్శ, అనువాదం, నిఘంటు నిర్మాణం రంగాలపై తనదైన ముద్రవేశారు. 'శ్రీహరి నిఘంటువు', 'అన్నమయ్య పద కోశం', 'సంకేత పదకోశం', 'వ్యాకరణ పద కోశం' ప్రముఖంగా చెప్పుకోదగ్గవి. విమర్శనాత్మక గ్రంథాలలో 'ఉభయ భారతి', 'అన్నమయ్య సూక్తివైభవం', 'అన్నమయ్య భాష వైభవం', 'తెలుగు అలబ్ధ వాఙ్మయం', 'సాహితీ నీరాజనం', 'తెలుగు కవుల సంస్కృత అనుకరణలు', 'వాడుకలో తెలుగు అప్రయోగాలు' ఉన్నాయి. ఆయన మృతి ఇటు తెలుగు, అటు సంస్కృత సారస్వతాలకు తీరని లోటు.

– డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్య, అన్నమయ్య సంకీర్తనల వ్యాఖ్యాత, అన్నమాచార్య ప్రాజెక్టు

ప్రజలు కీలు చూసి వాత పెట్టగలరు!

అభిప్రాయం



ప్రొ॥ కూరపాటి వెంకట్ నారాయణ

తెలంగాణలో గత తొమ్మిది సంవత్సరాల నుండి పరిపాలనా రాహిత్యం, అవినీతి, కుల దురభిమానం, బంధు ప్రీతి, పారదర్శకత లేమి రాజ్యమేలుతున్నాయి. ఫలితంగా అనేక తప్పిదాలు, స్కాములు జరుగుతున్నాయి. ఈ దుష్ఫలితాలు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 'సకల జనుల సమ్మె' చేసిన ప్రజలందరినీ తాకినాయి అనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వ పాలనలో ఏ చిన్న పనికైనా అవినీతి, వ్యాపార దృక్పథాలే ప్రజలను వెంటాడి పీల్చి పిప్పి చేస్తున్నాయి. అక్రమార్కుల ఇసుక దందాను ప్రశ్నించిన వారిపై పోలీసుల జులుం పెట్రేగి పోయింది. అనేకమంది దళిత యువకులు నిర్బంధాలకు, పోలీసులచే థర్డ్ గ్రేడ్ ట్రీట్మెంట్‌కు గురి అయినారు. దశాబ్దాల కాలం నుండి పోడు భూములను సాగు చేసుకుంటున్న ఆదివాసీలను చితకబాది పోలీసు ఠాణాలలో నిర్బంధంలో పెట్టినారు. 'ధరణి' దుర్వ్యవస్థను తెచ్చి గత 40-50 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న కౌలు రైతులను, అసైన్డ్ భూముల రైతులను 'కబ్జా కాలమ్' నుండి తొలగించి, ఆ భూములను భూస్వాములకు తిరిగి ఇప్పించగలిగింది. ఈ కారణంగా వేలాది పేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రైతాంగ పోరాటం, ఇతర వామపక్ష ఉద్యమాల ఫలితంగా ప్రయోజనం పొందిన పేద రైతుల భూములను కూడా తిరిగి జమిందారులకు, భూస్వాములకు, పారిపోయిన నాయకులకు అప్పగించింది 'ధరణి' వ్యవస్థ.

కరోనా బారిన పడి మరణించినవారి మరణాల సంఖ్యను ఐదు- పది శాతానికి కుదించి చెప్పిన విషయం ప్రజలకు తెలియనిదేమీ కాదు. కరోనాతో మరణించిన పేద వారందరికీ ఆర్థిక సహాయం అందజేయడానికి ఇష్ట పడక చనిపోయిన వారి సంఖ్యను కుదించి వేయడం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. పేదలు చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పాలకుల వర్గ నీతి విధానం వల్ల నిధులు, నియామకాలు లేక, నియంత్రణ అధికారుల పర్యవేక్షణ కొరవడి... ఈ సంస్థలలో ప్రమాణాలు నానాటికీ దిగజారుతున్నాయి.

ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ల ఫీజుల మోత, మద్యం ధరల పెంపు, షాపుల విస్తరణ, ఊరూరా బెల్టు షాపుల దోపిడీ; సాయంత్రం పోలీసుల గొట్టాల మోత, వాహనాల రిజిస్ట్రేషన్ చార్జీలమోత, టీఎస్ఎస్‌పీడీసీఎల్ అదనపు లోడ్ సంబంధిత అక్రమ వసూళ్ల



దందా... గత తొమ్మిది సంవత్సరాల నుండి ప్రజలు వాటి పర్యవసానాలను అనుభవిస్తూనే ఉన్నారు.

వందల సంవత్సరాల నుండి కాపాడిన లక్షల కోట్ల విలువ గల హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ప్రభుత్వ భూమి... అక్రమ లావాదేవీల ద్వారా ప్రభుత్వ వర్గాల చేతి వాటం మూలంగా కారు చౌకగా అన్యాక్రాంతం కావడం తెలంగాణ ప్రజలు చూస్తూనే ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, సింగరేణిలో, విద్యుత్ సంస్థలలో, ప్రభుత్వ వైద్యశాలల్లో, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలో... గత తొమ్మిది సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలను 50 వేలకు పైగా నాయకులు, లంచగొండి అధికారులు కలిసి అమ్ముకుంటున్న ఉదంతాలు జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో అత్యధిక భాగాన్ని సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల (తమ సొంత కుటుంబ కారిడార్) అభివృద్ధికి, ప్రాజెక్టులకు, రిజర్వాయర్లకు, సంక్షేమ పథకాలకు విచ్చలవిడిగా పంపిణీ చేసినా మిగతా నియోజకవర్గాల ప్రజలు తమకూ ఆ స్థాయిలో నిధుల కేటాయింపు జరపాలని ఒత్తిడి చేయడం లేదు.

'దళిత ముఖ్యమంత్రి', 'మూడెకరాల భూమి', 'దళిత బంధు', బీసీ కార్పొరేషన్ రుణాలు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్' వంటి హామీలన్నీ నీటి మూటలయ్యాయి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వంటి పథకాలు, ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వంటి వన్నీ అగమ్య గోచర మయ్యాయి. పైన పేర్కొన్న అన్ని వ్యవహారాలను ప్రశ్నించకపోవడం ప్రజల బలహీనత అనుకుంటే పొరపాటే. ప్రజలు ప్రభుత్వానికి 'కీలు చూసి వాత పెట్టడా'నికి సిద్ధపడుతున్నారు.

'ప్రశ్నపత్రాల లీకేజీ స్కాం' పిడుగుపాటు దెబ్బతో తెలంగాణలో అందరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. ఇంత కాలం జరిగిన అనేక తప్పిదాల కంటే ప్రశ్నపత్రాల క్రయవిక్రయాల ఉదంతం నాలుగు కోట్ల మంది ప్రజలను బలంగా తాకింది. ప్రజాక్షేత్రంలో 2023 డిసెంబర్‌లో జరగబోవు శాసనసభ ఎన్నికలు ప్రభుత్వ వర్గాలకు ఈ వ్యవహారం మరింత గడ్డు పరిస్థితిని సృష్టించనున్నది. టీఎస్‌పీఎస్సీ స్కాం నిరుద్యోగులపై పిడుగుపాటు అయితే... దాని పర్యవసానం పాలక పక్షానికి చావు దెబ్బగా మారనున్నదా అనే చర్చ ప్రస్తుతం తెలంగాణలో సాగుతున్నది.

వ్యాసకర్త యూజీసీ ఎమిరిటస్ ప్రొఫెసర్, కాకతీయ వర్సిటీ

అనుకరణ చేటు

అనుసరించడం, అనుకరింప చేయడం వ్యాపార నాగరికతలో ఒక ప్రధానాంశం. ఒకరిని చూసి ఒకరు వేషధారణలో, నడకలో, ఆడంబరాల్లో అనుకరిస్తారు. అనుకరణ, అనుసరణ ఒకటి కాదు. జ్ఞానంలో, జీవనంలో, నడతలో, నిరాడంబరతలో, మంచితనంలో అనుసరిస్తారు. అనుసరణ మనల్ని మంచి దారిలోకి మళ్ళిస్తుంది. మంచిగా మలచుతుంది. కానీ, అనుకరణ నెత్తికెక్కి మోయలేని భారమవుతుంది. పతన హేతువు అవుతుంది. పులిని చూసి నక్క వాతలు పెట్టుకోవడం అనుకరణ. ఇచ్చిన మాట తప్పకుండా, ప్రాణాలకు భయపడకుండా తన దగ్గరకు వచ్చిన ఆవును చూసి... ఆలోచించి, తానూ సత్య మార్గంలో నడచి, ఆవును చంపకుండా పులి వదిలి పెట్టడం అనుసరణ.

అనుకరణ అజ్ఞానంలో ఒక భాగం. థామస్ ఆల్వా ఎడిసన్ చిన్నతనంలో పక్షిలా ఎగరాలి అనుకున్నాడు. తాటాకులు చేతులకు రెక్కల్లా కట్టుకుని చెట్టు కొమ్మ మీది నుండి ఎగిరాడు. నేల మీద పడి కాళ్ళు విర గ్గొట్టుకున్నాడు. వాన పాముల్ని తినడం వల్ల పక్షులు ఎగురుతున్నాయనుకున్నాడు. వాన పాముల్ని తెచ్చి, మెత్తగా నూరి దానిని బలవంతాన తమ పనిపిల్లతో తినిపించాడు. ఆ పిల్లకు వాంతులై, అనారోగ్యం పట్టుకుంది.



జ్యోతిర్మయం

అడవి జంతువుల్లో ఏనుగు చాలా బలమైంది. ఒక నక్క తానూ ఏనుగులా బలంగా తయారు కావాలని అనుకుంది. ఏనుగు వెంటే తిరిగింది. ఆ ఏనుగు ప్రతిరోజూ అడవి మధ్యలో ఉన్న పెద్ద చెరువులో దిగి, తామర పూలు, ఆకులు, తూడులు, దుంపలు తినేది. తానూ ఇదే ఆహారం తీసుకుంటే ఏనుగులా శక్తిశాలి కావచ్చు అనుకుంది నక్క. ఇక, ఆ రోజు నుండి చెరువులో దిగి తామర కాడల్ని, దుంపల్ని తినడం మొదలు పెట్టింది. ఆ దుంపలతో పాటు బురదనూ మింగేసింది. దానితో దాని కడుపులో బురద పేరుకుపోయి అనారోగ్యం పాలైంది. రోజు రోజుకీ క్షీణించిపోయి, ఎముకల గూడు అయ్యింది. చివరికి మరణించింది. "కేవలం తలలు గొరిగించుకుని, కాషాయధారణ చేసినంత మాత్రాన జ్ఞానులు కాలేరు. ప్రజ్ఞానులూ కారు. మంచి మార్గాన నడవడం వల్ల, మంచిని పెంపొందించుకోవడం వల్ల నిరంతర జ్ఞాన సాధన వల్లే ప్రజ్ఞ పెంపొందుతుంది" అని బుద్ధుడు చెప్పిన కథ ఇది.

- బొర్రా గోవర్ధన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ద్వాదశి రా.9.51 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తర సా.6.33 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.3.26 నుండి 5.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.10 నుండి 9.01 వరకు తదుపరి రా.10.49 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.44 నుండి 12.06 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.38, **సూర్యాస్తమయం:** 6.15.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act, 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri/Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	JIJU GEORGE AND ANJORI JIJU	SMT PASUPUNOORI SRI LAKSHMI W/O SRI PASUPUNOORI VINOD KUMAR	FNO 306/SF OUT OF FNO 305 AND 306/SF, VANITHA CHS, BOWENPALLY	SALE DEED NO 1886/2019, DT. 18/10/2019
		SRI PASUPUNOORI VINOD KUMAR S/O LATE PASUPUNOORI YADAGIRI	FNO 306 OUT OF FNO 305 AND 306/SF, VANITHA CHS, BOWENPALLY	SALE DEED NO 1887/2019, DT. 18/10/2019
2	SRI B L SURYA KUMAR	VIMAX POWER CONTROLS PVT LTD REP BY SRI N VENKATESWARA RAO AND OTHER	PNO 18/L-2, SYNO 1-7/4, CHANDRA NAGAR COLONY, RASOOLPURA	SALE DEED NO 303/2012, DT. 07/03/2012
	VIMAX POWER CONTROLS PVT LTD REP BY SRI N VENKATESWARA RAO AND OTHER	SRI CHILKALPUDI KAMESWARI RATNA PRABHA W/O SRI CHILKALPUDI SRINIVAS VARMA		SALE DEED NO 1323/2021, DT. 16/07/2021
3	SRI PARESH KUMAR	SRI RACHARLA SUDHAKAR S/O R KRISHNA	PNO 11/GF/FF, DR.SUBBARAO COLONY, PICKET	SALE DEED NO 801/2023, DT. 06/04/2023
4	L SUNITHA AND L KIRAN KUMAR THROUGH HIS LEGAL HEIRS SRI LINGAM SANTOSH	SMT THONTA VIJAYA W/O THONTA RAJU	FNO 508/SF, VANILA APRTS, BOOSAREDDYGUDA	SALE DEED NO 1377/2021, DT. 24/07/2021
5	KUMARI G YESHODHA D/O G RAMCHANDER	SRI P MOHAN BABU S/O SRI P RAMCHANDER	FNO 205/FF, MURALIDHAR APARTS, BOOSAREDDY GUDA	SALE DEED NO 1035/2018, DT. 19/09/2018
6	SRI D RAMCHANDRIAH THROUGH HIS WIFE SRI SHYAMANTHULA MALLAIAH	SRI SHYAMANTHULA MALLAIAH	PNO 117, SANJIVIAH NAGAR COLONY.	SALE DEED NO 203/2002, DT. 07/02/2002
	SRI SHYAMANTHULA MALLAIAH	SRI YANAMALA ANKAIAH		SALE DEED NO 1252/2004, DT. 04/06/2004
	SRI YANAMALA ANKAIAH	SMT SILVER SULOCHANA		SALE DEED NO 2698/06, DT. 20/12/2006
	SMT SILVER SULOCHANA	SRI SARIKONDA RAJA S/O SRI SARIKONDA SUBBA RAJU		SALE DEED NO 1452/08, DT. 07/11/2008
7	SRI D A RACHE	1. SRI ANIL KUMAR ADEPU 2. SMT BILLA SATHWIKA	PNO 34/GF/FF, INDIAN AIRLINES COLONY, BALAMRAI	SALE DEED NO 572/2023, DT. 31/03/2023
8	SRI A M KRISHNA KUMAR THROUGH HIS LEGAL HEIRS 1. SMT K LEELAWATHI 2. SMT SADHANA SAINATH 3. SMT ROOPA MOHAN	SRI K MOHAN KUMAR S/O LATE SRI A M KRISHNA KUMAR	PNO 6, SHIVA RAM KRISHNA CHS, MARREDPALLY	DEATH CERTIFICATE OF LATE MOHAN RAO KRISHNA KUMAR RELEASE DEED NO 821/2010, DT. 27/05/2010
9	SHEROWANI RAVI KUMAR	SRI SIRICILLA BHARAT RAJA VIKRANTH SHARMA S/O SRI SIRICILLA RAJENDHAR	FNO G-6/GF, KALANJALI TOWERS, BOWENPALLY	SALE DEED NO 711/2017, DT. 02/05/2017
10	B PAVAN KUMAR AND P SHALIM	GERA SARASA W/O C SAMSON GODWIN	PNO &FNO 101/GF, SRI MALANI COLONY, TRIMULGHERY	SALE DEED NO 641/2022, DT. 21/05/2022
11	T S RAVI CHANDRAN	GANGARAJU GEETHAMURTHY W/O GANGARAJU GEETHAMURHT?	FNO 303/SF, SRI APARTMENTS, BOWENPALLY	GIFT DEED NO 1878/2022, DT. 21/10/2022
12	R VENKATA RAMANI KALYANI	MISS CHITRA V RAMANI D/O RAMANURHTY VENKATARAMANI	SYNO 62/GF/FF, TRIMULGHERY VILLAGE, TRIMULGHERY	DEATH CERTFICATE OF LATE KALYANI VENKATA RAMANI GIFT DEED NO 49/2022, DT. 21/12/2022
13	SRI K GOPAL REDDY	1. LAKINEPALLY SHYAMALA DEVI 2. LAKINEPALLY ADITYA	PNO 13, SANJEEVIAH CHS, BOWENPALLY	SALE DEED NO 585/2023, DT. 01/04/2023
14	SHRI R GOWDHAMA BUDHAR	SRI SHAGANTI NITTANAND S/O SHAGANTI SATHYANARAYANA	PNO 13/FNO 202, BHAVANA COLONY, BOWENPALLY	SALE DEED NO 451/2023, DT. 13/03/2023
15	BROTATI GUPTA AND AMARCHANDAR GUPTA	1. MR VINAY KUMAR GUPTA 2. MRS KIRAN GUPTA	PNO G 15/1/1, ISHAQ COLONY, KAKAGUDA	SALE DEED NO 1038/2001, DT. 26/06/2001
	1. MR VINAY KUMAR GUPTA 2. MRS KIRAN GUPTA	MR DANDU SRAVAN KUMAR		SALE DEED NO 2122/06, DT. 06/11/2006
	MR DANDU SRAVAN KUMAR	1. SRI UPPALA SIVA KUMAR 2. SMT UPPALA SANDYAVALI		SALE DEED NO 1606/09, DT. 02/12/2009
	1. SRI UPPALA SIVA KUMAR 2. SMT UPPALA SANDYAVALI	SRI MOHD ARIFUDDIN AHMED S/O LATE MOHD SAYEEDUDDIN		SALE DEED NO 653/13, DT. 27/04/2013
16	SRI LT COL K K D PRASAD	KANTAMNENI ARUNA PRASAD W/O LATE LT COL K K D PRASAD	FNO 12-B TYP 4, A.W.H.O GOUTHAM NAGAR COLONY, SIKH ROAD	DEATH CERTFICATE OF LATE LT COL K K D PRASAD WILL DEED NO 167/B-III/2018, DT. 24/09/2018
17	C S PURUSHOTTAM	SRI RAVI BHATTER S/O SRI RAM RATAN BHATTER	FNO 105, SAI SRI HOMES, BOWENPALLY	SALE DEED NO 496/2012, DT. 12/04/2012
18	SHRI D SEETHA RAM REDDY	1. HUNAID VADNAGARWALA 2. KHUZAINA VADNAGARWALA 3. HUZAIFA VADNAGARWALA 4. ABIZAR VADNAGARWALA	PNO 2/GF, JUPITER COLONY, TRIMULGHERY	SALE DEED NO 478/2021, DT. 22/02/2021
19	SRI S VIJAY KUMAR	SHRI S ANIRUDH S/O LATE SRI S VIJAY KUMAR	PNO 182/GF/FF, BALAMRAI COLONY, MAHENDRAHILLS, EAST MARREDPALLY	DEATH CERTIFICATE OF LATE S VIJAY KUMAR WILL DEED NO 254/III/2022, DT. 15/11/2022
20	1. SMT G BHAGYAMMA 2. SRI G GANESH 3. SRI G KRISHNA 4. SRI G SHANKER THROUGH GPA HOLDER K REKHA W/O K PRABHAKAR	SMT P SABITHA REDDY	FNO 405/TF, CHINKA THOKATTA, BOWENPALLY	SALE DEED NO 1604/03, DT. 26/09/2003
	SMT P SABITHA REDDY	V VANI		SALE DEED NO 616/2005, DT. 13/04/2005
	V VANI	SRI BONDALAPATI HEMANTH KUMAR S/O SRI RAM MOHAN		SALE DEED NO 201/2022, DT. 29/01/2022
21	K NILESH KUMAR	SMT DEVAKI DEVARAJAN W/O SRI M SURESH KUMAR	FNO 18/SF, GAYATHRI APRTS, KAKAGUDA	SALE DEED NO 563/2023, DT. 29/03/2023
	SRI C VINODA RAJAN	SRI G S RADHA KRISHNA	PNO 90/61/FNO 103/GF, JYOTHI COLONY, KAKAGUDA	SALE DEED NO 1877/03, DT. 13/11/2003
22	MR V HANUMANTHA RAO CHIEF MANAGER & AUTHORIZED OFFICER SRI G R RADHA KRISHNA	MR CH SAIBABA S/O CH NARAYANA RAO		SALE CERTIFICATE NO 1072/2018, DT. 18/05/2018
	KAMALUDDIN PIRANI	SRI TAJUDDIN DOBANI	FNO 407, BAPUJI NAGAR, BOWENPALLY	AGREEMENT OF SALE CUM GPA NO 1957/2007, DT. 08/11/2007
23	SRI TAJUDDIN DOBANI	1. MRS YASMIN VIRANI 2. MR BHADUR ALI VIRANI		SALE DEED NO 89/2012, DT. 25/01/2012
	1. MRS YASMIN VIRANI 2. MR BHADUR ALI VIRANI	KHAIR UNISSA BEGUM D/O MOHAMMED NAAEER		SALE DEED NO 3058/2022, DT. 17/11/2022
24	SRI KAKILETI HANUMANTH RAO-OCCUPANT	SRI DAMOLU RAJU-OCCUPANT S/O SRI DAMOLU BALAIAH	HNO 1441, ARTILLERY LINES, MUDFORT	SALE DEED NO 390/2023, DT. 02/03/2023
25	SRI GANGU SUMANTH	SMT GANGU MEENA KUMARI W/O LATE SRI GANGU SUMANTH	PNO 129/GF/FF, SARDAR VALLABHAI PATEL CHS, TRIMULGHERY	DEATH CERTIFICATE OF LATE GANGU SUMANTH DEED OF WILL DATED, 15/10/2022
26	SRI J B SATYANARAYANA	MR SRIKANTH JAGAPATHI S/O SRI SATHYANARAYANA JAGAPATHI	PNO 10/GF, AKASH VIHAR COLONY, TRIMULGHERY	SETTLEMENT DEED NO 677/2023, DT. 18/04/2023
27	MR NITIN B SHAH AND SMITA N SHAH	1. MR PUTCHA VIJAY KUMAR 2. MRS KALLEPALLI SUBHADRA	BNO 159/A/1/GF FNO 4, BALAMRAI BUNGALOWS, BALAMRAI	SALE DEED NO 770/2022, DT. 25/04/2022

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/TB/631, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 01-05-2023

Sd/-
Chief Executive Officer,
Secunderabad Cantonment Board

4 డిజైన్లలో ఇంటర్ ఛేంజర్లు


'రింగు'రోడ్డుకు డబుల్ ట్రంపెట్, క్లవర్ లీఫ్, డంబెల్, రౌండ్ ఎబౌట్ డిజైన్లను ఖరారుచేసిన ఎన్‌హెచ్ఏఐ

ఒక్కోటి 120 ఎకరాల్లో నిర్మించే యోచన

ఏ ప్రాంతంలో ఏ డిజైన్ అన్న విషయంలో కసరత్తు

సాక్షి, హైదరాబాద్

రీజినల్ రింగురోడ్డులో నాలుగు రకాల డిజైన్లలో ఇంటర్ ఛేంజ్ స్ట్రక్చర్లు రాబోతున్నాయి. జాతీయ రహదారులు, ప్రధాన రాష్ట్ర రహదారులను రింగురోడ్డు క్రాస్ చేసే చోట్ల భారీ ఇంటర్ ఛేంజ్‌లను నిర్మించనున్న విషయం తెలిసిందే. రింగురోడ్డు ఉత్తర భాగంలో 11 ప్రాంతాల్లో ఇలాంటి కూడళ్లు ఉండనున్నాయి. రింగురోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు, ఇతర రోడ్ల మీదుగా వెళ్లే వాహనాలు పరస్పరం అడ్డు రాకుండా వేటికవే రోడ్లు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా క్రాస్ అవుతాయి. ఒక రోడ్డు నుంచి మరో రోడ్డులోకి వాహనాలు మారేందుకు వీలుగా ఇంటర్‌ఛేంజ్ లూప్స్‌ను నిర్మిస్తారు. ఇప్పుడు ఈ స్ట్రక్చర్లకు సంబంధించి అధికారులు రూపొందించిన డిజైన్లు ఆసక్తి రేపుతున్నాయి. ఆయా క్రాసింగ్స్‌లో ఉండే ట్రాఫిక్ ఒత్తిడి, అనుసంధానమయ్యే రోడ్ల సంఖ్య ఆధారంగా లూప్స్ వైశాల్యం, సంఖ్య ఆధారపడి ఉంటాయి. ఇందుకోసం నాలుగు డిజైన్లను ఖరారు చేసి, ఆ ప్రాంతంలో ఉండే పరిస్థితికి తగ్గట్టుగా వాటిని ఎంపిక చేయబోతున్నారు.



నాగ్‌పూర్ రహదారిపై ఇస్లాంపూర్ వద్ద ఇలా..

హైదరాబాద్ - నాగ్‌పూర్ జాతీయ రహదారిపై తూప్రాన్ సమీపంలో ఇస్లాంపూర్ వద్ద క్లవర్ లీఫ్ డిజైన్.. ఇది చాలా విశాలంగా రూపొందబోతోంది



ట్రంపెట్ ఆకృతిలో లూప్ నిర్మాణం

సాధారణంగా ప్రధాన రోడ్లను ఇతర రోడ్ల మీదుగా వచ్చే వాహనాలను అనుసంధానించేందుకు ట్రంపెట్ (సంగీత పరికరం) ఆకృతిలో లూప్ నిర్మిస్తారు. రోడ్ల సంఖ్య ఎక్కువగా ఉంటే రెండు ట్రంపెట్ల ఆకృతిలో నిర్మిస్తారు. క్లవర్ లీఫ్ (నాలుగు ఆకులతో కూడిన మొక్క భాగం) ఆకృతిలో కూడా విరివిగా నిర్మిస్తారు. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డులో ఈ రెండు ఆకృతుల్లో ఇంటర్‌ఛేంజెస్ ఉన్నాయి. ఇప్పుడు వీటితోపాటు డంబెల్ (వ్యాయామ ఉపకరణ) ఆకృతితోపాటు రౌండ్ ఎబౌట్ (పూర్తి వృత్తం)లో కూడా నిర్మించాలని నిర్ణయించారు.

గిర్మాపూర్, చౌటుప్పల్ వద్ద డంబెల్ ఆకృతిలో నిర్మాణాలు



నాగ్‌పూర్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారుల మీద రెండు ప్రాంతాల్లో క్లవర్ లీఫ్ నమూనాను ఎంపిక చేశారు. శివంపేట, రాయగిరిల వద్ద డబుల్ ట్రంపెట్ డిజైన్‌ను ఎంపిక చేశారు. రీజినల్‌రింగ్‌రోడ్డు ప్రారంభ ప్రాంతమైన గిర్మాపూర్, ముగింపు ప్రాంతమైన చౌటుప్పల్‌తోపాటు జాతీయ రహదారి 161ఏ మీద డంబెల్ ఆకృతిలో నిర్మించాలని భావిస్తున్నారు. మరో మూడు చోట్ల రౌండ్ ఎబౌట్‌లను ఎంపిక చేశారు. మిగతావి పరిశీలనలో ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్ ఛేంజ్ స్ట్రక్చర్లకు భారీగా స్థలాన్ని సేకరించే విషయంలో స్థానికులతో వివాదాలు నెలకొన్న నేపథ్యంలో డిజైన్లలో కొన్ని మార్పుచేర్పులు జరిగే అవకాశం ఉంది. రీజినల్ రింగురోడ్డుకు సంబంధించి భూసేకరణలో భాగంగా కీలక 3డీ గెజిట్ నోటిఫికేషన్ల జారీ ప్రక్రియ ఆందోల్-జోగిపేట, యాదాద్రి భువనగిరి, చౌటుప్పల్.. ఈ మూడు కాలా అథారిటీలో పూర్తయిన విషయం తెలిసిందే. వీటి పరిధిలో త్వరలో టెండర్ల ప్రక్రియ కూడా మొదలుకానున్నందున ఇంటర్‌ఛేంజ్ స్ట్రక్చర్లపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. మిగతా కాలా అథారిటీల పరిధిలో 3డీ గెజిట్ నోటిఫికేషన్ జారీకి కొంత సమయం ఉన్నందున, మరో నెల రోజుల్లో ఆయా ప్రాంతాల్లోని స్ట్రక్చర్లను ఖరారు చేయనున్నారు.

120 ఎకరాల విస్తీర్ణంలో..

రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తర భాగంలో వాహనాల రద్దీ చాలా ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతాల్లో నిర్మించే ఇంటర్ ఛేంజ్ నిర్మాణాలు ఒక్కోటి దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలో ఉండనున్నట్టు తెలిసింది. వాహనాలు ఇంటర్‌ఛేంజ్ లూప్స్ మీదుగా, వాటికి నిర్మించే ర్యాంప్స్ మీదుగా కూడా గంటకు 50 కి.మీ. మించిన వేగంతో వెళ్లేందుకు వీలుగా వీటిని విశాలంగా నిర్మించాలని నిర్ణయించారు. తొలుత 70 ఎకరాల విస్తీర్ణంలోనే నిర్మించాలని అనుకున్నా.. వాహనాల వేగం గంటకు 30 కి.మీ.లోపే నియంత్రించాల్సిన పరిస్థితి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

లూప్ సంఖ్య	పొడవు	వేగ పరిమితి (గం./కి.మీ)
1	883 మీటర్లు	50
2	750 మీటర్లు	50
3	857 మీటర్లు	50
4	2100 మీటర్లు	50


రౌండ్ ఎబౌట్

ర్యాంపు	పొడవు	రేడియస్	వేగ పరిమితి
1	813 మీటర్లు	120 మీటర్లు	60 కి.మీ.
2	941 మీటర్లు	120 మీటర్లు	60 కి.మీ.
3	700 మీటర్లు	120 మీటర్లు	60 కి.మీ.
4	922 మీటర్లు	120 మీటరు	60 కి.మీ.

నేటి నుంచి యాదాద్రీశుడి జయంత్యుత్సవాలు

మూడు రోజుల పాటు నిర్వహణ

యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రంలో మంగళవారం నుంచి శ్రీనరసింహస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలు ఈనెల 4వ తేదీన రాత్రి నిర్వహించే నృసింహ ఆవిర్భావ ఘట్టంతో ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా లక్ష కుంకుమార్చన, లక్ష పుష్పార్చనలతో పాటు సహస్ర కలశాభిషేకం నిర్వహించేందుకు ఆచార్యులు సిద్ధమవుతున్నారు. ప్రధానాలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరిస్తున్నారు. ఈ మూడు రోజుల పాటు హరికథ, సంప్రదాయ నృత్యాలు, నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఇందుకు రథశాల ముందు భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు.

ఆర్జిత సేవలు రద్దు.. శ్రీస్వామి జయంతి ఉత్సవాల సందర్భంగా మూడు రోజులు ఆలయంలో నిర్వహించే ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఉత్సవాలు ముగిసిన తరువాత 5వ తేదీ నుంచి తిరిగి ఆర్జిత సేవలను కొనసాగిస్తారు.

70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

వచ్చే సీజన్లో వ్యవసాయ శాఖ లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: వచ్చే వానాకాలం సీజన్‌లో 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా ప్రకటించింది. కనీసం 60 లక్షల నుంచి 65 లక్షల ఎకరాల్లో సాగయ్యేలా చూడాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయంలోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన తొలి సమీక్షలో వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. రానున్న వానాకాలంలో 1.40 కోట్ల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని పేర్కొన్నారు. మరో 14 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేసేలా చూడాలన్నారు. అందుకనుగుణంగా వ్యవసాయశాఖ సమాయత్తం కావాలని ఆదేశించారు. పత్తితోపాటు కంది సాగును మరింత ప్రోత్సహించాలని, ప్రస్తుతం వివిధ పంటల సాగుకు అవసరమయ్యే 18 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. సేంద్రీయ సాగు, భూసారాన్ని దృష్టిలో ఉంచుకుని పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు చర్యలు తీసుకోవాలనీ దీనికి రూ.76.66 కోట్లు నిధుల విడుదల చేయాలని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటల సాగుకై డీసీసీబీల ద్వారా ఎకరానికి రూ.40 వేలు వరకు పంటరుణాలు అందించాలని సూచించారు. ప్రతీ ఏడాది మార్చి చివరి వరకు యాసంగి కోతలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటే వడగళ్ల వానల నుంచి నష్టాన్ని నివారించవచ్చని నిరంజన్‌రెడ్డి సూచించారు. వానాకాలం సాగు సమయంలోనే యాసంగి వరి సాగు నారుమళ్లకు అవసరమయ్యే భూమిని వదులుకోవాలని చెప్పారు. బాన్సువాడ, బోధన్, హుజూర్‌నగర్, మిర్యాలగూడల మాదిరిగా వరి సాగు సీజన్ ముందుకు జరపాలని సూచించారు.

తెలంగాణ హరితహారం భేష్

- కొనియాడిన నీతి ఆయోగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అటవీ విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలతో వాతావరణ సమతుల్యత సాధ్యమైందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. 'తెలంగాణకు హరితహారం' కార్యక్రమంలో భాగంగా 32 జిల్లాల్లోని 19,472 గ్రామాల్లో చేపట్టిన పల్లె ప్రకృతి వనాలతో నేల, నీటి సంరక్షణ సాధ్యమైందని కొనియాడింది. 'సామాజిక రంగంలో ఉత్తమ పద్ధతుల సంగ్రహం-2023' పేరుతో సోమవారం విడుదల చేసిన నివేదికలో ఈ అంశాన్ని ప్రస్తావించింది. వివిధ రాష్ట్రాల్లో విద్య, వైద్యం, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, సామాజిక భద్రత, పర్యావరణం, ఆహారం, పోషకాహార భద్రత, మహిళలు-పిల్లల అభివృద్ధి, జీవనోపాధి, నైపుణ్యం వంటి 14 విభాగాల్లో ఉత్తమ పద్ధతులు అవలంబించిన రాష్ట్రాల కార్యక్రమాలను ఈ నివేదికలో నీతి ఆయోగ్ పొందుపరిచింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ కవర్‌ను 24 శాతం నుంచి 33 శాతం వరకు పెంచడం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా స్థానిక వృక్ష జాతులతో మినీ అడవులను రూపొందించేందుకు దోహదపడిందని విశ్లేషించింది. సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు సాధ్యమైందని పేర్కొంది. దీంతోపాటే వాణిజ్య భవనాల రంగంలో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) విధానాన్ని తేవడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించిందని ప్రశంసించింది.

టీజీసీజీటీఏ ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక, అధ్యక్షుడి ఎన్నిక టై



విద్యారణ్యపురి: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (టీజీసీజీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి (ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, కరీంనగర్), ఉపాధ్యక్షుడిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.చిన్నా (ఏటూరునాగారం డిగ్రీ కళాశాల) ఎన్నికయ్యారు. కాగా, రాష్ట్ర అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో 2 ప్యానల్స్ నుంచి ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చి టై అయింది. దీంతో అధ్యక్షుడి ఎన్నిక ఆగిపోయింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీ ఫ్యాకల్టీ క్లబ్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల్లో కె.సురేందర్‌రెడ్డి ప్యానల్ నుంచి 9 మంది గెలుపొందారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్.గోపి (ఎస్సార్ అండ్ బీజీఎన్నార్, ఖమ్మం), ఫైనాన్స్ సెక్రటరీగా రమేశ్ గౌడ్ (గిరిరాజ్ కళాశాల నిజామాబాద్), మహిళా కార్యదర్శిగా ఇ.పావని (సిటీ కళాశాల హైదరాబాద్) ఎన్నికయ్యారు. మల్టీజోన్-1 సెక్రటరీగా జాడి శంకరయ్య (డిగ్రీ కళాశాల, మంచిర్యాల), మల్టీ జోన్2 సెక్రటరీగా కె. తిరుపతయ్య (ఎంవీఎస్ కళాశాల, మహబూబ్‌నగర్) ఎన్నికయ్యారు. కార్యవర్గసభ్యులుగా ఎల్.మహేష్ (తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి), ఎల్.వాణి (ప్రభుత్వ కళాశాల కూకట్‌పల్లి)ని ఎన్నుకున్నారు.

బాబూజగ్జీవన్‌రామ్ పదవులకు వన్నె తెచ్చారు

ఇంద్రాణీ జగ్జీవన్‌రామ్ తెలుగు అనువాద పుస్తకావిష్కరణలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్



సనత్‌నగర్: మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ ఏ పదవులు చేపట్టినా వాటికి వన్నె తెచ్చారని ఆయన తనయ, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ అన్నారు. బాబూజగ్జీవన్‌రామ్ జీవిత విశేషాలతో ఆయన సతీమణి ఇంద్రాణీ జగ్జీవన్‌రామ్ జ్ఞాపకాల తెలుగు అనువాద పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం బేగంపేటలోని ఓ హోటల్‌లో జరిగింది. మైల్‌స్టోన్ పేరిట ఇంగ్లిష్‌లో ఉన్న పుస్తకాన్ని ఎమెస్కో విజయ్‌కుమార్ సహకారంతో సీనియర్ జర్నలిస్ట్, రచయిత దుర్గంపూడి చంద్రశేఖర్‌రెడ్డి తెలుగు అనువాదం చేశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మీరాకుమార్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు రామచంద్రమూర్తి, మల్లేపల్లి లక్ష్మయ్య, హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ డీన్ ప్రొఫెసర్ కృష్ణ, బాబూజగ్జీవన్‌రామ్ ఆలిండియా సమతా మూమెంట్ జాతీయ కార్యదర్శి శృంగారపాటి ఆనంద్‌బాబు, మీరాకుమార్ కుమారుడు అన్షుల్‌కుమార్ హాజర య్యారు. ఈ సందర్భంగా మీరాకుమార్ మాట్లాడుతూ దేశంలో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడిన సందర్భంలో ఆహార శాఖ మంత్రిగా ఆహార ధాన్యాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితుల నుంచి ఎగుమతులు చేసే స్థాయికి రైతులు ఎదిగేలా చేశారని గుర్తుచేశారు. 1971 యుద్ధ సమయంలో నాటి రక్షణ మంత్రిగా బాబూజగ్జీవన్‌రామ్ పాక్‌కు దీటైన జవాబు ఇచ్చారన్నా రు. రాజకీయంగా ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించినా కుటుంబ వ్యవస్థకు కట్టుబడి ఉన్నారని చెప్పారు.

క్లుప్తంగా

మరో రెండ్రోజులు దేశవ్యాప్తంగా వానలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ వరకు అనేక రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. తమిళనాడు, కేరళ సహా దక్షిణాది రాష్ట్రాల్లో ఉరుములు, వడగళ్లతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. వీటితో పాటే పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్తాన్, పశ్చిమ హిమాలయ ప్రాంతంలోనూ వర్షాలు పడతాయని తెలిపింది. మే 4 నుంచి వర్షపాతం గణనీయంగా తగ్గుతుందని పేర్కొంది.

బీఎస్‌పీ ఎంపీ అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు



న్యూఢిల్లీ: కిడ్నాప్‌–హత్య కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష పడిన బీఎస్‌పీకి చెందిన పార్లమెంట్ సభ్యుడు అఫ్జల్ అన్సారీపై అనర్హత వేటు పడింది. యూపీలోని ఘాజీపూర్ నుంచి అఫ్జల్ అన్సారీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2005 నాటి ఘాజీపూర్ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య కేసు, 1997లో వారణాసికి చెందిన నంద కిశోర్ అనే వ్యాపారి కిడ్నాప్, హత్య కేసులో అన్సారీ, ఆయన సోదరుడు ముక్తార్‌ అన్సారీ దోషులుగా ఉన్నారు. ఎంపీ/ఎమ్మెల్యేల కేసులను విచారించే యూపీ కోర్టు శనివారం ఈ కేసుల్లో అన్సారీకి నాలుగేళ్లు, ముక్తార్‌కు 10 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీంతో ప్రజాప్రాతినిధ్య చట్టం–1951 ప్రకారం అఫ్జల్ అన్సారీ లోక్‌సభ సభ్యత్వాన్ని 2023 ఏప్రిల్ 29 నుంచి రద్దు చేస్తున్నట్లు సెక్రటేరియట్ పేర్కొంది.

'పద్మ అవార్డులకు ప్రతిపాదనలు పంపండి'

న్యూఢిల్లీ: ప్రతిభావంతులైన వ్యక్తులను గుర్తించి, వారి గొప్పదనం, విజయాలు పద్మ అవార్డులతో సత్కరించడానికి అర్హులను భావించినట్లయితే ఆ పేర్లను సిఫారసు చేయాలని ప్రజలను సోమవారం కేంద్రం కోరింది. 2024 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ అవార్డులకు నామినేషన్లు, ప్రతిపాదలను 2023 మే ఒకటో తేదీ నుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపింది. పద్మ అవార్డుల సిఫారసులకు ఆఖరు తేదీ సెప్టెంబర్ 15. ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో https://awards.gov.in ద్వారా పంపాలని కోరింది. రిపబ్లిక్ డే సందర్భంగా కేంద్రం ఏటా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను పద్మ శ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ అవార్డులతో గౌరవిస్తుంది.

వచ్చే ఐదేళ్లలో నికరంగా... 1.4 కోట్ల కొలువులకు కోత

వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా

- ఏఐతో 2.6 కోట్ల ఉద్యోగాలకు ఎసరు
- భారత్‌లో 22 శాతం ఉద్యోగుల వలస
- 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' నివేదికలో వెల్లడి



జెనీవా: వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాల సృష్టిలో భారీ తగ్గుదల నమోదవుతుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. కొత్తగా 6.9 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగనుండగా ఏకంగా 8.3 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయని పేర్కొంది. నికరంగా 1.4 కోట్ల ఉద్యోగాలకు కోత పడుతుందని 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్' పేరిట ఆదివారం విడుదల చేసిన ద్వై వార్షిక నివేదికలో వివరించింది. ప్రస్తుతం మొత్తం ప్రపంచ ఉద్యోగితలో ఇది 2 శాతం. వచ్చే ఐదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా 23 శాతం ఉద్యోగుల వలస చోటుచేసుకోవచ్చని పేర్కొంది. భారత్‌లో ఇది 22 శాతం దాకా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా 45 పెద్ద ఆర్థిక వ్యవస్థలు, 27 భారీ పారిశ్రామిక క్లస్టర్లు, 800 దిగ్గజ కంపెనీల్లోని దాదాపు 67.3 కోట్ల ఉద్యోగాలపై డబ్ల్యూఈఎఫ్ విస్తృతంగా సర్వే జరిపింది. విశేషాలు...

- వచ్చే ఐదేళ్లలో సప్లై చైన్స్, రవాణా, మీడియా, వినోద, క్రీడా రంగాలకు ఉద్యోగుల వలసలు ఎక్కువగా ఉంటాయి.
- ప్రపంచవ్యాప్తంగా నూతన ఉద్యోగాల సృష్టిలో చాట్‌జీపీటీ వంటి కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీలదే కీలక పాత్ర.
- 75 శాతం కంపెనీలు, సంస్థలు, కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీలను అందిపుచ్చుకుంటాయి.
- ఫలితంగా ఏకంగా 44 శాతం మంది ఉద్యోగుల నైపుణ్యాలకు పూర్తిగా కాలదోషం పట్టనుంది.
- సమర్థ పనితీరును కొనసాగించాలంటే ప్రతి 10 మంది ఉద్యోగుల్లో కనీసం ఆరుగురికి శిక్షణ అవసరమవుతుంది.
- దాంతో ఏకంగా 45 శాతం వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, కంపెనీలు ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధిపై హెచ్చు నిధులు వెచ్చిస్తాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఆటోమేషన్ వేగం గత అంచనాల కంటే తగ్గింది. ప్రస్తుతం కేవలం 34 శాతం టాస్కులు ఆటోమేషన్‌తో నడుస్తున్నాయి. ఇది 2020తో పోలిస్తే కేవలం 1 శాతమే ఎక్కువ. కంపెనీలు కూడా ఆటోమేషన్ అంచనాలను కుదించుకున్నాయి. తొలుత 2025 నాటికి 47 శాతం టాస్కులను ఆటోమేట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా తాజాగా దాన్ని 2027 నాటికి కేవలం 42 శాతానికి పరిమితం చేసుకున్నాయి.
- కృత్రిమ మేధ రాకతో బ్యాంక్ క్యాషియర్లు, క్లర్కులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వంటి 2.6 కోట్ల ఉద్యోగాలు కనుమరుగవుతాయి.
- ఏఐ, మెషీన్ లెర్నింగ్ స్పెషలిస్టులు, ఫిన్‌టెక్ ఇంజనీర్లు, డేటా అనలిస్టులు, సైంటిస్టులు, అగ్రికల్చరల్ ఎక్విప్‌మెంట్ ఆపరేటర్లు వంటి ఉద్యోగాలు బాగా పెరుగుతాయి.
- స్వచ్ఛ ఇంధనం, వ్యర్థాల నిర్వహణ, సహజ వనరుల సమర్థ వినియోగం వంటి రంగాల్లో మేనేజర్లు, విండ్ టర్బైన్ టెక్నీషియన్లు, సోలార్ కన్సల్టెంట్లు, ఎకాలజిస్టులు, పర్యావరణ స్పెషలిస్టుల వంటి ఉద్యోగాలు కూడా భారీగా పెరుగుతాయి. ఈ రంగంలో భారత్‌తో సహా టాప్ 10 దేశాలు పర్యావరణ లక్ష్యాలు చేరుకోవాలంటే కనీసం 1.2 కోట్ల ఉద్యోగాల సృష్టి జరగాలి.

భారత్‌లో సామాజికేతర రంగాల్లోనే ఉద్యోగ సృష్టి

కరోనా అనంతరం భారత్‌లో విద్య, ఆరోగ్యం వంటి సామాజిక రంగాలతో పోలిస్తే సామాజికేతర రంగాల్లోనే ఉద్యోగాల సృష్టి ఎక్కువగా ఉంటుందని నివేదిక అంచనా వేసింది. భారత్‌లో వచ్చే ఐదేళ్లలో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ వంటి టెక్నాలజీ ఆధారిత రంగాలకు ఉద్యోగుల వలస అత్యధికంగా ఉంటుందని నివేదిక పేర్కొంది.

పర్యావరణ, సామాజిక, పాలన రంగాల్లో ఉపాధి వృద్ధి ఊపందుకుంటుందని భారత్‌లో సర్వేలో పాల్గొన్న వారిలో 61 శాతం మంది పేర్కొన్నారు. తర్వాత కొత్త టెక్నాలజీలకు 59 శాతం, డిజిటల్ యాక్సెస్‌కు 55 శాతం, వాతావరణ మార్పులు, పెట్టుబడుల రంగాలకు 53 శాతం ఓటేశారు.

అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలను పెంచుకునేందుకు తమ యాజమాన్యమే అవకాశం కల్పించడం మేలని సర్వేలో పాల్గొన్న భారతీయ ఉద్యోగుల్లో ఏకంగా 97 శాతం అభిప్రాయపడ్డారు. ఇది ప్రభుత్వపరంగా జరగాలన్నవారు 18 శాతమే.

ఉపాధి సృష్టిపై డేటా అనలిటిక్స్ పెను ప్రభావం చూపుతుందని 62 శాతం కంపెనీలు నమ్ముతున్నాయి. తర్వాతి స్థానాన్ని ఎన్‌క్రిప్షన్–సైబర్ సెక్యూరిటీ (53 శాతం), డిజిటల్ ప్లాట్‌ఫాంలు, అప్లికేషన్లు (51), ఇ–కామర్స్ (46 శాతం)కు ఇచ్చాయి.

భారత్‌లో వచ్చే ఐదేళ్లలో ఉద్యోగుల వలస

ఏఐ, మెషీన్ లెర్నింగ్	38%
డేటా అనలిస్టులు, సైంటిస్టులు	33%
డేటా ఎంట్రీ క్లర్కులు	32%
ఫ్యాక్టరీ కార్మికులు	18%
ఆపరేషన్స్ మేనేజర్స్	14%
అకౌంటెంట్లు, ఆడిటర్లు	5%



3 ఉచిత సిలిండర్లు

రోజుకు అర లీటరు పాలు | **ఉమ్మడి పౌర స్మృతి, జాతీయ పౌరపట్టీ** | **కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ హామీలు**



శివాజీనగర: పోలింగ్‌కు పది రోజులే గడువు ఉందనగా కర్ణాటకలో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ ప్రకటించింది. ఈసారి మళ్లీ అధికారంలోకి వస్తే ఏకీకృత పౌర స్మృతి, జాతీయ పౌర పట్టీ అమలుచేస్తామని బీజేపీ ప్రకటించింది. 'ఏకీకృత పౌరస్మృతి దిశగా మేం నడిచేలా రాజ్యాంగం మాకు దారి చూపింది. 'అందరికీ న్యాయం. బుజ్జగింపులు లేవిక' అనేదే మా నినాదం'' అంటూ ఎన్నికల హామీల చిట్టాను సోమవారం బెంగళూరులో బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ప్రకటించారు. 'ఆరు 'ఏ'లు అంటే ఏ–అన్న(ఆహార భద్రత), ఏ–అక్షర(నాణ్యమైన విద్య), ఏ–ఆరోగ్య(అందుబాటులో ఆరోగ్యం), ఏ–ఆదాయ(ఆదాయ హామీ), ఏ–అభయ(అందరికీ సామాజిక న్యాయం), ఏ–అభివృద్ధి(డెవలప్‌మెంట్) ఉండేలా బీజేపీ ప్రజా ప్రణాళికను రూపొందించింది' అని నడ్డా అన్నారు. మేనిఫెస్టోలో మొత్తంగా 103 వాగ్దానాలు ఉన్నాయి. అభివృద్ధికేంద్రంగా మేనిఫెస్టో ఉందంటూ మోదీ కొనియాడారు.

మేనిఫెస్టోలోని కొన్ని ముఖ్యాంశాలు..

- ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రంలో యూనిఫామ్ సివిల్ కోడ్(యూసీసీ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్(ఎన్‌ఆర్‌సీ) అమలు
- దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఏటా 3 ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు.
- ఈ కుటుంబాలకు 'పోషణ' పథకం ద్వారా ఉచితంగా రోజుకు అర లీటరు నందిని పాలు. నెలకు ఐదు కేజీల 'శ్రీ అన్న– సిరి ధాన్య'.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ వార్డులో 'అటల్ ఆహార కేంద్రం'ను నెలకొల్పుతాం. అత్యంత కనిష్ట ధరకే నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం.
- మత ప్రాతిపదికన, ఉగ్రవాద వ్యతిరేక కర్ణాటక విభాగం(కే–ఎస్‌డబ్ల్యూఐఎఫ్‌టీ) ఏర్పాటు.
- రెవిన్యూ శాఖ గుర్తించిన సొంతిల్లులేని వారికి రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఇళ్ల స్థలాలు.
- సామాజిక న్యాయ నిధి పేరిట ఎస్సీ/ఎస్టీ వర్గాల గృహిణులకు గరిష్ఠంగా రూ.10,000 దాకా ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్ల అవకాశం.
- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రముఖ విద్యావేత్తలు, సంస్థల సౌజన్యంలో విశ్వేశ్వర విద్యా యోజన పథకం
- మిషన్ స్వాస్థ్య కర్ణాటక కింద ప్రతీ వార్డులో నమ్మ క్లినిక్(మన క్లినిక్).
- ఉత్పత్తి ఆధారిత రాయితీ పథకాల ద్వారా మరో 10 లక్షల ఉద్యోగాల కల్పన.
- సివిల్స్, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఆర్థికసాయం.
- కర్ణాటకను ఎలక్ట్రిక్ వాహనాల హబ్‌గా మార్చేందుకు చార్జింగ్ స్టేషన్ల స్థాపన, వేయి అంకుర సంస్థలకు ప్రోత్సాహం.
- అన్ని గ్రామ పంచాయతీల్లో చిన్న ఎయిర్ కండిషన్ సదుపాయాలు. వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాల స్థాపన. ఇందుకోసం రూ.30 వేల కోట్ల అగ్రిఫండ్ ఏర్పాటు.

యడియూరప్ప అసంతృప్తి

మేనిఫెస్టో విడుదల సందర్భంగా ప్రసంగించాలని మాజీ సీఎం యడియూరప్పను నేతలు కోరగా.. ప్రణాళికను పూర్తిగా చదవ కుండా ప్రసంగం చేయమంటే ఎలాగని ఆయ న అసంతృప్తిని వ్యక్తంచేశారు. ముందుగానే మేనిఫెస్టో కాపీని ఇవ్వాల్సిందని అనడంతో ఆయనలోని అసంతృప్తి బయటపడింది.

అంతా బోగస్: కాంగ్రెస్ విమర్శ

'అబద్ధపు, లూటీల బీజేపీ మేనిఫెస్టో ఇది. అంతా బోగస్' అని బీజేపీ హామీల చిట్టాపై కాంగ్రెస్ ఆరోపణలు గుప్పించింది. 'మేనిఫెస్టోలో ఉన్న వాటిల్లో 90 శాతం హామీలు 2018లోనే ఇచ్చింది. వీటిని ఇంతవరకు అమలుచేయలేదు. ఇప్పుడు మరో దఫా బోగస్ హామీలిస్తోంది' అని కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సూర్జేవాలా ట్వీట్‌చేశారు. 'నందిని బ్రాండ్‌ను అమూల్‌లో కలిపేసి కర్ణాటక ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూసింది. పెను విమర్శలతో ముఖం చెల్లని బీజేపీ ఇప్పుడు అర లీటర్ ఉచితమంటూ ముందుకొచ్చింది. ఇందిర క్యాంటీన్లను మూసేసిన ఇదే సర్కార్ ఇప్పుడు పేరుమార్చి మళ్లీ తెరుస్తానంటోంది. బెంగళూరు బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి ఇప్పుడు 'స్టేట్ కేపిటల్ రీజియన్' అంటూ కొత్తరకం ఫ్యాన్సీ పేర్లతో మభ్యపెడుతోంది. యూపీలో రెండు ఉచిత సిలిండర్లు అన్నారు. ఇంతవరకు దిక్కులేదు. కర్ణాటకలో ఏకంగా మూడు ఇస్తామంటున్నారు' అని మరో నేత జైరాం రమేశ్ ఎద్దేవాచేశారు. 2013–18 కాలంలో కర్ణాటకలో కాంగ్రెస్ రాష్ట్ర సర్కార్ 95 శాతం హామీలను నెరవేర్చిందని గుర్తుచేశారు.

మోదీ 'అసమర్థుడైన కొడుకు'

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే కొడుకు వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: ప్రధాని మోదీని విషసర్పమంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై గొడవ కొనసాగుతుండగానే ఆయన కొడుకు ప్రియాంక్ ఖర్గే మరో వివాదానికి తెర తీశారు. కలబురగి జిల్లా చిట్టాపూర్ స్థానం నుంచి మళ్లీ ఎన్నికయ్యేందుకు యత్నిస్తున్న ఖర్గే తనయుడు ప్రియాంక్ సోమవారం మోదీని అసమర్థుడైన కొడుకుగా అభివర్ణించారు. బంజారా కులంలో పుట్టానంటున్న మోదీ వారి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ''మీరేం భయపడకండి, మీ కొడుకు ఢిల్లీలో ఉన్నాడని కలబురగి బంజారా ప్రజలకు హామీ ఇచ్చారు. అసమర్థుడైన కొడుకు ఢిల్లీలో ఉంటే ఆ కుటుంబం ఎలా ముందుకెళుతుంది?'' అని ప్రశ్నించారు. కోలి, కబ్బలిగ, కురుబ వర్గానికి చెందినవాడినని గతంలో చెప్పిన మోదీ, తాజాగా బంజారా వర్గం వాడినని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రియాంక్ వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ ఈసీకి ఫిర్యాదు చేసింది.

విజిటింగ్ ప్రొఫెసర్‌గా 'అలీబాబా' జాక్ మా



టోక్యో: చైనా ఈ–కామర్స్ దిగ్గజం అలీబాబా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు జాక్ మా కాలేజీ ప్రొఫెసర్‌గా మారనున్నారు. ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ టోక్యోకు చెందిన పరిశోధన సంస్థ టోక్యో కాలేజీలో విజిటింగ్ ప్రొఫెసర్ కానున్నారు. సుస్థిర వ్యవసాయం, ఆహారోత్పత్తి అంశంపై ఆయన పరిశోధనలు చేస్తారని వర్సిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంట్రప్రెన్యూర్‌షిప్, కార్పొరేట్ మేనేజ్‌మెంట్ తదితర రంగాల్లో తన అనుభవాన్ని విద్యార్థులు, అధ్యాపకులతో జాక్ మా పంచుకుంటారని తెలిపింది. 1990ల్లో ఈ– కామర్స్ సంస్థ అలీబాబాను స్థాపించిన జాక్ మా ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ధనికుడు.

రూ.171 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ: వాణిజ్య అవసరాలకు ఎల్పీజీ వాడే వినియోగదారులకు శుభవార్త. వాణిజ్య విభాగ 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.171.5 తగ్గిస్తున్నట్లు సోమవారం కేంద్రప్రభుత్వ అధీనంలోని చమురు రిటైల్ సంస్థలు ప్రకటించాయి. దీంతో సోమవారం ఢిల్లీలో 19 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,028 నుంచి రూ.1,856.5కు దిగివచ్చింది. వాణిజ్య సిలిండర్ ధరలను వరసగా నెలవారీగా తగ్గించడం ఇది రెండోసారి కావడం విశేషం. ధర ఏప్రిల్ ఒకటో తేదీన రూ.91.5 తగ్గిన విషయం తెల్సిందే. ధర తగ్గడంతో హోటళ్లు, రెస్టారెంట్లు తదితరాలు నడిపే వాణిజ్య ఎల్పీజీ వినియోగదారులకు కాస్తంత ఆర్థికభారం తగ్గింది. అయినప్పటికీ మార్చి ఒకటోతేదీ నుంచి చూస్తే పెరిగిన రూ.350.5 తో పోలిస్తే ఇప్పటికే ధరభారం ఎక్కువే. కాగా, గృహావసరాలకు వాడే 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుతం ఢిల్లీలో 14.2 కేజీల సిలిండర్ ధర రూ.1,103. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు వరసగా 13వ నెలలోనూ యథాతథంగా ఉన్నాయి. అంతర్జాతీయ చమురు ధరల సగటుకు అనుగుణంగా ప్రతినెలా ప్రభుత్వ రంగ పెట్రోలియం సంస్థలు పెట్రో ఉత్పత్తుల ధరలను సవరిస్తున్న విషయం తెలిసిందే.

ఎవరిదో రాజధాని!


బెంగళూరు చిక్కితే అధికారం పక్కా

ఐటీ సిటీలో పాగాకు పార్టీల కుస్తీ



రాష్ట్రాన్ని గెలవాలంటే ముందు రాజధానిని గెలవాలి. కర్ణాటకలో అధికారిక పీఠానికి తాళాలు బెంగళూరులోనే ఉన్నాయి. బీజేపీకీ, కాంగ్రెస్‌కూ ఈ విషయం బాగా తెలుసు. దాంతో ఈసారి అధికార విపక్షాల మధ్య సిలికాన్ సిటీలో సంకుల సమరం సాగుతోంది.

కన్నడ పోరు



సాక్షి, బెంగళూరు: బెంగళూరులో ఎక్కువ సీట్లు గెలిచిన పార్టీయే కర్ణాటకలో అధికారంలోకి వస్తుందని గడచిన పలు ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే తెలుస్తోంది. అందుకే బెంగళూరు పరిధిలోని 28 అసెంబ్లీ స్థానాల్లో అత్యధిక స్థానాలు నెగ్గి అధికారంలోకి రావాలని బీజేపీ, కాంగ్రెస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

గడిచిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో తీరు తెన్నులు..

- 2008లో బెంగళూరులో బీజేపీ 17, కాంగ్రెస్ పార్టీ 10 సీట్లు గెలవగా జేడీ(ఎస్) ఒక్క స్థానానికి పరిమితమైంది. బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి దక్షిణ భారతంలో తొలిసారి ఆ ఘనత సాధించింది.
- 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ 13, బీజేపీ 12, జేడీ(ఎస్) 3 సీట్లు గెలిచాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సిద్ధరామయ్య తొలిసారి సీఎం అయ్యారు.
- 2018లో కాంగ్రెస్15, బీజేపీ 11, జేడీ(ఎస్) 2 స్థానాలు దక్కించుకున్నాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. కుమారస్వామి సీఎం అయ్యారు. కానీ సర్కారు బలపరీక్షలో ఓడి 14 నెలలకే కుప్పకూలింది.
- 2019లో కాంగ్రెస్, జేడీ(ఎస్) సభ్యులు బీజేపీకి ఫిరాయించడంతో 15 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోయింది. బీజేపీ ఏకంగా 12 సీట్లు నెగ్గింది. అలా బెంగళూరులో బీజేపీ బలం 15కు పెరగగా కాంగ్రెస్ 11 స్థానాలకు పడిపోయింది. బీజేపీ అధికారాన్ని స్థిరపరచుకుంది.


వేధిస్తున్న తక్కువ ఓటింగ్

బెంగళూరులో ప్రతిసారీ తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుండడం పరిపాటిగా వస్తోంది. 2013, 2018 ఎన్నికల్లో ఓటింగ్ శాతం బాగా పడిపోయింది. సగానికి సగం, అంటే నియోజకవర్గాల్లో మరీ తక్కువ ఓటింగ్ నమోదవుతూ వస్తోంది. బెంగళూరు వాసులు ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపరన్న అపప్రథా ఉంది. దీన్ని ఈసారైనా తొలగించుకుంటారా అన్నది చూడాలి.

- 2013 ఎన్నికల్లో బెంగళూరు పరిధిలో కేవలం 55.04% ఓటింగ్ నమోదైంది. 2018లో అది కాస్తా 48.03 శాతానికి తగ్గింది.
- దాంతో ఈసారి ఎలాగైనా రాజధానిలో ఓటింగ్ శాతాన్ని పెంచడంపై ఎన్నికల సంఘం ప్రధానంగా దృష్టి పెట్టింది. కొద్ది రోజులుగా ప్రత్యేక ర్యాలీలు, వాకథాన్లు, ప్రచారాలు చేపడుతోంది.

తటస్థ ఓటర్లే కీలకం

- ట్రాఫిక్ సమస్య, మౌలిక వసతుల లేమి వంటి పలు సమస్యలు బెంగళూరును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎవరు అధికారంలోకి వచ్చినా ఈ సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్నారన్నది నగరవాసుల ప్రధాన ఆరోపణ.
- ఇక్కడ 15 నుంచి 20 శాతం ఓటర్లు కులమతాలకు అతీతంగా తటస్థంగా ఉంటారు.
- వీరిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.
- బీజేపీ అవినీతి, పాలన వైఫల్యాలు, కుంభకోణాలను ప్రచారం చేస్తూ నగర వాసులను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. శాంతినగర, సర్వజ్ఞ నగర వంటి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎంతో బలంగా ఉంది.
- ఇక తటస్థ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు బీజేపీ నేతలు ఇంటింటి ప్రచారానికి దిగారు.
- కాంగ్రెస్, జేడీ(ఎస్)ల నుంచి ఫిరాయించిన ఎమ్మెల్యేలతో నగరంలో బీజేపీ బలంగా కనిపిస్తోంది.



దేశ ద్రోహం చట్ట సవరణకు సిద్ధం



సాక్షి, న్యూఢిల్లీ: స్వాతంత్ర్యం ముందునాటి దేశ ద్రోహచట్టం కింద భారత శిక్షాస్మృతిలోని 124ఏ సెక్షన్‌ను ప్రయోగించడంపై నిపుణులతో సంప్రదింపుల ప్రక్రియ కీలక దశలో ఉందని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్రం తెలియజేసింది. ''124ఏ సెక్షన్ సవరణకు మేం సిద్ధం. సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోంది. తర్వాత పార్లమెంట్ పరిశీలనకు వెళుతుంది. కనుక పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తర్వాతే కేసు విచారణను చేపట్టండి' అని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అభ్యర్థించారు. దాంతో విచారణను ఆగస్టు రెండో వారానికి వాయిదా వేస్తున్నట్లు బెంచ్ తెలిపింది. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వందలాది మందిపై చాలా రాష్ట్రాల్లో సెక్షన్ 124ఏ కింద కేసులు నమోదవడం, ఆ సెక్షన్ కింద ఇకపై కేసులు నమోదుచేయకూడదంటూ గత మే 11న సుప్రీంకోర్టుకు చరిత్రాత్మక తీర్పు వెలువర్చడం తెల్సిందే.

సీనియర్ సిటిజన్లకు రాయితీల రద్దుతో.. రైల్వే శాఖకు రూ.2,242 కోట్లు

న్యూఢిల్లీ: సీనియర్ సిటిజన్ల టికెట్ రాయితీలరద్దుతో 2022–23లో అదనంగా రూ.2,242 కోట్లు ఆర్జించినట్లు రైల్వే శాఖ తెలిపింది. 58 ఏళ్లు పైబడిన మహిళలకు 50%, 60 ఏళ్లు దాటిన పురుషులు, ట్రాన్స్‌జెండర్లకు 40% టికెట్ ధరలో రాయితీ ఉండేది. కరోనా నేపథ్యంలో 2020 మార్చి దీన్ని నిలిపేసిన రైల్వే శాఖ ఇప్పటిదాకా పునరుద్ధరించలేదు.

తుపాకీ అప్పగిస్తే గిఫ్ట్ కార్డు బహుమానం

న్యూయార్క్: తుపాకీ సంస్కృతిని అరికట్టేందుకు అమెరికాలోని న్యూయార్క్ నగరం వినూత్న ఆఫర్‌తో ముందుకు వచ్చింది. ఒక్కో తుపాకీకి 500 డాలర్ల విలువైన గిఫ్ట్ కార్డు ఇస్తామని ప్రకటించి, అందుకు గాను 9 కేంద్రాలను శనివారం ఏర్పాటు చేసింది. వీటికి పౌరుల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. వివిధ రకాల అసాల్ట్ రైఫిళ్లు, ఘోస్ట్ గన్స్ కలిపి 3 వేలకు పైగా తుపాకులను పౌరులు అప్పగించినట్లు న్యూయార్క్ అధికారులు తెలిపారు. మొదటి ఆయుధానికి 500 డాలర్లు, ఆపై ప్రతి ఆయుధానికి 150 డాలర్ల చొప్పున అందజేశామన్నారు. బ్రూక్లిన్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేసిన మూడు గంటల్లోనే 90 గన్లను సరెండర్ చేయగా, సిరాక్యూజ్‌లో అత్యధికంగా 751 ఆయుధాలను అప్పగించారన్నారు. తమ వద్దకు చేరిన ప్రతి ఆయుధంతో ఒక జీవితాన్ని కాపాడినట్లే, ఒక ప్రమాదకర కాల్పుల ఘటనను నివారించినట్లేనన్నారు.



కర్ణాటక ఎన్నికలు మీ కోసం కాదు

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ చురకలు

తుమకూరు: కాంగ్రెస్ నేతలు తనను 91 పర్యాయాలు దూషించారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. కర్ణాటక ఎన్నికలు ఆయన కోసం కాదన్న విషయాన్ని ప్రధాని మోదీ అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. రాహుల్ సోమవారం తురువెకెరె నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రచార సభలో ప్రసంగించారు. 'ఎన్నికల ప్రచారం కోసం మీరు కర్ణాటకకు వచ్చారు. గత మూడేళ్లలో మీరు కర్ణాటకకు ఏం చేశారో చెప్పాలి. అలాగే, వచ్చే అయిదేళ్లలో యువత, విద్య, ఆరోగ్యం, అవినీతిపై పోరు వంటి అంశాల్లో ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలి. అయితే, మీరు కర్ణాటక గురించి మాట్లాడటం లేదు. ఇక్కడి నేతలు బొమ్మై, యడ్యూరప్ప గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడరు. నరేంద్ర మోదీ గురించి మాత్రం చెప్పుకుంటున్నారు. ఈ ఎన్నికలు ఏ ఒక్కరి కోసమో కాదు. మోదీ గురించి కాదని గ్రహించాలి' అన్నారు. ''కర్ణాటకలో పర్యటనలప్పుడు సిద్ధరామయ్య, శివకుమార్ వంటి కాంగ్రెస్ నేతలు ప్రజల కోసం ఏం చేశారో నేను చెబుతుంటా. మోదీ కూడా సీఎం బొమ్మై, మాజీ సీఎం యడియూరప్ప పేర్లను ఒకట్రెండుసార్లు ప్రస్తావిస్తే వారు కూడా సంతోషపడతారు కదా!'' అని రాహుల్ అన్నారు.

బీజేపీకి 40 సీట్లు చాలు

కర్ణాటకలో బీజేపీ సర్కారు 40 శాతం పర్సంటేజీలు తీసుకుంటోందని కాబట్టి ఈ ఎన్నికల్లో 40 సీట్లు ఇస్తే చాలని రాహుల్ అన్నారు. ప్రతి పనికీ కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్లు తీసుకుంటున్న బీజేపీని ఈసారి 40 సీట్లకే పరిమితం చేయాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో 150 సీట్లు కాంగ్రెస్ పార్టీకి ఇచ్చినట్లయితే తమ ఎమ్మెల్యేలను బీజేపీ లాక్కోలేదని అన్నారు. బీజేపీ గతంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మఠాధిపతుల నుంచీ వసూళ్లు చేసిందన్నారు.



బ్రిటన్ యువరాజు ఛార్లెస్ పట్టాభిషేకాన్ని పురస్కరించుకుని రాయల్ మెయిల్ సంస్థ కొత్తగా తయారుచేసిన స్మారక తపాలా బిళ్లలు

సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 2 । మే । 2023



సచివాలయానికి నయా ఠాణా

దేశ రాజధాని ఢిల్లీ కమిషనరేట్‌లో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసుస్టేషన్ ఉన్నట్లే హైదరాబాద్‌లో సెక్రటేరియట్ ఠాణా ఏర్పాటు కానుంది. సచివాలయం కేంద్రంగా ఇది పని చేయనుంది. -8లో



క్రీడలతో విద్యార్థుల్లో మనోస్థైర్యం

విద్యార్థులు ఏదో ఒక చోట అవకాశం దొరికిన ప్రతిసారి క్రీడల్లో పాల్గొనాలని సీఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ తుర్లపాటి విశ్వనాథ్ సూచించారు. -8లో

..నేరాల కేసుల్ని దర్యాప్తు చేయండి



నేరాలు చోటుచేసుకున్న సందర్భంలో దర్యాప్తు అధికారులు క్లూస్ టీమ్‌తో కలిసి పనిచేయడం ద్వారా కేసుల్ని వీలైనంత త్వరగా కొలిక్కి తేవాలని నగర కొత్వాల్ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. -8లో







కార్మిక లోకానికి లాల్ సలాం

శ్రమజీవుల చైతన్యానికి పట్టం కట్టిన రోజు. కార్మిక, కర్షక లోకానికి సలాం కొట్టిన రోజు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి అంటూ నినదించిన రోజు.. మే డే. సోమవారం సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో మే డే ర్యాలీ చేపట్టారు. కళాకారుల ఆటాపాటలతో నారాయణగూడ వైఎంసీఏ నుంచి ప్రారంభమైన ర్యాలీ ముషీరాబాద్ వరకు కొనసాగింది. కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేద్దామంటూ సీఐటీయూ నేతలు నినదించారు. - ముషీరాబాద్

న్యూస్‌రీల్

మౌనిక మృతి కలచివేసింది

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మౌనిక కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: నాలాలో పడి చనిపోయిన చిన్నారి మౌనిక మృతి అందరినీ కలచివేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చెక్కును బాధిత కుటుంబానికి సోమవారం ఆయన అందించారు. చిన్నారి లేని లోటు తీర్చలేనిదన్నారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. మౌనికను తలుచుకుంటూ రోదిస్తున్న తల్లిదండ్రులు రేణుక, శ్రీనివాస్‌లను మంత్రి ఓదార్చారు. తలసాని వెంట డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఈఈ సుదర్శన్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, నాయకులు ఆంజనేయులు, విజయ్, భాస్కర్, జగత్‌రావు తదితరులు ఉన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల కేటాయింపు నేడు

సాక్షి, సిటీబ్యూరో: రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు చెందిన నాగోల్ బండ్లగూడ, పోచారంలలో మిగిలిపోయిన ఫ్లాట్లను మంగళవారం కేటాయించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. గత నెల 15 నాటికి టోకెన్ అడ్వాన్స్ చెల్లించిన వారి పేర్లతో పారదర్శకంగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు వారు చెప్పారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి లాటరీ ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

7న కోకాపేటలో రాజశ్యామల దేవాలయ శిలాన్యాసం

మణికొండ: నగర శివారు కోకాపేటలో శ్రీశారదా పీఠం ఆధ్వర్యంలో రాజశ్యామల దేవాలయాన్ని నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం దేవాలయ శిలాన్యాస మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు తెలిపారు. శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీస్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వారు వివరించారు. దక్షిణ భారతానికే తలమానికంగా నిలిచేలా శిల్పకళా సౌందర్యం ఉట్టిపడేలా, చోళులు, పల్లవుల నిర్మాణశైలి ఆలయానికి వన్నె తెస్తుందని వారు తెలిపారు. ఇప్పటి వరకు అమ్మ వారి దేవాలయం దేశంలో ఒక విశాఖపట్టణంలోనే ఉందని, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రంగాను ఆలయ నిర్మాణం కానుందన్నారు. 7వ తేదీన జరిగే శిలాన్యాసం కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించనున్న వైద్యులు



వైద్యులు కృష్ణారెడ్డి, శోభాదేవి

కాచిగూడ: ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించేందుకు ఇద్దరు డాక్టర్లతో కూడిన బృందం ఈ నెల 6న నగరం నుంచి బయలుదేరేందుకు సిద్ధమవుతోంది. 71 ఏళ్ల వరల్డ్ రికార్డ్ హోల్డర్ డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, 67 సంవత్సరాల మిసెస్ ఇండియా అవార్డు గ్రహీత డాక్టర్ నక్కన శోభాదేవి ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సోమవారం కాచిగూడలో వారు మాట్లాడుతూ.. జీవితంలో పట్టుదలతోనే ఏదైనా సాధించవచ్చనే సందేశాన్ని నేటి యువతరానికి అందించేందుకే ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు.

భగభగలో.. చిటపట

వేసవిలో హడలెత్తిస్తున్న వరుణుడు



- ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో సగటున 8 సెం.మీ వర్షపాతం
- భారీ ఈదురు గాలులు, ఉరుములు, వడగళ్ల బీభత్సం
- రోడ్లపై పొంగిపొర్లిన వరద ప్రవాహం
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు

బేగంపేట్ మయూర్ మార్గ్ రోడ్డు ఇలా..



సాక్షి, సిటీబ్యూరో: మండువేసవిలో భారీ ఈదురు గాలులు.. ఉరుములు.. మెరుపులు, పిడుగులు, వడగళ్లతో వరుణుడు హడలెత్తిస్తున్నాడు. ఏప్రిల్ నెలంతా పొద్దంతా భానుడి ప్రతాపం, సాయంత్రం కుండపోత వర్షంతో మహానగరం అతలాకుతలమైంది. వరుణుడు ఉగ్రరూపం దాల్చడంతో నగర పరిస్థితి ఛిన్నాభిన్నంగా మారింది. ఫలితంగా ప్రాణ నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం కూడా సంభవించింది. గోడ కూలి 8 నెలల చిన్నారి మృతి చెందగా, నాలాలో కొట్టుకుపోయి 11 ఏళ్ల బాలిక, విద్యుత్ తీగలు తగిలి గ్రేహౌండ్స్ పోలీసు కానిస్టేబుల్ మృత్యువాత పడిన విషాద ఘటనలు విదితమే. నీట మునిగిన వాహనాలు మెకానిక్ షెడ్లకు చేరాయి. వర్ష బీభత్సంతో ప్రతిసారీ నగరం జల సంద్రాన్ని తలపిస్తూ వస్తోంది. రోడ్లపై వరద పొంగిపొర్లింది. డ్రైనేజీలు బెంబేలెత్తించాయి. మోకాలి లోతు వరకు వరద ప్రవాహం కొనసాగి వాహనదారులు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. వరద ముంపు నుంచి తేరుకోకముందే మళ్లీ వర్ష పరంపర కొనసాగడం ఆందోళన కలిగించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి.. సాయంత్రం కాగానే అదే స్థాయిలో వాతావరణం చల్లబడటం నిమిషాల వ్యవధిలోనే మబ్బులు కమ్ముకుని విరామం ఇవ్వకుండా సగటున అరగంట నుంచి రెండు గంటల వరకు భీకర వర్షం కురుస్తూ వచ్చింది. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వరద నీరు రావడంతో జనం నానా తంటాలు పడ్డారు.

ఈదురు గాలులతో భయానకం..

ఉత్తర ద్రోణి గాలి అనిచ్ఛితి ప్రభావంతో సుమారు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలుల తీవ్రతకు వందలాది చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. భారీ మహా వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు వంగిపోయి తీగలు తెగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అయి గంటల కొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇళ్ల గోడలు కూలిపోగా, పై కప్పులు, రేకులు ఎగిరిపోయాయి.

రికార్డు స్థాయిలో..

నగరం మండు వేసవిలో అత్యధిక వర్షపాతాన్ని చవిచూసింది. సగటు వర్షపాతం 8 సెంటీమీటర్లకు పైగా నమోదై గత రెండు దశాబ్దాల రికార్డును అధిగమించింది. 2015 ఏప్రిల్‌లో 6.8 సెంటీమీటర్లు నమోదు కాగా.. ఈసారి సగటున 8 సెంటీమీటర్లకు పైగా నమోదై రికార్డు సృష్టించింది. ఈ సీజన్ మార్చి, ఏప్రిల్ నెలలో మహానగరంలో సాధారణ వర్షపాతం కంటే 214 శాతం అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో జిల్లాల వారీగా హైదరాబాద్‌లో 38.6 మిల్లీమీటర్లకు గాను 138.2 మిల్లీ మీటర్లు, రంగారెడ్డి జిల్లా పరిధిలో 41.1 మిల్లీమీటర్లకు గాను 88.3, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 44.0 మిల్లీమీటర్లకు గాను 111.3 మిల్లీమీటర్లు నమోదైంది.

ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షపాతం ఇలా..

ప్రాంతం	సెంటీమీటర్లు
షేక్‌పేట	10.6
ఖాజాగూడ	9.6
కొండాపూర్	8.9
రామంతాపూర్	8.2
ప్రశాంత్‌నగర్	8.1
శ్రీనగర్ కాలనీ	8.0
మాదాపూర్	7.3
తార్నాక	7.1
మైత్రివనం	6.9
జూబ్లీహిల్స్	6.9
బంజారాహిల్స్	6.6
మల్లాపూర్	6.3
హబ్సిగూడ	6.3
కాప్రా	6.2
ఉప్పల్	6.2
బాలానగర్	6.1
మల్కాజిగిరి	6.0

వదలని వాన

నగరాన్ని కుండపోత వర్షం వదలడంలేదు. బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షం వెంటాడుతూనే ఉంది. ఆదివారం రాత్రి అతలాకుతలం చేసిన వరుణుడు సోమవారం రాత్రి వరకూ పలు ప్రాంతాల్లో ఉగ్రరూపం దాల్చాడు. ఆదివారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం షేక్‌పేట, ఖాజాపేట, ఉప్పల్, బాలానగర్, మల్కాజిగిరి, అమీర్‌పేట, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాలను ముంచెత్తాయి. నాలాలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో నీరు చేరి అవస్థలు పడ్డారు. చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై రాత్రిపూట వాన దంచికొట్టింది. భారీ వర్షానికి వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. రోడన్నీ జలమయం కావడంతో ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. ప్రధానంగా ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారిపై బోడుప్పల్ వద్ద రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో వాహనాలు ముందుకు సాగలేదు. విజయవాడ- హైదరాబాద్ మార్గంతో పాటు పలు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

సోమవారం రాత్రి నమోదైన వర్షపాతం.. సెంటీమీటర్లలో..

గాజుల రామారం 3.0, బండ్లగూడ 2.9, కందికల్ గేట్ 2.9, జీడిమెట్ల 2.8, మల్కాజిగిరి 2.8, లింగోజిగూడ 2.7, హస్తినాపూర్ 2.6, ఘాన్సీ బజార్ 2.6, సరూర్‌నగర్ 2.6, ప్రశాంత్‌నగర్ 2.4, కిషన్‌బాగ్ 2.3, కంచన్‌బాగ్ 2.3, హయత్‌నగర్ 2.2, చందులాల్ బారాదరి 2.1, అల్వాల్‌లో 2 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెప్పారు.

సెల్లార్ల వద్ద బహుపరాక్!



అమీర్‌పేట్‌లోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నీట మునిగిన వాహనాలు

- రక్షణ చర్యలు లేకుంటే బిల్డర్లపై క్రిమినల్ కేసులు
- వర్షాకాల జాగ్రత్తలపై మార్గదర్శకాలు జారీ
- అప్రమత్తంగా ఉండాలన్న బల్దియా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత మండువేసవిలో అకాల వర్షాలు నగరవాసుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. వరదల కారణంగా పలు ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. సెల్లార్ల పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రమాదాలకు ఎక్కువ అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో పాటించాల్సిన నిబంధనల్ని ఇప్పటినుంచే అమలు చేసేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజల రక్షణ కోసం ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న భవనాలను తనిఖీ చేసి సెల్లార్ల ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లున్నదీ లేనిదీ పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ అన్ని సర్కిళ్ల డిప్యూటీ/అసిస్టెంట్ సిటీప్లానర్లను ఆదేశించారు. తనిఖీలకు సంబంధించిన నివేదికను అందజేయాలని పేర్కొన్నారు. ఇందులో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇవీ మార్గదర్శకాలు..

- నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలను తనిఖీ చేసి సెల్లార్ల తవ్వకాలు పురోగతిలో ఉంటే అనుమతి పొందిన ప్లాన్‌కు అనుగుణంగా సెట్‌బ్యాక్‌లు ఉన్నదీ, లేనిదీ పరిశీలించాలి.
- సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో నీరు నిలిచి ఉన్నట్లయితే వెంటనే పనులు నిలిపివేసి నీటిని తొలగించాలి. నిబంధనలకనుగుణంగా నేల దృఢంగా ఉందో లేదో తెలుసుకునేందుకు పరీక్షలు చేయాలి. చుట్టూ బారికేడింగ్‌తో పాటు రిటైనింగ్‌వాల్ నిర్మించాలి. వీటికోసం వెంటనే నోటీసులు జారీ చేయాలి.
- నోటీసులకనుగుణంగా నడుచుకోని పక్షంలో పనుల్ని వెంటనే నిలిపివేయడంతో పాటు నిర్మాణ అనుమతిని, బిల్డర్ లైసెన్సును రద్దు చేయాలి. నిర్లక్ష్యానికి బిల్డర్‌పై క్రిమినల్‌కేసు నమోదు చేయాలి.
- సగం తవ్వి వదిలేసిన సెల్లార్లను సీఅండ్‌డీ వేస్ట్ విభాగం సహకారంతో పూడ్చివేయాలి. అనుమతి పొంది కానీ, అనుమతి లేకుండా కానీ ఇప్పటికే తవ్విన సెల్లార్ల వద్ద పనులు జరగకుండా ఉన్నట్లయితే చుట్టుపక్కల ఉన్న భవనాల భద్రతను పరిశీలించాలి. అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. సీఅండ్‌డీ, పారిశుద్ధ్య విభాగాల సహకారంతో తవ్విన సెల్లార్లను పూడ్చివేయాలి.
- నిర్మాణ ప్రాంతాల్లో లేబర్ క్యాంపులున్న ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు లేకుండా చూడాలి. నివాసాలు సెల్లార్ల పక్కనే ఉన్నట్లయితే సురక్షిత ప్రాంతానికి తరలించాల్సిందిగా బిల్డర్లకు నోటీసులు జారీ చేయాలి. వర్షాకాలం ఆరంభం నుంచి ముగిసేంత కొత్తగా సెల్లార్ల తవ్వకాలకు అనుమతులివ్వొద్దు.



అత్తాపూర్‌లో..



అత్తాపూర్ రహదారిపై వరద నీరు



అమీర్‌పేట్ లాల్ బంగ్లా వద్ద..



కూకట్‌పల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



కేబీఆర్ పార్కు వద్ద చేరిన వరద నీరు



బంజారాహిల్స్‌లో కారుపై కూలిన భారీ వృక్షం



పాతబస్తీలో వాహనదారుల కష్టాలు



ఎల్లారెడ్డిగూడలో కాలనీని ముంచెత్తిన వరద



అమీర్‌పేట్‌లో ధ్వంసమైన రహదారి



వెస్ట్ మారేడ్‌పల్లిలో కారుపై కూలిన చెట్టు



కూకట్‌పల్లిలో మోకాలు లోతు నీరు..



రాజేంద్రనగర్‌లో..

క్లూస్ టీమ్స్‌తో కలిసి నేరాల కేసుల్ని దర్యాప్తు చేయండి

- అధికారులను ఆదేశించిన కొత్వాల్ ఆనంద్
- ఏసీపీలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగింత


సమీక్ష సమావేశంలో పాల్గొన్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ సొత్తు సంబంధిత నేరాల బారినపడిన బాధితులకు వీలున్నంత ఊరట ఇవ్వడానికి నగర కొత్వాల్ సీవీ ఆనంద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయా నేరాలు చోటు చేసుకున్న సందర్భంలో దర్యాప్తు అధికారులు క్లూస్ టీమ్‌తో కలిసి పనిచేయడం ద్వారా కేసుల్ని వీలున్నంత త్వరగా కొలిక్కి తేవాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఏసీపీ ఆపై స్థాయి అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో మాట్లాడిన పోలీసు కమిషనర్ పెండింగ్ కేసులను కొలిక్కి తీసుకురావడం, వారెంట్లు అమలు చేయడంతో పాటు ఇతర కీలకాంశాలను స్వయంగా ఏసీపీ స్థాయి అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, డేటాబేస్ వినియోగం తదితర చర్యల వల్ల కేసులు తర్వగా కొలిక్కి రావడంతో పాటు కోర్టులో దోషులకు శిక్షలు పడే అవకాశమూ పెరుగుతుందని ఆనంద్ సూచించారు. కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఠాణాలు, ఏసీపీ, డీసీపీ ఆఫీసులకు కార్యాలయాలతో పాటు సిబ్బంది, వాహనాల కేటాయింపుపైనా ఈ సమావేశంలో చర్చించారు. నగర పోలీసు విభాగంలో ఉన్న అధికారులు, సిబ్బందిలో 16,008 మంది ఆరోగ్య వివరాలు ఫిట్ కాప్‌తో అందుబాటులోకి వచ్చాయని, ఈ యాప్ ద్వారా అనునిత్యం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యకలాపాలు, ఈ–ఆఫీస్ నిర్వహణతో పాటు పరిపాలన అంశాలు ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో అదనపు సీపీలు విక్రమ్ సింగ్ మాన్, ఏఆర్ శ్రీనివాస్, జి.సుధీర్‌బాబు, సంయుక్త సీపీలు గజరావ్ భూపాల్, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సినీ ప్రముఖులకు సత్కారం



పాటల రచయిత చంద్రబోస్‌ను సత్కరించిన దృశ్యం

గచ్చిబౌలి: తెలుగు సినీ కార్మికుల ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి వీడియో ద్వారా తన కార్మిక దినోత్సవ సందేశాన్ని పంపగా వినిపించారు. అనంతరం ఫిలిం ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ఆర్ చిత్రానికి పనిచేసిన ఇరవై నాలుగు విభాగాల వారిని ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా పాటల రచయిత చంద్రబోస్, సినిమాటోగ్రాఫర్ కెకె సెంథిల్‌కుమార్, ఆర్ట్ డైరెక్టర్ సాబూసిరీస్, స్టంట్ మాస్టర్ కింగ్ సోలమన్‌లను ఘనంగా సత్కరించారు. ఫిలిమ్ ఫెడరేషన్‌కు ఇటీవల ఎన్నికైన అధ్యక్షులు అనిల్‌కుమార్ వల్లభనేని, కార్యదర్శి పీఎస్ఎన్ దొర, కోశాధికారి వి.సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల సినీ కార్మికులకు పెంచిన వేతనాల అగ్రిమెంట్లను ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ వారికి ఫిలిం చాంబర్ అందించింది. ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం, ఫిలించాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, దర్శకుడు కాశీ విశ్వనాథ్, ఎన్ శంకర్, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, సి.కళ్యాణ్, దామోదరప్రసాద్, ప్రసన్నకుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ పాల్గొన్నారు.

సలావుద్దీన్‌కు శ్రమశక్తి అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: కార్మికుల హక్కుల సాధనకు కృషి చేస్తున్న గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌కు శ్రమశక్తి అవార్డు దక్కింది. కార్మిక దినోత్సవం సందర్భంగా మంత్రి మల్లారెడ్డి, బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన సోమవారం అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును దేశమంతటా పనిచేస్తున్న ప్లాట్‌ఫారమ్ వర్కర్లకు అంకితం చేస్తున్నట్లు సలావుద్దీన్ ప్రకటించారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల సామాజిక భద్రత ప్రయోజనాల కోసం చట్టాలను రూపొందించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



సచివాలయానికి నయా ఠాణా

- లేక్ పోలీసుస్టేషన్ బదులు దీని ఏర్పాటు
- మధురానగర్ కేంద్రంగానూ పోలీసుస్టేషన్
- ప్రత్యేక విభాగాలకు సర్కారు ఆమోదముద్ర



సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీ కమిషనరేట్‌లో పార్లమెంట్ స్ట్రీట్ పోలీసుస్టేషన్ ఉన్నట్లే హైదరాబాద్‌లో సెక్రటేరియేట్ ఠాణా ఏర్పాటు కానుంది. హుస్సేన్‌సాగర్ తీరాన అందుబాటులోకి వచ్చిన సచివాలయం కేంద్రంగా ఇది పని చేయనుంది. పార్లమెంట్ పోలీసుస్టేషన్‌కు ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా (ఎస్‌హెచ్ఓ) ఉంటారు. సచివాలయం ఠాణాకు ఏ స్థాయి అధికారి ఉంటారన్నది తేలాల్సి ఉంది. దీంతో పాటు పునర్ వ్యవస్థీకరణలో భాగమైన ఠాణాలు, డివిజన్లు, జోన్లు, ప్రత్యేక యూనిట్లు ఏర్పాటుకు ఆమోద ముద్ర పడింది. ఈ మేరకు హోం శాఖ కార్యదర్శి జితేందర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సచివాలయంలోని తన చాంబర్‌లో అడుగుపెట్టిన హోం మంత్రి మహమూద్ అలీ ఈ ఫైల్‌పై ఆదివారమే సంతకం చేసిన విషయం విదితమే. ప్రాథమిక ప్రతిపాదనల ప్రకారం హైదరాబాద్ కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణతో కొత్తగా రెండు జోన్లు, 10 డివిజన్లు, 13 ఠాణాలు ఏర్పాటు కావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల నేపథ్యంలో 11 డివిజన్లు, 11 ఠాణాలే వచ్చి చేరుతున్నాయి. దీంతో జోన్ల సంఖ్య ఏడుకు, సబ్–డివిజన్లు 28కు, ఠాణాలు 72కు చేరతాయి. లేక్ ఔట్‌పోస్టును ఠాణాగా మార్చాల్సి ఉండగా దీని స్థానంలో సెక్రటేరియేట్ ఠాణా ఏర్పాటు చేస్తున్నారు. నార్త్‌జోన్‌లో తాడ్‌బన్ ఠాణా ఏర్పాటు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. పశ్చిమ మండలంలో రెహ్మత్‌నగర్ పోలీసుస్టేషన్‌కు బదులుగా మధురానగర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. శాంతిభద్రతల విభాగంలో కొత్తగా వస్తున్న సౌత్ ఈస్ట్, సౌత్ వెస్ట్ జోన్లకు అదనంగా ట్రాఫిక్ వింగ్‌లో మూడోదిగా సౌత్ ఈస్ట్ డివిజన్ వస్తోంది. ప్రస్తుతం ఉన్న, అందుబాటులోకి రానున్న జోన్లతో కలిపి మొత్తం ఏడింటికీ ప్రత్యేకంగా జోనల్ పోలీసు కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. అలాగే కొత్తగా రెండు టాస్క్‌ఫోర్స్, ఒక ఐటీ సెల్, సైబర్ క్రైమ్ వింగ్స్ ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అసెంబ్లీకి ఉన్నట్లుగా సచివాలయం కోసం ప్రత్యేకంగా సెక్రటేరియేట్ సెక్యూరిటీ వింగ్ అందుబాటులోకి తీసుకువస్తున్నారు. మహిళల భద్రత కోసం నగర వ్యాప్తంగా ఐదు ఉమెన్ సేఫ్టీ వింగ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (హెచ్–న్యూ) స్పెషల్ యూనిట్ హోదా వచ్చింది.

క్రీడలతో విద్యార్థుల్లో మనోస్థైర్యం పెరుగుతుంది

కమాండెంట్ విశ్వనాథ్


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కమాండెంట్ విశ్వనాథ్

బంజారాహిల్స్: నగరాల్లో చదువుకునే విద్యార్థులకు ఆటస్థలాల కొరత వల్ల ఎక్కువగా క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉండదని, అయినా కూడా విద్యార్థులు ఏదో ఒక చోట అవకాశం దొరికిన ప్రతిసారి క్రీడల్లో పాల్గొనాలని సీఆర్‌ఎఫ్ బెటాలియన్ కమాండెంట్ తుర్లపాటి విశ్వనాథ్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్–స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (జేఎన్ఐఏఎస్–ఎస్‌పీఏ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన క్రీడా పోటీల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగానే కాకుండా మానసిక స్థైర్యం కూడా పెరుగుతుందని అన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు కురుక్షేత్ర పేరుతో నిర్వహించిన ఈ క్రీడాపోటీల్లో వివిధ కాలేజీల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతుల్లో వివిధ విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ హర్షల్ షిండె, ప్రిన్సిపాల్ షాలిని కాకాని, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జలమండలి సీజీఎం మృతి

- పలు కీలక పథకాల్లో పాలుపంచుకున్న ఖ్యాతి
- తాగునీటి పథకాలకు రూపకల్పన



సంస్మరణ సభలో పాల్గొన్న దానకిశోర్ తదితరులు, ఇన్‌సెట్‌లో ప్రసన్నకుమార్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) ఎం.ఎల్. ప్రసన్న కుమార్(60) ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. బోర్డులో మేనేజర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి సీజీఎం స్థాయికి ఎదిగారు. వివిధ విభాగాల్లో పనిచేస్తూ.. 35 ఏళ్ల పాటు సుదీర్ఘ సేవలందించారు. జలమండలి చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన సింగూరు, కృష్ణా, గోదావరి తాగునీటి పథకాల రూపకల్పన, తాగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించారు. తెలంగాణ ప్రభుత్వం 2005లో ప్రతిష్టాత్మక మిషన్ భగీరథ పథకంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఇంజినీరింగ్ ప్లాన్లను రూపొందించిన బృందానికి నాయకత్వం వహించారు. హైదరాబాద్ సీవరేజి మాస్టర్ ప్లాన్‌లో ఎస్టీపీల ప్రణాళికలను రూపొందించడంతో పాటు వాటి నిర్మాణంలో సీజీఎంగా పనులు పర్యవేక్షించారు. యాదాద్రిలో సీవరేజి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో పాలుపంచుకున్నారు. సర్క్యులర్ ఎకానమీలో.. ఎస్టీపీల్లో వెలువడిన వ్యర్థాలను సేంద్రియ ఎరువుల్లో ఉపయోగించి ఆదాయం పొందవచ్చని నిరూపించారు.

బోర్డుకు తీరని లోటు: దానకిశోర్

ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో సోమవారం ఎం.ఎల్.ప్రసన్న కుమార్ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎండీ దానకిశోర్, ఇతర డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, ఇతర ఉద్యోగులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ. నగరంలో ఎస్టీపీలు 93 శాతం సమర్థంగా పనిచేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారన్నారు. సాంకేతిక పరంగా ఆయన బోర్డుకు ఎంతో సాయం చేశారన్నారు. అత్యవసర సేవల్లో పనిచేసే వారికి ఒత్తిడి సహజంగానే ఉంటుందని, కానీ అటు ఉద్యోగంతో పాటు ఇటు కుటుంబాన్ని రెండింటినీ సమన్వయం చేసుకుకోవాలని సూచించారు. బోర్డులో ఆయన లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

జలమండలికి మరో ఉత్తమ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వాటర్ కన్జర్వేషన్, ఉత్తమ ఎస్టీపీ లాంటి వాటిని గెలుచుకోగా.. తాజాగా మరొక అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న చర్యలు, మంచి పారిశ్రామిక సంబంధాలకు గానూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ యాజమాన్య పురస్కారాన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించింది. ఈ అవార్డును జలమండలి ఎండీ దానకిశోర్ రవీంద్రభారతిలో రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి చేతులమీదుగా సోమవారం అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జలమండలి సేవలను కొనియాడారు. ప్రభుత్వ విభాగాల్లో జలమండలికి మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

చైతన్యపురి: వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్లు నకిలీ తయారుచేసి విక్రయిస్తున్న ముఠాను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని తణుకుకు చెందిన తాడిశెట్టి రేణుకేష్, నగరానికి చెందిన రాహుల్ దీక్షిత్, రావిపల్లి రామభద్రారావు, అన్నం దినేష్, గొల్లపల్లి శ్రవణ్‌లు ముఠాగా ఏర్పడి నకిలీ విద్యార్హత సర్టిఫికెట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం నకిలీ సర్టిఫికెట్లు అందించేందుకు వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటీ, సరూర్‌నగర్ పోలీసులు డాక్టర్స్ కాలనీలో వేచి ఉన్నారు. ఎర్టిగా కారులో వచ్చిన రోహిత్‌వర్మ, తాడిశెట్టి రేణుకేష్, గొల్లపల్లి శ్రవణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు వివిధ యూనివర్సిటీలకు చెందిన 80 నకిలీ సర్టిఫికెట్లు అవసరమైన వారికి సరఫరా చేసి రూ.లక్షలు దండుకున్నట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి 39 ఫేక్ సర్టిఫికెట్లు, 486 హోలోగ్రాం స్టిక్కర్లు, రబ్బర్ స్టాంప్, 8 మొబైల్ ఫోన్లు, ఒక ఎర్టిగా కారు ఇతర సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. రాహుల్ దీక్షిత్, రావిపల్లి రాంభద్రరావు, అన్నం దినేష్‌లు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు.

క్లుప్తంగా

భార్య పుట్టింటికి వెళ్లిందని స్తంభం ఎక్కిన యువకుడు



సైదాబాద్: భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు స్తంభం ఎక్కి హల్‌చల్ చేసాడు. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ సుబ్బిరామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..సింగరేణి కాలనీలో నివసించే మోహన్ బాబు భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి పోయింది. దాంతో అతను సోమవారం మధ్యాహ్నం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని సముదాయించి కిందకు దించారు. అనంతరం అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. గతంలోనూ మోహన్ బాబు పలు సందర్భాలలో ఇలానే ప్రవర్తించాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

5, 6 తేదీల్లో ఇంజినీరింగ్ సింపోజియాలు


ప్రొ.శ్రీరామ్ వెంకటేష్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 5, 6 తేదీలలో వివిధ విభాగాలలో జాతీయ సింపోజియాలు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సింపోజియాలలో సదస్సులు, పేపర్ ప్రజెంటేషన్స్, ఎగ్జిబిషన్స్, రోబోటిక్‌తో పాటు వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సింపోజియాలకు దేశ వ్యాప్తంగా ఐఐటీలు, ఇంజినీరింగ్ కాలేజీలకు చెందిన విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్‌లో నిర్మాణ్–2023, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఇన్నినిటీ–2023, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో టెక్నోనెన్స్–2023, మెకానికల్ ఇంజినీరింగ్‌లో మెకరినా–2023, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆకృతి–2023, బయోమెడికల్ ఇంజినీరింగ్‌లో మెడిటెక్–2023, మైనింగ్ ఇంజినీరింగ్‌లో ఇగ్నైట్–2023 పేరుతో ఆయా విభాగాలలో వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. ఇంజినీరింగ్, పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు ఇతరులకు ఈ ఎగ్జిబిషన్లకు ఉచిత ప్రవేశం ఉందన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి


మృతి చెందిన శ్రీనివాస్‌రెడ్డి

కుషాయిగూడ: తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ..యాద్రాది భువనగిరి జిల్లా, రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి (57) కొన్నాళ్లుగా ఏఎస్‌రావునగర్‌లోని హుడా పార్కులో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శ్రీనివాస్‌రెడ్డికి భార్యాబిడ్డలెవరూ లేకపోవడంతో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అతనిపై ఒక్కసారిగా తేనెటీగల గుంపు దాడి చేయడంతో ఉక్కిరి బిక్కిరై మృతి చెందాడు. పోలీసులు గాంధీ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య


గుంటి మహేష్ (ఫైల్)

కుషాయిగూడ: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం..కుషాయిగూడ నాగార్జుననగర్‌కు చెందిన గుంటి మల్లయ్య కుమారుడు మహేష్ (31) ఈసీఐఎల్‌లోని టీఎస్ఐఐసీ కార్యాలయంలో అకౌంటెంట్ ఆడిటర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి చెల్లెలు ఇంటికి వెళ్లి ..అక్కడి నుంచి తన బంధువు గిరీష్‌తో కలిసి తన కార్యాలయానికి వచ్చి అక్కడే నిద్ర పోయాడు. ఉదయం కార్యాలయానికి వచ్చిన పనిమనిషి, బంధువు గిరీష్ లేచి చూసేసరికి మహేష్ ఓ గదిలో ఫ్యానుకు ఉరివేసుకుని వేలాడుతూ కన్పించాడు. కొంత కాలంగా ఓ యువతిని ప్రేమించాడని, చివరకు ప్రేమ విఫలమై మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుని తల్లి మధునమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

చైతన్యపురి: రోడ్డు దాటుతున్న ఓయువకుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అంబర్‌పేట పటేల్‌నగర్‌కు చెందిన మెహద్ జయత్ (18) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ చికెన్ షాపులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లోని దుకాణం నుంచి మెట్రో స్టేషన్ వైపు రోడ్డు దాటుతుండగా ఎల్బీనగర్ నుంచి ముసారాంబాగ్ వైపు వెల్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ జయత్‌ను ఆసుపత్రిలో చికిత్సకోసం చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

బోరబండలో జలమండలి డీజీఎం పర్యటన



బంజారనగర్‌లో పర్యటిస్తున్న డీజీఎం వాహబ్

రహమత్‌నగర్(బోరబండ): బోరబండ డివిజన్‌లో జలమండలి డీజీఎం వాహబ్ సోమవారం పర్యటించి కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీల్లో కలుషిత తాగునీరు సరఫరా అయితే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, కో ఆర్డినేటర్ విజయసింహా, బంజారనగర్ ప్రెసిడెంట్ యాదయ్య, సాయి చరణ్, ముజ్జు, సలీం పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కరించండి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాగరాజు

రహమత్‌నగర్: సుభాష్ చంద్రబోసనగర్‌లో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గ్యారనాగరాజు సోమవారం జలమండలి జీఎం హరి శంకర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో వరద నీరు మెయిల్ వాల్ లోని పోయి తమ నివాసాల్లోకి మురుగు వస్తుందని వాపోయారు. తమ బస్తీలో పాత పైప్‌లైన్‌ను తొలగించి కొత్త 8ఎంఎం పైప్‌లైన్ వేయాలని కోరామన్నారు. జీఎం సానుకూలంగా స్పందించారని నాగరాజు పేర్కొన్నారు.

సన్మానం



తోట శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చంద్రశేఖర్

పంజగుట్ట: మంచిర్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన తోట శ్రీనివాస్ సోమవారం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీఆర్ఎస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చంద్రశేఖ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్‌ను చంద్రశేఖర్ సత్కరించారు. తోట శ్రీనివాస్ ఎంతో మంది పేదలను ఆదుకున్నారని, సేవా కార్యక్రమాలు చేయడంలో ఎప్పుడూ ముందంజలో ఉంటారని చంద్రశేఖర్ అన్నారు.

ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

లక్డీకాపూల్: నిమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కాంట్రాక్ట్ టెక్నికల్-నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిమ్స్ మెయిన్ గేటు వద్ద ఘనంగా మే డే వేడుకలను జరుపుకోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం విషయంలో యూనియన్ గట్టి పోరాటం చేసిందన్నారు. ఈ పరిణామ క్రమంలో కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ సమక్షంలో ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలన్నారు. వేతనాలు పెంపుదలలో 30 శాతం మేరకు పెంచేందుకు ఎగ్జిక్యూటివ్ బోర్డు తీర్మానాన్ని అమలు చేయాలన్నారు. అదే విధంగా టెక్నికల్ ఉద్యోగులను డి క్యాటగిరిలో పరిగణించాలన్నారు. గాంధీ ఆస్పత్రి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పిస్తున్న విధంగా క్యాజువల్ లీవులను మంజూర్ చేయాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ సింగ్, నాయకులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

హోటల్ తాజ్ దక్కన్ వేదికగా ఏర్పాటు చేసిన రెండు రోజుల ఆకృతి ఎలైట్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ శశినాథ. ఈ ప్రదర్శన నేడు కూడా కొనసాగనుంది. - సాక్షి, సిటీబ్యూరో



కుండపోతతో కకావికలం



వరద తాకిడికి కొట్టుకుపోయిన నిర్మాణంలో ఉన్న ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీ రోడ్డు

కొట్టుకుపోయిన వినాయకనగర్ రోడ్డు

- జూబ్లీహిల్స్‌లో రోజంతా చీకటే
- నీట మునిగిన కాలనీలు, బస్తీలు

బంజారాహిల్స్: ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తం మారింది. ఆదివారం రాత్రి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల చెట్లు విరిగిపడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. జూబ్లీహిల్స్ రోడ్ నెం.1లో కరెంటు వైర్లు తెగి మీదపడటంతో వీరాస్వామి అనే గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతి చెందాడు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, శ్రీకృష్ణానగర్, ఇందిరానగర్, కమలాపురి కాలనీ, సోమాజిగూడ, అమీర్‌పేట, పంజగుట్ట, మక్తా, ఖైరతాబాద్, లక్డీకాపూల్ ప్రాంతాలన్నీ వరదనీటితో విలవిల్లాడాయి.

అంధకారంలో జూబ్లీహిల్స్..

జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లో ఫినిక్స్ ఎదురుగా ఆదివారం రాత్రి ఈదురుగాలులకు ఓ కరెంటు స్తంభం నెలకొరిగింది. ఓ చెట్టుమీదపడటంతో కరెంటు వైర్లు తెగి రోడ్డు మీద పడ్డాయి. సోమవారం ఉదయం 12 గంటల వరకు కూడా తెగిపడ్డ కరెంటు వైర్లకు మరమ్మతులు చేపట్టలేదు. మధ్యాహ్నం మరమ్మతులు మొదలు కాగా ఆదివారం రాత్రి 10 గంటల సోమవారం సాయంత్రం 7:30 గంటల వరకు జూబ్లీహిల్స్‌కాలనీతో పాటు ప్రశాసన్‌నగర్, జర్నలిస్టు కాలనీ, నవ నిర్మాణ్ నగర్, తదితర ప్రాంతాలన్నీ చీకట్లోనే చిక్కుకున్నాయి. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం అంతా కరెంటు లేకపోవడంతో ఆన్‌లైన్ పనులన్నీ నిలిచిపోయాయి.

విరిగిపడ్డ చెట్లు..

వర్షంధాటికి పలుచోట్ల చెట్లు నేలకూలాయి. చాలా చోట్ల కొమ్మలు విరిగిపడి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని ఐఏఎస్, ఐపీఎస్ క్వార్టర్స్ ముందు భారీ చెట్టు పార్కింగ్ చేసిన కారు మీద పడటంతో కారు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ దారిలో రాకపోకలు స్తంభించాయి.

కొట్టుకుపోయిన రోడ్డు..

వారం రోజులుగా ఫిలింనగర్‌లోని వినాయకనగర్ బస్తీలో వరద నీటి కాల్వను నిర్మించిన అధికారులు ఎర్రమట్టితో చదునుచేసి సీసీ రోడ్డు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. రాత్రి కురిసిన వర్షానికి వరద ప్రవాహంతో ఈ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. బస్తీలోకి రాకపోకలు నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ వైర్లకు మరమ్మతులు

బంజారాహిల్స్: గాలి దుమారానికి చెట్లు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడటంతో జూబ్లీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 20 గంటల పాటు కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రత్యేక బృందాలు సోమవారం ఉదయం నుంచే రంగంలోకి దిగి తెగిపడ్డ కరెంటు వైర్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు కాలిపోయిన ఫ్యూజ్ బాక్స్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు చేపట్టారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం: 45, 36, 21, పెద్దమ్మ గుడి, కాకతీయహిల్స్, కావూరి హిల్స్ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెట్లకొమ్మలు విరిగిపడటంతో వైర్లుతెగి రోడ్డు మీద పడ్డాయి. వివిధ ప్రాంతాల నుంచి లైన్ మెన్లను రప్పించి మరమ్మతులు చేపట్టినట్లు జూబ్లీహిల్స్ ఏడీఈ మల్లేశం తెలిపారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు..

వెంకటేశ్వరకాలనీ: వరద ప్రభావిత ప్రాంతాల్లో వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పర్యటించి స్థానికులతో మాట్లాడి పరిస్థితిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. బంజారాహిల్స్ రోడ్ నెం 10లని సింగాడికుంట ప్రాంతంలో పర్యటించి వరద నీళ్లు వెళ్లే మార్గాలు మూసుకపోవడంతో వాటిపై వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపజేశారు. మురుగు నీరు వెళ్లే ప్రాంతాలు బ్లాక్ కావడంతో సంబంధిత సిబ్బందితో మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించారు.

వర్షానికి కూలిన గోడలు, దెబ్బతిన్న రేకుల ఇళ్లు..

రహమత్‌నగర్: రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఆదివారం రాత్రి కురిసిన వర్షం, ఈదురు గాలులకు రేకుల ఇల్లు దెబ్బతిన్నాయి. బ్రహ్మశంకర్‌నగర్‌లో ఇంటి గోడ కూలి రజాక్ అనే వ్యక్తి ఇంటిపై పడటంతో రేకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్. రెడ్డి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోరబండ డివిజన్ వినాయకరావునగర్ ఆంజనేయులు ఇంటి రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్ వినాయకరావునగర్ బస్తీలో పర్యటించారు.



సింగాడ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి



జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 ఫినిక్స్ ముందు తెగిపడిన కరెంటు వైర్లు



బ్రహ్మశంకర్‌నగర్‌లో పగిలిన రేకులను పరిశీలిస్తున్న సీఎన్ రెడ్డి



ఎమ్మెల్యే కాలనీలో కూలిన నిర్మాణంలో ఉన్న ప్రహరీ



వెంకటగిరిలో ఓ వీధంతా పారుతున్న మురుగు నీరు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



అపోలో ఆస్పత్రి వద్ద విరిగిపడిన చెట్టు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రైం కార్నర్.



కేదారేశ్వర్‌రావు

బంజారాహిల్స్: పెంపుడు కుక్కను తీసుకొని బయటికి వచ్చిన ఓ సెక్యూరిటీ గార్డ్‌ను కారు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25లోని ఓ ఇంటి వద్ద పశ్చిమగోదావరి జిల్లా పాతపట్టీసీమకు చెందిన కాకి కేదారేశ్వర్‌రావు(35) వాచ్‌మెన్‌గా పని చేస్తూ గత నెల 28న ఉదయం యజమాని పెంపుడు కుక్కను రోడ్డుపైకి తీసుకొచ్చి నడుచుకుంటూ వెళ్తుండగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25లో నివసించే సినీ నిర్మాత ఉదయ్ కుమార్ కోలా కారు డ్రైవర్ హరీశ్ ఢీకొట్టాడు. దీంతో కేదారేశ్వర్‌కు తీవ్ర గాయాలవడంతో ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బాధితుడు సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఘటనకు కారకుడైన డ్రైవర్ హరీశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదానికి కారకుడైన డ్రైవర్ తప్పించుకొని అతివేగంగా కారులో వెళ్లిపోయాడు. అయితే పోలీసులు ఈ రోడ్డులో ఉన్న సుమారు 50 సీసీ కెమెరాలను జల్లెడపట్టారు. బూత్‌బంగ్లా వద్ద ఉన్న ఓ కెమెరాలో నిందితుడి కారు స్పష్టంగా కనిపించగా కారు దిగుతూ హరీశ్ కనిపించాడు. దీంతో పోలీసులు నిందితుడిని సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తించి పట్టుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న మురళీధర్ గుప్తా

పంజగుట్ట: అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గుప్తా డిమాండ్ చేశారు. సోమవారం పంజగుట్ట ద్వారకాపూరి కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయి రైతులు బాధపడుతుంటే బీఆర్ఎస్ నాయకులు వేడుకల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. మామిడి, పత్తి, వరి రైతులు ఎంతో నష్టపోయారని ముఖ్యంగా కౌలు రైతులు మరింత ఇబ్బందులకు గురతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సీఎం కేసీఆర్ నష్టపోయిన ప్రతీ రైతుకు ఎకరానికి రూ.10 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ సుదర్శన్, బండారి శ్రీనివాస్, అంజి, ప్రభు, శివవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని జూబ్లీహిల్స్ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. - బంజారాహిల్స్



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి టీటీడీ ఎమ్మెల్సీ సభ్యుడు మోహన్‌కుమార్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 63 కిలోల కేక్ కట్ చేశారు. - బంజారాహిల్స్

మే నెలంతా పొగాకు వ్యతిరేక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర రావు

పంజగుట్ట: పొగాకు ఉత్పత్తులు వాడే వారిలో 50 శాతం మంది కేన్సర్‌తో చనిపోతున్నారని డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాగేశ్వర రావు అన్నారు. ఈ నెల 31వ తేదీన ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మే 1 నుంచి 31 వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పొగాకుకు వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు, రావూస్ డెంటల్ ఆసుపత్రిలో ఉచిత కన్సల్టెన్సీ, మందులు, పొగాకుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్, అవసరమైన వారికి ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 13 సంవత్సరాలుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే నెల మొత్తం పొగాకు వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఎస్.బాలు మాట్లాడుతూ .. గుండె నొప్పి, కేన్సర్, బ్రెయిన్ డెడ్ కావడానికి ప్రధాన కారణం పొగాకే అన్నారు. ఉస్మానియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శారద మాట్లాడుతూ .. మహిళలు పొగాకు వాడితే గర్భస్రావం కావడం, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, పుట్టిన పిల్లలకు గుండెజబ్బులు లాంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎస్.వీ.ఎస్ మెడికల్ కాలేజీ వైద్యులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ .. పొగాకుకు బానిసలైన వారికి కౌన్సిలింగ్ ద్వారా కొద్దిమేర మార్పు తీసుకురావచ్చునని, పూర్తిగా మానిపించేందుకు మందులు కూడా ఉన్నాయన్నారు.

'ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడం హర్షణీయం'

లిబర్టీ: వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ సీఎం కేసీఆర్ తొలి సంతకం చేయడాన్ని స్వాగతిస్తున్నామని మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు ఎం.మార్టిన్ తెలిపారు. డాక్టర్ బీఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నూతన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ తొలి సంతకం చేసి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపారని తెలిపారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా కీలకమైన 44 ప్రభుత్వ శాఖల్లో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌కు చెందిన 5545 ఉద్యోగులను సర్వీస్ క్రమబద్ధీకరిస్తూ తొలి సంతకం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం



ఖైరతాబాద్‌లో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి,



రూ.50 వేల చెక్కు అందజేస్తున్న తెలంగాణ ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



ఫిలింనగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న కార్మిక నాయకులు



ఎస్పీఆర్‌హిల్స్‌లో..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు వి. కరుణాకర్‌రెడ్డి పాల్గొని మేడే జెండాను ఎగురవేశారు. తెలంగాణ సినీ అండ్ టీవీ మేకప్, హెయిర్ స్టైల్ యూనియన్‌కు చెందిన ఎస్. నాగరాజు అనే కార్మికులు అకాల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి ఆ యూనియన్ తరపున రూ.50 వేల చెక్కును అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు రఘు, కేశవ్, రామచంద్రుడు, జమాల్‌తో పాటు ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ మూర్తి, కోశాధికారి ఠాగూర్ పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో..

ఫిలింనగర్: తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం మేడే వేడుకలు ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జెండాను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అపోలో ఆస్పత్రి వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం యూనియన్ సభ్యులంతా ర్యాలీ నిర్వహించారు.

రహమత్‌నగర్‌లో..

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్‌లో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు స్వామి ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. భాగ్యరాజ్, నరసింహ, బాలయ్య, దేవదాసు, జైపాల్, మహిళ నాయకురాల్లు బోరబండలో ప్రజాసంఘాల నాయకులు శేషగిరిరావు పలు బస్తీల్లో జెండాలను ఆవిష్కరించారు.

ఖైరతాబాద్‌లో..

ఖైరతాబాద్: మే డే సందర్భంగా సోమవారం ఖైరతాబాద్ డివిజన్‌లోని ఎంఎస్‌మక్తాలో కార్మిక నాయకులు ఏర్పాటుచేసిన వేడుకల్లో కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

తుని రైలు దహనం కేసు కొట్టివేత

ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందికి ఊరట

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): తుని రైల్వే స్టేషన్ సమీపంలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు దహనం కేసులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంతో పాటు 41 మందిని నిరపరాధులుగా పేర్కొంటు ఆర్‌పీఎఫ్ పోలీసులు వారిపై పెట్టిన కేసును కొట్టివేస్తున్నట్లు విజయవాడ రైల్వే న్యాయమూర్తి తీర్పువెలువరించారు. 2016 జనవరి 31న ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో తునిలో తలపెట్టిన కాపు గర్జన బహిరంగ సభ హింసాత్మకంగా మారింది. ఆ సమయంలో అటుగా వస్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును కొంత మంది నిలిపివేసి దహనం చేశారు. ఈ ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసులు నమోదు చేసి ముద్రగడ పద్మనాభం, ఎమ్మెల్యే దాడిశెట్టి రాజాతో పాటు మొత్తం 41 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు 24 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ముద్దాయిలు నేరం చేసినట్లు ఎక్కడ ఆధారాలతో నిరూపించలేకపోవడంతో వారిని నిరపరాధులుగా భావించి కేసును డిస్మిస్ చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ముగ్గురు తుని ఆర్‌పీఎఫ్ అధికారులు సరైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని తీర్పులో వెల్లడించారు.

థాయ్‌లాండ్‌లో చిక్కిన చీకోటి

▶ మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై అక్కడి పోలీసులు సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో (అక్కడి కాలమాన ప్రకారం) దాడి చేశారు. మొత్తం 94 మందిని అదుపులోకి తీసుకోగా వారిలో చీకోటి ప్రవీణ్, మాధవరెడ్డితోపాటు మరో 83 మందిని భారతీయులుగా గుర్తించారు. వారిలో అత్యధికులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారేనని, 14 మంది మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కెసినో నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ప్రవీణ్, మాధవరెడ్డి, సిత్రానన్ సహా ఆరుగురిని మాత్రమే అరెస్టు చేశారని, పేకాట రాయుళ్లకు కౌన్సెలింగ్ చేసి, జరిమానా వేసి పంపినట్లు థాయ్ మీడియా ప్రకటించింది.

ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షలు వసూలు చేసి...

థాయ్‌లాండ్‌లో కెసినోల నిర్వహణకు అనుమతి ఉన్నప్పటికీ ఒకేసారి పెద్ద మొత్తంలో ఆర్జించాలని భావించిన చీకోటి, మాధవరెడ్డి... థాయ్ మహిళ సిత్రానన్‌తో కలసి అక్రమంగా కెసినో నిర్వహణకు పథకం వేశారు. అనేక మంది పేకాటరాయుళ్లతో (పంటర్లు) ఒప్పందాలు కుదుర్చుకొని వారి నుంచి హైదరాబాద్‌లో ప్రాథమిక మొత్తంగా రూ. 4 లక్షల చొప్పున వసూలు చేశారు. గత నెల 26న హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో తీసుకువెళ్లిన



స్వాధీనం చేసుకున్న నగదు



పోలీసుల అదుపులో భారతీయులు

వారికోసం పటాయాలోని ఆసియా హోటల్‌లో గత నెల 27 నుంచి సోమవారం వరకు గదులు బుక్ చేశారు. అదే హోటల్‌లో శాంపోయ్ పేరుతో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. అందులోనే అక్రమంగా కెసినో కేంద్రం ఏర్పాటు చేశాడు. దీని నిర్వహణకు సిత్రానన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న ప్రవీణ్... ఒక్కో పంటర్‌కు రూ. 50 వేలు చెల్లించాడు. హైదరాబాద్ నుంచే తీసుకువెళ్లిన గేమింగ్ చిప్స్ అందించి పేకాట ఆడిస్తున్నాడు. ఈ క్యాంప్ ముగిశాక హైదరాబాద్ వచ్చాకే నగదు లావాదేవీలు చేసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇలా చేస్తే ఫెమా వంటి సెక్షన్ల కింద నమోదయ్యే ఈడీ కేసుల నుంచి తప్పించుకోవచ్చని ప్రవీణ్ పథకం వేశాడు. ఐదు రోజులపాటు జరిగిన ఈ పేకాట శిబిరంలో రూ. కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిసింది. సోమవారం దాడి చేసిన పోలీసులు రూ. 16 లక్షల విలువైన భారత కరెన్సీ, రూ. 20 కోట్ల విలువైన గేమింగ్ చిప్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పట్టుబడిన పంటర్లలో మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నట్లు తెలిసింది. థాయ్‌లాండ్‌లో ప్రవీణ్ అండ్ గ్యాంగ్ అరెస్టు విషయం తెలిసిన హైదరాబాద్ పోలీసులతోపాటు నిఘా వర్గాలు, ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

ఏపీలో ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- ఒక డీఏ మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 2022 జనవరి 1 నుంచి ఇవ్వాల్సిన డీఏ 2.73 శాతం మంజూరు

సాక్షి, అమరావతి: ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన మాట మేరకు ఉద్యోగులు, పెన్షనర్లకు ఒక డీఏను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 2022 జనవరి నుంచి ఇవ్వాల్సిన డీఏను 2.73 శాతం మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులకు డీఏను మంజూరు చేస్తూ జీవో 66ను, పెన్షనర్లకు డీఏను మంజూరు చేస్తూ జీవో–67ను రావత్ జారీ చేశారు. పెంచిన డీఏ 2.73 శాతాన్ని ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి అమలు చేస్తూ.. ఆగస్టు 1వ తేదీ వేతనాలతో కలిపి నగదు రూపంలో చెల్లించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జనవరి 2022 నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలను ఈ ఏడాది సెప్టెంబర్, డిసెంబర్, వచ్చే ఏడాది మార్చిలో మూడు సమాన వాయిదాల్లో ఉద్యోగుల జీపీఎఫ్‌లో జమ చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పుడు మంజూరు చేసిన డీఏతో కలిపి ఉద్యోగుల, పెన్షనర్ల మొత్తం డీఏ 22.75 శాతానికి చేరింది. ఈ సమయంలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెంచిన డీఏ బకాయిలను పదవీ విరమణ బెనిఫిట్స్‌లో కలిపి చెల్లించనున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. చెప్పిన మాట మేరకు ఉద్యోగులకు ఒక డీఏ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇప్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె.వెంకటరామిరెడ్డి సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

జూడాల సమ్మె నేపథ్యంలో సెలవులు రద్దు

మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రుల అధికారులకు డీఎంఈ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ డాక్టర్లు (జూడా) బుధవారం నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ బోధనాసుపత్రుల్లో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వైద్యవిద్య సంచాలకుడు (డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు సర్క్యులర్ జారీ చేశారు. తమ స్టైపెండ్‌ను 15 శాతం పెంచాలని, న్యాయమైన ఇతర సమస్యలు పరిష్కరించాలని జూడాలు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంఈ పలు చర్యలకు నడుం బిగించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అధ్యాపకులకు అన్ని సెలవులు రద్దు చేసినట్లు డీఎంఈ పేర్కొన్నారు. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా అధ్యాపకుల డ్యూటీ రోస్టర్‌ను మూడు షిఫ్టుల్లో సిద్ధం చేయాలన్నారు. ఏ విభాగంలోనైనా అసిస్టెంట్ ప్రొఫెసర్లు తక్కువగా ఉంటే, అసోసియేట్ ప్రొఫెసర్‌ను కూడా విధుల్లో ఉంచాలన్నారు. సంబంధిత ప్రొఫెసర్లు, విభాగాధిపతులు తమ యూనిట్లను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. రోగుల వైద్య సేవలపై సమ్మె ప్రభావం పడకుండా చూడాలన్నారు.

ఢిల్లీలో వ్యాపారం.. హైదరాబాద్‌లో ఆస్తులు

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, శరత్‌చంద్రా రెడ్డి, కవిత సన్నిహితుడు వి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్, ఫీనిక్స్ గ్రూపు, ఎస్‌గ్రోత్ క్యాపిటల్, క్రియేటివ్ డెవలపర్స్ తదితరుల పేర్లను ప్రస్తావించింది. నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అసాధారణ అంశాలు వెలుగులోకి వచ్చాయని చెప్పింది.

చార్జిషీటులోని ముఖ్యాంశాలు

- ఆప్ నేతలకు సౌత్‌గ్రూపు రూ.100 కోట్లు హవాలా రూపంలో ముడుపులిచ్చింది. తద్వారా మద్యం విధానం తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంది.
- అరుణ్‌పిళ్లైకి క్రియేటివ్ డెవలపర్స్ భాగస్వాములు, రవిశంకర్ చెట్టి రూ.5 కోట్లకు హైదరాబాద్‌లో భూమి అమ్మారన్న ఆరోపణలున్నా వారెవరూ అరుణ్‌పిళ్లైను కలవలేదు. ఈ ఒప్పందాన్ని ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ గ్రూప్‌నకు చెందిన శ్రీహరి చర్చలు జరిపి ఖరారు చేశారు. భూమి కొనుగోలు నిమిత్తం సంస్థకు ఒకరు డబ్బులు బదిలీ చేస్తారని చెప్పిన శ్రీహరి.. ఎవరు డబ్బులు బదిలీ చేశారనేది రవిశంకర్ చెట్టికి చెప్పలేదు. అయితే, ఎస్‌గ్రోత్ కాపిటల్ పేరుతో ఫీనిక్స్ గ్రూపునకు చెందిన శ్రీహరి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు బుచ్చిబాబు తన వాంగ్మూలంలో చెప్పారు. ఆ సమయంలో ఫీనిక్స్ గ్రూపునకు సీఈవోగా శ్రీహరి ఉన్నారు. దీంట్లో కవిత భర్త అనిల్‌కుమార్ కూడా భాగస్వామి. కవిత తెలంగాణలో పెద్ద రాజకీయ నాయకురాలు కావడంతో మార్కెట్ రేటు కంటే తక్కువకే భూమి కొనుగోలు చేశారు. దీంతోపాటు కవిత మరో ప్రాపర్టీ కూడా కొనుగోలు చేశారు. 25వేల చదరపు అడుగుల ప్రాపర్టీకి సంబంధించిన పేపర్ వర్క్‌ను బుచ్చిబాబు, శ్రీహరి పూర్తిచేశారు. మార్కెట్ ధర చదరపు అడుగు రూ.1,760 ఉంటే రూ.1,260 మాత్రమే చెల్లించారు. కవితతో గణనీయమైన ఆర్థిక లావాదేవీలున్న వ్యక్తి రవిశంకర్‌తో భూమి కొనుగోలుకు చర్చలు జరిపినట్లు నిర్ధారణకు వచ్చాం. ఇండోస్పిరిట్స్‌లో కవిత తరఫున అరుణ్‌పిళ్లై ప్రతినిధిగా వ్యవహరించి రూ.32.86 కోట్లు అందుకున్నారు. పిళ్లై సూచన మేరకు రూ.25.5 కోట్లు నేరుగా ఇండోస్పిరిట్స్ నుంచి పిళ్లై ఖాతాకు బదిలీ అయ్యాయి.
- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మద్యం దుకాణం నిమిత్తం ఎన్‌వోసీ కోసం జీఎంఆర్ గ్రూపునకు చెందిన బీవీ నాగేశ్వరరావుతో మాగుంట రాఘవ, ఎంపీ ఎంఎస్ రెడ్డి చర్చలు జరిపారు. ఎంఎస్ రెడ్డి వాట్సాప్ సందేశాల ద్వారా ఇది వెల్లడైంది. వ్యాపారంలో భాగస్వాములై ఎన్‌వోసీ ఇవ్వాలని కోరినట్లు తేలింది. ఇండోస్పిరిట్స్‌లో అరుణ్ పిళ్లై ప్రాక్సీ భాగస్వామి. ఇండోస్పిరిట్స్ నుంచి లాభాలు తన నుంచి కవితకు చేరడంపై అరుణ్‌పిళ్లై స్టేట్‌మెంట్ల ద్వారా వెల్లడైంది.
- ఏప్రిల్ 2022లో ఢిల్లీ హోటల్లో విజయ్‌నాయర్‌తో కవిత, అరుణ్‌పిళ్లై సమావేశమయ్యారు. వ్యాపారం కుంటుపడుతున్న నేపథ్యంలో చెల్లించాల్సిన లంచాలు రికవరీ చేయడంపై చర్చించారు. హోటల్ రికార్డుల ద్వారా దీన్ని ధ్రువీకరించుకున్నాం. దినేశ్ ఆరోరా, అరుణ్‌పిళ్లై వాంగ్మూలాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి.
- కిక్‌బ్యాక్‌ల రూపంలో సొమ్ములు వెనక్కి మళ్లించే పనులను అభిషేక్ బోయినపల్లి, అరుణ్‌పిళ్లై నిర్వహించినట్లు ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలమిచ్చారు. సౌత్‌గ్రూప్ నుంచి కిక్‌బ్యాక్‌లను విజయనాయర్ అందుకుంటున్నారన్నారు. విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని బుచ్చిబాబు ఫోను నంబర్ల ద్వారా చేసిన వాట్సాప్ సందేశాల ద్వారా ధ్రువీకరణ అయింది. దీంట్లో 'వీ'కి డబ్బు కావాలి అంటే విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని అర్థమని బుచ్చిబాబు తెలిపారు.
- ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్లలో జరిగిన సమావేశాల్లో సౌత్‌గ్రూపు నుంచి విజయ్‌నాయర్‌కు డబ్బులు పంపడంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు కూడా బుచ్చిబాబు తెలిపారు. క్రియేటివ్ డెవలపర్స్ ఖాతాకు డబ్బు మళ్లించడం కూడా బుచ్చిబాబు నోట్స్ ద్వారా తెలిసింది. కవిత తరఫున ఇండోస్పిరిట్స్ నుంచి వచ్చిన లాభాలను అరుణ్‌పిళ్లై అందుకొని ఆమె ఆదేశాల మేరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉందని ధ్రువీకరణ అయింది. భూముల కొనుగోలులో శ్రీహరి సూచనల మేరకు కవిత తరఫున సొమ్ములు బదిలీ చేయడం వరకే పిళ్లై పాత్ర పరిమితమని తేలింది. అయితే, మే 2022 నుంచి రిజిస్టర్ కాకుండా ఉన్న భూమి 11.10.22న అరుణ్‌పిళ్లై భార్య పేరు మీద రిజిస్టర్ కావడం అరుణ్‌పిళ్లై ప్రయోజనం కోసమేనని, కవితకు లాభదాయకం కాదని దర్యాప్తులో తేలింది. అరుణ్‌పిళ్లై ఆదేశాల మేరకే ఇండోస్పిరిట్స్ నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్‌లకు రూ.కోటి, రూ.70 లక్షలు బదిలీ చేసినట్లు సమీర్ మహేంద్రు తెలిపారు. దీనికి మద్దతుగా ఎలాంటి రికార్డు లేదు. అయితే, అరుణ్‌పిళ్లై చెప్పినట్లుగా ఈ సంస్థలు ఇండో స్పిరిట్స్ లేదా అరుణ్‌పిళ్లైకి ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆయా సంస్థలకు ఇచ్చిన సొమ్ము ఇప్పటివరకూ వెనక్కి ఇవ్వలేదు. గౌతమ్ ముత్తాకు అరుణ్‌పిళ్లై బదిలీ చేసిన రూ.4.76 కోట్లు, అభిషేక్‌కు రూ.3.85 కోట్లు బదిలీ రుణం తిరిగి ఇవ్వమని చెప్పినప్పటికీ కాలక్రమేణా ఎలాంటి రుణం లేదని అరుణ్‌పిళ్లై పేర్కొన్నారు.

సచివాలయానికి ఐజీబీసీ గోల్డ్ రేటింగ్



మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కౌన్సిల్ ప్రతినిధులు

సర్టిఫికెట్ ప్రదానం

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ అనుకూల పద్ధతులు, నీళ్లు, విద్యుత్ పొదుపు ఏర్పాట్లతో నిర్మించిన కొత్త సచివాలయానికి 'ది ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్'(ఐజీబీసీ) గోల్డ్ రేటింగ్ ఇచ్చింది. కౌన్సిల్ ప్రతినిధులు సోమవారం రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి సచివాలయంలో సర్టిఫికెట్‌ను అందజేశారు. నీటిపొదుపుతోపా టు, వాన నీటి సంరక్షణ, విద్యుత్ ఆదా, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం తీసుకున్న చర్యలకుగాను సచివాలయం.. ఐజీబీసీ గోల్డ్ రేటింగ్‌కు ఎంపికైంది. నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ఈఎన్‌సీ గణపతిరెడ్డి, ఈఈ శశిధర్‌లను మంత్రి అభినందించారు. అంతకుముందు మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్షించారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు ఎంతవరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే రూ.518 కోట్లతో 1393 కిలోమీటర్ల పొడవైన రోడ్ల మరమ్మతులు పూర్తి చేశామని, రూ.1223 కోట్లతో మరో 2700 కి.మీ. పనులు 45 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సమీక్షలో ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగర వార్తలు

'రాంకీ'కి అవార్డు

రాంకీకి చెందిన హెచ్ఐఎంఎస్‌డబ్ల్యూ ప్రాజెక్ట్ రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ బెస్ట్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ అవార్డును గెలుచుకుంది. సోమవారం రవీంద్రభారతిలో జరిగిన మేడే వేడుకల్లో ప్రాజెక్ట్ హెడ్ తోట కృష్ణారావు అవార్డును అందుకున్నారు.
– సాక్షి, సిటీబ్యూరో



ఎడ్‌సెట్-23 దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ: బీఈడీ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే ఎడ్‌సెట్–2023 ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 6 వరకు పొడిగించినట్లు కన్వీనర్ ప్రొ.రామకృష్ణ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు మే 1న ముగియగా విద్యార్థుల విజ్ఞప్తి మేరకు చివరి సారిగా పొడిగించినట్లు చెప్పారు. ఇంత వరకు 30 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు.

ఆత్మీయ సమ్మేళనానికి సీఎంకు ఆహ్వానం



సీఎం కేసీఆర్‌ను కలసిన దశరథ్

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ)ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమ్మేళనానికి సీఎం కేసీఆర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించనున్నట్లు బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ సోమవారం పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం పాఠశాల స్థాయి నుంచి మెడికల్, ఇంజినీరింగ్, ఇతర టెక్నికల్ కోర్సుల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యల పై ఆత్మీయ సమ్మేళనంలో చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అవతరణ అనంతరం తొలిసారిగా పెద్ద ఎత్తున చేపట్టిన కార్యక్రమానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అధ్యక్షత వహించనున్నట్లు దశరథ్ చెప్పారు.

'టాస్' ఫెలోలు, అసోసియేట్ ఫెలోలుగా హెచ్‌సీయూ ఫ్యాకల్టీ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు ఫ్యాకల్టీ ప్రతినిధులు తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టాస్) ఫెలోలు, అసోసియేట్ ఫెలోలుగా నియమితులయ్యారు. స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ మురళీధరన్, సీఏఎస్ఈఎస్‌టీ స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబత్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయోటెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఇన్సాఫ్ అహ్మద్ ఖురేషి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోకెమిస్ట్రీ విభాగం ఫ్యాకల్టీ డాక్టర్ అనీల్ పసుపులేటి, అసోసియేట్ ఫెలోగా స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ఫ్యాకల్టీ డాక్టర్ శ్రీనివాసరావు యరగొర్ల ఎంపికయ్యారు. టీఏఎస్ తన కార్యకలాపాలను ఏప్రిల్ 2015లో డాక్టర్ సీహెచ్ మోహన్‌రావు అధ్యక్షతన ప్రారంభించింది. అకాడమీ లక్ష్యాలు ప్రధానంగా సైన్స్ అండ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడం, శాస్త్రవేత్తల అభివృద్ధిని చర్చించడం, ప్రజలలో శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రచారం చేయడం, సైన్స్‌పై పుస్తకాలు, పత్రికల ప్రచురణ కోసం ఒక వేదికను అందించడం లక్ష్యంగా పని చేస్తుంది. ఒకేసారి ఐదుగురు ఫ్యాకల్టీలకు అవకాశం రావడం పట్ల తోటి ప్రొఫెసర్లు, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎంపికైన ప్రొఫెసర్లు

ఈ నెల 10న ఐటీఐలో స్క్రాప్ వేలం

సనత్‌నగర్: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో వినియోగంలో లేని (స్క్రాప్) యంత్రాలు, పనిముట్లు, ఇతర వస్తువుల వేలం వేయనున్నట్లు ఆ సంస్థ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో భాగంగా మూడు దశాబ్దాల క్రితం నాటి టూల్స్ అండ్ ఎక్విప్‌మెంట్స్ కాల పరిమితి ముగియడంతో తుక్కుగా మారాయి. దీంతో వాటిని ఈ నెల 10న ఉదయం 11.30 గంటలకు వేలం వేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు ఈ నెల 2 నుంచి 6 వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని 8వ తేదీ లోపు రూ.15 వేల డీడీ జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఐఎంసీ ఆఫ్ ఐటీఐ, సనత్‌నగర్, హైదరాబాద్ పేరిట డీడీలు చెల్లించాలని వివరించారు. మరిన్ని వివరాలకు 89191 90943 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సమస్యలకు నిలయంగా హైదరాబాద్



మాట్లాడుతున్న శంకర్‌యాదవ్

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నాలాలు నగర ప్రజలకు మృత్యువు గండాలుగా మారాయని జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ బి.శంకర్ యాదవ్ అన్నారు. సోమవారం అబిడ్స్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పలువురు కార్పొరేటర్లతో కలిసి మాట్లాడారు. విశ్వనగరమైన హైదరాబాద్ సమస్యలకు నిలయంగా మారిందని ఎండలు వస్తే అగ్నిప్రమాదాలు, వర్షం వస్తే నాలా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాలా పనుల అభివృద్ధికి ఎస్ఎన్‌డీసీ పథకం కింద రూ.900 కోట్లను కేటాయించారు కానీ.. పనులు మాత్రం ఎక్కడా జరగలేదని అయితే మంజూరు చేసిన నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఏ విభాగంలో చూసినా కానీ సరైన సిబ్బంది లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల నాలాలో పడి ఓ చిన్నారి మృతి చెందితే ఇది చిన్న విషయమని బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం ఎంతో బాధాకరమన్నారు. నాలా పనుల అభివృద్ధిపై మున్సిపల్ శాఖ మంత్రి తక్షణమే సమీక్షా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, ఆకుల శ్రీవాణి, వంగ మధుసూధన్ రెడ్డి, సురేఖ ఓంప్రకాష్ పాల్గొన్నారు.


'బస్సుయాత్ర'కు పొంగులేటి మద్దతు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా బస్సు యాత్రకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. సోమవారం ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవితో కలిసి బస్సు యాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. రేపు (3న) ఉదయం 9 గంటలకు ఆర్ట్స్ కాలేజీ నుంచి బస్సుయాత్ర ప్రారంభం అవుతుందని విద్యార్థి జేఏసీ కన్వీనర్ మిడతపల్లి విజయ్ తెలిపారు.


ఓయూ విశ్రాంత ప్రొ.ఓంకార్ మృతి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జాగ్రఫీ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.ఓంకార్ (64) నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించారు. తార్నాకలో నివాసముంటున్న ఆయన పీడీఎస్‌యూ(విజృంభణ) విద్యార్థి నాయకుడు, అధ్యాపకుడిగా అనేక మందికి సుపరిచితుడు. ఓయూలో 20 ఏళ్ల కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేసి 2007లో పర్మినెంట్ ఉద్యోగం పొందిన 8 ఏళ్లకు పింఛన్, ఇతర బెనిఫిట్స్ లేకుండా రిటైర్డ్ అయ్యారు. జగిత్యాల జిల్లాకు చెందిన ఓంకార్ వివాహం చేసుకోలేదు. ఆయన భౌతికకాయానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణతో పాటు వివిధ వర్సిటీల వీసీలు నివాళులర్పించారు. నేడు ఓంకార్ స్వస్థలం జగిత్యాల జిల్లా కేంద్రంలో అంత్యక్రియలు జరగనున్నాయి.

నవ భారత నిర్మాణంలో యువతే కీలకం

కవాడిగూడ: పురోగమిస్తున్న నవ భారత నిర్మాణంలో రామకృష్ణ మిషన్ కీలక పాత్ర పోషిస్తోందని హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద అన్నారు. యువతలో దేశభక్తి పెంపొందింపచేయడంతో పాటు వారిని సమున్నమైన పౌరులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. హైదరాబాద్ రామకృష్ణ మఠంలోని వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ వెంకటేశ్వర హాల్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమానికి మైసూరుకు చెందిన కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. త్యాగం, సేవ ద్వారా దేశ నిర్మాణానికి నడుం కట్టేలా రామకృష్ణ మిషన్ యువతను ప్రోత్సహిస్తోందని, మన దేశానికి అసలైన సంపద వారే అన్నారు. యువతను సన్మార్గంలో ప్రోత్సహిస్తే ప్రపంచంలో భారతదేశాన్ని మించిన దేశం మరొకటి ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన ఖేత్రి రామకృష్ణ మిషన్ కార్యదర్శి ఆత్మనిష్ఠా మహరాజ్, స్వామి యోగీశానంద, సంతోష్ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న స్వామి బోధమయానంద

అధిక పోషకాలుండే ఆహారం లభ్యత అవసరం

కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా

రాయదుర్గం: భారతదేశంలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాల లభ్యత అందుబాటు, స్థోమత మెరుగు పర్చడంలో పరివర్తన ఉత్పాదనలకు దారి తీస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా పేర్కొన్నారు. కేంద్ర వ్యవసాయశాఖ, ఐఎస్‌బీ భారతదేశంలో వ్యవసాయ–పోషకాహార కలయికను అభివృద్ధి చేయడం కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఐఎస్‌బీ, మినిస్ట్రీస్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ అండ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైతుల సాధికారత విభాగం, ఒడిశా ప్రభుత్వం సంయుక్తంగా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ మార్కెట్లను బలోపేతం చేయడం అంటే పోటీ, వ్యాపార నమూనాలు, లాభదాయకమైన, సమర్థమంతమైన మౌలిక సదుపాయాల ద్వారా, పారిశ్రామికవేత్తల పర్యావరణ వ్యవస్థను ప్రారంభించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలు సరసమైన, పోషక దట్టమైన ఆహారాలకు లభించడం కోసం ఆర్థికంగా లాభదాయకమైన ప్రదేశాలుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రటరీ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఐఎస్‌బీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర కార్యక్రమాలు, పథకాలను మెరుగు పర్చడం కోసం సమ్మిళితం చేసే శక్తిని ఉపయోగించుకోవచ్చన్నారు. ప్రొఫెసర్ అశ్విని ఛత్రే మాట్లాడుతూ.. ఐఎస్‌బీ తన నైపుణ్యం, దాని సహకార బలాన్ని జాతీయం , ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలు, ఇతర రంగాల నుంచి తీసుకువస్తుందన్నారు.

ఆన్‌లైన్‌కే సై

- ఈజీ మార్గాలను వినియోగించుకుంటున్న ప్రజలు
- 'ఎర్లీబర్డ్'లో ఆన్‌లైన్ ద్వారానే 67 శాతం మంది చెల్లింపులు
- లక్ష్యాన్ని రూ. 36 కోట్లు అదనంగా వసూలు
- ఖజానాకు రూ. 786 కోట్లు జమ

సాక్షి, సిటీబ్యూరో: సదుపాయాలు కల్పిస్తే ప్రజలు వినియోగించుకుంటారు. తమకు అత్యంత సదుపాయంగా ఉంటే.. ఎవరూ వెళ్లి ఒత్తిడిచేయకున్నా చెల్లింపులు చేస్తారనేందుకు నిదర్శనం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లు. ఆర్థిక సంవత్సరం మొదటినెలలో ఆస్తిపన్ను చెల్లించేవారికి ఎర్లీబర్డ్ పథకం కింద 5 శాతం రాయితీ ఉంటుంది. ఈ రాయితీని వినియోగించుకోవడం ద్వారా చాలామంది తమ ఆస్తిపన్ను చెల్లించారు. జీహెచ్ఎంసీ ఆర్థిక సంవత్సర లక్ష్యమే దాదాపు రూ. 2వేల కోట్లయితే.. 'ఎర్లీబర్డ్'ను వినియోగించుకోవడం ద్వారా ఒక్క నెలలోనే మూడో వంతుకుపైగా ఆదాయం సమకూరింది.

ఎక్కువ మంది ఆన్‌లైన్ ద్వారా

ఎర్లీబర్డ్‌ను వినియోగించుకున్న ఇళ్ల యజమానులు 7.35 లక్షల మంది కాగా, వారిలో 4.95 లక్షల మంది ఆన్‌లైన్ ద్వారానే ఆస్తిపన్ను చెల్లించారు. అంటే దాదాపు 67 శాతం మంది ఆన్‌లైన్‌ను వినియోగించుకున్నారు. వీరి చెల్లింపుల ద్వారా జీహెచ్ఎంసీ ఖజానాకు రూ.786.75 కోట్ల ఆదాయం సమకూరింది.

ఆదాయం పెరుగుతున్నా..

జీహెచ్ఎంసీ ఖజానాకు ఆస్తిపన్ను వసూళ్ల ద్వారా ఏటికేడాది ఆదాయం పెరుగుతున్నప్పటికీ, అంతకుమించి పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు తప్పడం లేదు. వేల కోట్లు ఖర్చయ్యే భారీ ప్రాజెక్టులకు సైతం జీహెచ్ఎంసీ నుంచే ఖర్చు చేస్తుండటం ఇందుకు ప్రధాన కారణం కాగా, అధికారులు, పాలకమండలి మితిమీరిన ఖర్చులు కూడా ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆనందించేలోగా.. అదనపు భారం

ఎర్లీబర్డ్ ద్వారా టార్గెట్‌ను మించి ఆదాయం రావడంతో సంతోషపడిన అధికారుల ఆనందం అంతలోనే ఆవిరైంది. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను అదనంగా రూ.1000 పెంచుతూ జీఓ జారీ చేసిన ప్రభుత్వం.. ఈమేరకు అదనపు వ్యయాన్ని జీహెచ్ఎంసీ ఖజానా నుంచే చెల్లించాలని పేర్కొనడమే ఇందుకు కారణం. దీంతో జీహెచ్ఎంసీ ఖజానాకు సంవత్సరానికి దాదాపు రూ.30 కోట్ల అదనపు భారం పడనుంది.

పశ్చిమ కనుమల జీవ వైవిధ్యంపై అధ్యయనం

లాలాపేట: భారతదేశంలోని పశ్చిమ కనుమల ప్రాంతంలోని మొక్కల పరిణామాలపై సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలోజి శాస్త్రవేత్త డాక్టర్ జాహ్నవి జోషి బృందం పరిశోధనలు చేస్తుంది. ఈ మేరకు సోమవారం సీసీఎంబి శాస్త్రవేత్తలు దీనికి సంబంధించి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలోని పశ్చిమ కనుమల్లో అనేక చెక్క మొక్కలు, పక్షులు, క్షీరదాలు, సరిసృపాలు, చేపలు, కీటకాలతో పాటు ఇతర జీవరాసులతో ప్రపంచ జీవ వైవిధ్య హాట్‌స్పాట్ అని సీసీఎంబి శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. జాతులు వాటి డీఎన్ఏ ఆధారంగా ఒకదానితో మరొకటి ఎలా సంబంధం కల్గి ఉన్నాయో అనే విషయాలపై పరిశోధిస్తున్నారు. ఈ మేరకు వారు చేసిన అధ్యయనంలో గత శీతోష్ణస్థితి, భౌగోళిక ప్రక్రియలు ప్రస్తుత వాతావరణం ద్వారా పరిణామ వైవిధ్యం పశ్చిమ కనుమల అంతటా అసమానంగా పంపిణీ చేయబడినట్లు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉత్తరాది కంటే ఆరు రెట్ల ఎక్కువ జాతులు పశ్చిమ కనుమల్లో ఉన్నాయని రచయిత అభిషేక్ గోపాల్ తెలిపారు.

డాక్టర్ శ్రీ కీర్తి పల్మనాలజిస్ట్...
మరో కీర్తికిరీటం 'మిసెస్ తెలంగాణ'.
'మిసెస్ వోగ్‌స్టార్ ఇండియా' విజేత.
మహిళ ఎలా ఉండాలో చెప్పింది.
మనిషి ఎలా జీవించాలో చెప్పింది.
'మంచిని తీసుకోవాలి... చెడును వదిలేయాలి'
ఇదీ ఆమెను విజేతగా నిలిపిన సమాధానం.
'మా ఊరికి వస్తే మా ఇంటికి రండి'
మరో ప్రశ్నకు బదులుగా ఆత్మీయ ఆహ్వానం.
బ్యూటీ కంటెస్ట్ నాడి పట్టుకుంది.
సంపూర్ణతకు ప్రతీకగా కిరీటధారి అయింది.

డాక్టర్ శ్రీ కీర్తి

ప్రొఫెషన్ | పాషన్



మిసెస్ వోగ్‌స్టార్ ఇండియా 2023 (జి-1) తెలంగాణ

బ్యూటీ స్టార్

ఏప్రిల్ 14,15,16 తేదీల్లో జైపూర్ వేదికగా వోగ్ స్టార్ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో విజేతగా నిలిచిన తెలుగమ్మాయి డాక్టర్ కీర్తి. దేశవ్యాప్తంగా పన్నెండు వందల మంది పాల్గొన్న పోటీల్లో 'మిసెస్ తెలంగాణ' కిరీటంతో హైదరాబాద్‌కి తిరిగి వచ్చింది. ఈ సందర్భంగా ఆమె తన బాల్యం నుంచి వోగ్‌స్టార్ కిరీట ధారణ వరకు తన విజయాలను, ఎదుర్కొన్న సవాళ్లను 'సాక్షి'తో పంచుకుంది.

''అమ్మ ఉద్యోగ రీత్యా నేను పుట్టింది ఒంగోల్లో, కానీ మా మూలాలు నెల్లూరులో ఉన్నాయి. అమ్మ బీఎస్ఎన్ఎల్, నాన్న సిప్లాలో ఉద్యోగం చేసేవారు. బాల్యం నుంచి నా జీవితమంతా హైదరాబాద్‌తోనే మమేకమైపోయింది. సైనిక్‌పురిలోని భారతీయ విద్యాభవన్‌లో టెన్త్ టాపర్‌ని. ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో చురుగ్గా ఉండడానికి స్కూలే కారణం. నాలుగు రకాల డాన్స్‌లు ప్రాక్టీస్ చేశాను. యాక్టింగ్‌లోనూ శిక్షణ తీసుకున్నాను. త్రో బాల్ ఆడేదాన్ని. ఖోఖో స్టేట్ లెవెల్ ప్లేయర్‌ని. ఇదంతా ఒక దశ. నాకు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే ఆకాంక్ష ఉండేది. రెండో ఆలోచన లేకుండా కాకతీయ కాలేజ్‌లో బైపీసీలో చేరిపోయాను. సీనియర్ ఇంటర్‌లో ఉండగా ఓ యాక్సిడెంట్. మల్టిపుల్ ఫ్రాక్చర్స్, తలకు కూడా గాయమైంది. సర్జరీలతో దాదాపు నాలుగు నెలలు బెడ్ మీదనే ఉన్నాను. పరామర్శకు వచ్చిన వాళ్లు సానుభూతి కురిపిస్తూ 'నడవడం కూడా కష్టమే, ఆరోగ్యం ఒకింత కుదుటపడిన తర్వాత ఏదో ఓ సంబంధం చూసి పెళ్లి చేసేయండి' అనే సలహా ఇచ్చేవాళ్లు. ఏఎస్‌రావు నగర్‌లో మా కాలనీ వాళ్లు నాకు చాలా సహాయం చేశారు. హాస్పిటల్‌లో ఎప్పుడూ ఎవరో ఒకరు తోడుగా ఉండేవారు. మా అమ్మానాన్న చిన్నప్పుడు చేయి పట్టుకుని నడిపించిన రోజులు నాకు గుర్తు లేవు, కానీ నన్ను మామూలు మనిషిని చేయడానికి మా తమ్ముడు కార్తీక్ నన్ను చేయి పట్టి నడిపించిన రోజుల్ని మాత్రం మర్చిపోలేను. అలాగే చదివి ఎమ్‌సెట్‌లో రెండు వేల ర్యాంకు తెచ్చుకుని ఎంబీబీఎస్‌లో సీటు తెచ్చుకున్నాను. టాప్ టెన్‌లో ర్యాంకు నా కల, యాక్సిడెంట్ వల్ల ఆ కల నెరవేరలేదు.

ఎంపిక ఇలా!

స్వయం శక్తితో జీవితంలో ఎదిగిన వాళ్లు, జీవితంలో పడిలేచిన వాళ్లు, సామాజికంగా సవాళ్లను ఎదుర్కొని నిలిచిన వాళ్లు... ఇలా ఉంటుంది. అలాగే అందరిలో ఒకరిగా జీవించడం కాకుండా ప్రొఫైల్‌లో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలి. నేను పర్యావరణం కోసం చేసిన పనులు, కోవిడ్ వారియర్, జగిత్యాలలో ఐదేళ్లు సామాన్యులకు వైద్యం చేయడంతో సరిపెట్టుకోకుండా హెల్త్ ఎడ్యుకేషన్ కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి నాకు ఉపకరించాయి.

- డాక్టర్ ఎం.వి. శ్రీకీర్తి, సీనియర్ కన్సల్టెంట్, ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్, టీఎక్స్ హాస్పిటల్స్, హైదరాబాద్.

■ ... డాన్స్ మానలేదు!

కుప్పంలో ఎంబీబీఎస్ చేశాను. అప్పుడు కూడా డాన్స్ ప్రాక్టీస్ మానలేదు. నేను స్టేజ్ మీదకు వెళ్లకుండా కొరియోగ్రఫీ చేసి షోలు నిర్వహించాను. ఇక పీజీలో చదువు తప్ప మరిదేనికీ టైమ్ ఉండేది కాదు. పల్మనాలజీ తర్వాత కేరళలో ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజీ చేశాను. పెళ్లి తర్వాత మళ్లీ కొత్త ఉత్సాహం వచ్చింది. మాది లవ్ మ్యారేజ్. డాక్టర్ శశిధర్ ఎంబీబీఎస్‌లో నా సీనియర్. ఆయన గాయకుడు. ఇల్లు, హాస్పిటల్‌తో జీవితాన్ని పరిమితం చేసుకోవడం నాకే కాదు ఆయనకూ నచ్చదు. డాన్స్ కాకపోతే మరేదైనా ఆసక్తిని అభివృద్ధి చేసుకోమనేవారు. అలా గత ఏడాది మిస్ హైదరాబాద్ పోటీలకు నా ఫొటోలు పంపించాను. టాలెంట్ రౌండ్‌లో ర్యాంప్ వాక్, డాన్స్ వీడియోలు పంపించాను. అందులో ఫస్ట్ రన్నర్ అప్‌ని. ఆ తర్వాత కొన్నాళ్లకు 'మిసెస్ తెలంగాణ ఆడిషన్' పిలుపు వచ్చింది. డెలివరీ తర్వాత సెలవులో ఉండడంతో ఆ పోటీల్లో పాల్గొనే వీలు దొరికింది. గత ఏడాది నవంబర్ నుంచి దశల వారీగా అనేక సెషన్‌లు జరిగాయి. అన్నీ వర్చువల్‌గానే.

■ పోటీల నుంచి నేర్చుకున్నాను!

ఈ పోటీలో ఒకరికొకరు నేరుగా కలిసింది జైపూర్‌లో కిరీటధారణ సమయంలో మాత్రమే. ప్రతి రాష్ట్రం నుంచి విజేతలకు కిరీట ధారణ జరిగింది. విజేతల్లో నాతోపాటు మరో ఇద్దరు డాక్టర్లున్నారు. మనుమళ్లు, మనుమరాళ్లున్న మహిళలు కూడా పాల్గొన్నారు. ఈ పోటీల ద్వారా అనేక స్ఫూర్తిదాయకమైన జీవితాలను దగ్గరగా చూశాను. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఒక్కో ఎదురీత ఉంది. ఈ సందర్భంగా నేను మహిళలకు చెప్పేదొక్కటే... జీవితాన్ని నిత్యనూతనంగా ఉంచుకోవాలి. పెళ్లయిందనగానే ఇక జీవితం అయిపోయిందని, తమనెవరూ పట్టించుకోవట్లేదని ఇంట్లో వాళ్లను వేలెత్తి చూపుతూ తమను తాము నైరాశ్యంలోకి నెట్టేసుకుంటూ ఉంటారు. నిర్లిప్తతను దగ్గరకు రానివ్వకూడదు, ఒకవేళ ఆందోళన, ఆవేదనలు చుట్టుముట్టినా సరే వాటి నుంచి బయటపడడానికి తమను తాము ఉత్తేజితం చేసుకోవాలి''

- ఇంటర్వ్యూ: వాకా మంజులారెడ్డి

లక్నో సాంస్కృతిక వైభవ మణిపూసలలో రంగస్థలం ఒకటి.
ఆ వెలుగు మరింత ప్రజ్వరిల్లేలా ఔత్సాహికులు నాటకరంగంలో భాగం అవుతున్నారు.
అయితే రంగస్థలం అంటే యువతరం మాత్రమేనా?
'కానే కాదు' అంటోంది 'పీపుల్స్ ఇన్షియేటివ్' అనే స్వచ్ఛందసంస్థ.
రచనల నుంచి నటన వరకు పెద్దలలోని సృజనాత్మక శక్తులను రంగస్థలంపైకి సాదరంగా తీసుకురావడానికి 'థియేటర్ ఫర్ ఎల్డర్లీస్' పేరుతో నాటకరంగ వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది...

అనుభవమే వారి బలగం



ప్రతీకాత్మక చిత్రం

థియేటర్ గ్రూప్ 'మంచ్‌కీర్తి సమితి' లక్నో (ఉత్తరప్రదేశ్)లో నిర్వహించిన '30 డేస్ 30 ప్లేస్'కు అనూహ్యమైన స్పందన లభించింది. విశేషం ఏమిటంటే ఆ జామ్ ప్యాక్‌డ్ థియేటర్‌లలో ఎక్కువమంది వృద్ధులు కనిపించారు. నాటకాలు చూస్తున్నప్పుడు వారిలో వయసు భారం మాయమైపోయింది. ప్రదర్శన పూర్తయిన తరువాత టీ తాగుతూ వారు ఆ నాటకాన్ని లోతుగా విశ్లేషించుకునే దృశ్యాలు ఎన్నో కనిపించాయి... దీన్ని దృష్టిలో పెట్టుకొని లక్నోకు చెందిన 'పీపుల్స్ ఇన్షియేటివ్' అనే స్వచ్ఛందసంస్థ 'థియేటర్ ఫర్ ఎల్డర్లీస్' అనే వినూత్న కాన్సెప్ట్‌తో సీనియర్ సిటీజన్‌లతో నలభైరోజుల పాటు థియేటర్ వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది.

'వారి కోసం వారి చేత' ట్యాగ్‌లైన్‌తో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లలో రచన, నటన, దర్శకత్వం, సంగీతం... మొదలైన అంశాలలో శిక్షణ ఉంటుంది. దీంతో పాటు తమ ఏరియాలో తమ వయసు ఉన్న వ్యక్తులను సమీకరించి 'స్టోరీ టెల్లింగ్'లాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో చెబుతారు.

'సీనియర్ సిటిజన్స్ కోసం థియేటర్ అనేది మంచి కాన్సెప్ట్. అది వారిలో ఉత్సాహాన్ని నింపుతుంది. కొత్త శక్తిని ఇస్తుంది' అంటున్నాడు థియేటర్ డైరెక్టర్ సలీమ్ ఆరీఫ్. 'నాటకరంగం అనేది అత్యంత ప్రభావశీలమైనది. ఈ బలమైన మాధ్యమం పెద్దల నీడలో మరింత బలం పుంజుకుంటుంది. వయసు ఎన్నో అనుభవాలను ఇస్తుంది. ఆ అనుభవ జ్ఞానం నాటకాల్లో ప్రతిఫలిస్తుంది. వృద్ధులు అనగానే ప్రేక్షకుల్లో కూర్చుని నాటకం వీక్షించడానికే పరిమితం కానవసరం లేదు. ఇప్పుడు వారిని రంగస్థలం ప్రేమగా, అభిమానంగా ఆహ్వానిస్తోంది'' అంటున్నాడు రంగస్థల ప్రముఖుడు సంగమ్ బహుగుణ.

పెద్దల చేత రూపుదిద్దుకుంటున్న నాటకాలు, పెద్దలు నటించే నాటకాలు ఎలా ఉండబోతున్నాయి? కేవలం.. ఒంటరి ఏకాంతాలు, వయసు సమస్యలు, కుటుంబ సమస్యలు... ఇలా ఏవోవో సమస్యలు ఉండబోతున్నాయా?

'కానే కాదు' అంటుంది పీపుల్స్ ఇన్షియేటివ్.

నాటకాల పాఠశాల

వయసు పైబడినంత మాత్రాన అది నటనపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపదని నిరూపిస్తున్న ప్రతిభావంతులలో సోహైలా కపూర్ ఒకరు. ఘనమైన ఖాన్‌దాన్ నుంచి వచ్చిన కపూర్ నటి, రచయిత్రి, మోడ్రన్ థియేటర్ వ్యవస్థాపకురాలు. ఈ తరం నటు



లతో కలిసి రంగస్థలం, జీ థియేటర్‌లలో నటిస్తోంది కపూర్. ఆమెతో నటించడం అంటే ఔత్సాహిక నటులకు ఒక విశ్వవిద్యాలయంలో చదువుకున్నంత అదృష్టం. ఢిల్లీలో పుట్టిన కపూర్ హైస్కూల్ రోజుల్లోనే రంగస్థలంపై అడుగుపెట్టింది. 'వయసు పైబడగానే విషాదం మూర్తీభవించే పాత్రలకు మాత్రమే మహిళా నటులు పరిమితం అవుతున్నారు. ఇది సరికాదు. వృద్ధాప్యం అంటే విషాదం మాత్రమే కాదు. ఎన్నో బలమైన పాత్రలు మన కోసం ఎదురుచూస్తున్నాయి. వోటీటీ పుణ్యమా అని సీనియర్ నటీమణులకు మూస పాత్రలు కాకుండా భిన్నమైన పాత్రలలో నటించే అవకాశం దొరుకుతుంది' అంటోంది కపూర్.

వారు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తారు. తాము నడిచొచ్చిన బాటను గుర్తు చేస్తూ ఈ తరానికి సానుకూలశక్తిని పంచుతారు. ఇంతకంటే కావాల్సినదేముంది! ●

సాగుబడి

భరణి కార్తె: మే 10 వరకు

కిసాన్ ఎక్స్‌పో నిరవధిక వాయిదా

గ్రామభారతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మే 5,6,7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్‌లో జరగవలసిన కిసాన్ ఎక్స్‌పో-2023ను ఎడతెగని అకాల వర్షాల కారణంగా నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు గ్రామ భారతి కార్యదర్శి సామ ఎల్లారెడ్డి తెలిపారు.

7న బసంపల్లిలో రైతు శిక్షణ

ప్రకృతి వ్యవసాయంపై శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామంలో ఈ నెల 7(ఆదివారం)న ఉ. 9 నుంచి సా. 4 వరకు సీనియర్ రైతు నాగరాజు తన తోటలోనే శిక్షణ ఇవ్వనున్నారు. ప్రవేశ రుసుం రూ.200. ధర్మవరం – పుట్టపర్తి రోడ్డులో నాగరాజు క్షేత్రం ఉంటుంది. వివరాలకు.. 91826 71819.

ఐదు దొంతర్ల సేద్యంపై నాసిక్‌లో పాలేకర్ శిక్షణ

ఐదు దొంతర్ల ప్రకృతి వ్యవసాయం (ఫైవ్ లేయర్ మోడల్)లో బహుళ పంటల సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి రూ. 3 లక్షల ఆదాయం పొందే పద్ధతులపై నాసిక్ (మహారాష్ట్ర)లో ఈ నెల 13,14,15 తేదీల్లో ప్రకృతి వ్యవసాయవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత సుభాష్ పాలేకర్ శిక్షణ ఇవ్వనున్నారు. 13, 14 తేదీల్లో శిక్షణా శిబిరం తర్వాత 15న ఐదు దొంతర్ల పంటల క్షేత్ర సందర్శన ఉంటుంది. పాలేకర్ కృషి పద్ధతిలో ఓ రైతు దంపతులు విభిన్నమైన ఉద్యాన పంటలను సాగు చేస్తూ ఎకరాకు ఏడాదికి రూ. 3 లక్షల ఆదాయం పొందుతున్నారు. సమీప రైతులతో పోల్చితే రెండింతల ఆదాయాన్ని పొందుతున్నారు. ప్రజలకు మంచి ఆహారాన్ని అందిస్తూ తాము ఆరోగ్యంగా జీవిస్తున్నారు. శిక్షణా శిబిరంలో పాల్గొనే వారికి పాలేకర్ స్వయంగా వీరి క్షేత్రాన్ని చూపిస్తారు. నాసిక్ శిబిరానికి వెళ్లదలచుకునే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రైతులకు సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ విజయరామ్ (040 27654337) సహాయ పడుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం.. సురేష్ జాదవ్ – 93739 91112. ఇతర వివరాలకు.. హితేష్ పటేల్ – 98232 90969

● ప్రకృతిని నమ్ముకున్నారు..

40 సెంట్లు.. రూ.3 లక్షలు..

ఈ రైతు దంపతులు ప్రకృతిని, తనకున్న రెండు ఆవులను నమ్ముకున్నారు.. పేడ, గోమూత్రంతో ఘనజీవామృతం, జీవామృతాలను తయారు చేసుకొని ఏడేళ్లుగా శ్రద్ధగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.. వీరి స్వయం కృషికి పంచభూతాలు సాయం చేస్తున్నాయి. మామిడి తోట మధ్యలో 40 సెంట్లలో ఫిబ్రవరి నుంచి అంతర పంటలుగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తూ ప్రతి వారం మంచి ఆదాయం పొందుతున్నారు. అందుకే దీన్ని 'ఏటీఎం నమూనా'గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రూ. 1,20,000 ఆదాయం వచ్చింది. కేవలం ఈ అంతర పంటల ద్వారా మొత్తం రూ.3 లక్షలకు పైగా ఆదాయం పొందే అవకాశం ఉందంటున్న నారాయణ, పార్వతి దంపతుల కృషిపై 'సాక్షి' ఫోకస్..

40 సెంట్లలో అంతర పంటల ద్వారా రూ. 3 లక్షల ఆదాయం

3.7 ఎకరాల మామిడిలో రూ. 3 లక్షల ఆదాయం

మక్కువతో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు దంపతులు


మామిడిలో అంతర పంటగా నారాయణ, పార్వతి దంపతులు సాగు చేసిన వివిధ రకాల కూరగాయలు


ముల్లంగి


అలసంద


నారాయణ తోటను ఇటీవల సందర్శించిన అధికారుల బృందం

స్వయంకృషితో పాటు ప్రకృతిని నమ్ముకుంటే రైతు సుభిక్షంగా ఉంటాడనడానికి హెచ్. నారాయణ, పార్వతి దంపతులే నిదర్శనం. వీరి స్వస్థలం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మల్లాపురం గ్రామం. తమకున్న 3.70 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. తమకున్న రెండు నాటు ఆవులను సంరక్షిస్తూ పేడ, గోమూత్రంతో ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం తయారు చేసుకొని పంటలకు వాడుతున్నారు. స్వయం కృషికి తోడుగా అతి తక్కువ పెట్టుబడితోనే మామిడిలో, అంతర పంటల్లోనూ మంచి ఆదాయం ఆర్జిస్తూ ఇతర రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

మామిడి తోటలోని 40 సెంట్ల స్థలాన్ని ఫిబ్రవరి 13న ఎంపిక చేసుకొని బోదెలు సిద్ధం చేసుకున్నారు. ఐదు వరసల్లో 5 రకాల పంటలను విత్తుకున్నారు. గోరుచిక్కుడు, క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, అలసంద, మొక్కజొన్నతో పాటు మెంతాకు, కొత్తిమీర, గోంగూర సాగు చేస్తున్నారు. బోరు నీటిని అందిస్తున్నారు. ఘనజీవామృతం వేస్తున్నందు వల్ల నీరు కూడా ఎక్కువ అవసరం రావటం లేదు. ఒక్క తడి ఇస్తే 15-20 రోజులు ఉంటుంది. కెమికల్ వేసిన పొలం అయితే ఐదారు రోజులకే నీరు మళ్లీ అడుగుతుంది. తోట పనులను నారాయణ, ఆయన భార్య కలసి చేసుకుంటున్నారు. ప్రతి శుక్రవారం మార్కెట్‌లో, ఇంటి దగ్గర కూరగాయలు అమ్ముతున్నారు. ఇప్పటివరకు గోరుచిక్కుడు (చోలా కాయల) ద్వారా రూ.30 వేలు, ముల్లంగి ద్వారా రూ.50 వేలు, కొత్తిమీరలో రూ.20 వేలు, మెంతాకు, గోంగూరలలో మరో రూ.20 వేలు ఆదాయం వచ్చింది. ముల్లంగి, ఆకుకూరలు తీసేవి తీస్తూ ఉంటే మళ్లీ విత్తుతున్నారు. మొక్కజొన్న, అలసంద, క్యారెట్, బీట్‌రూట్ పంటలు మరో ఒకటిన్నర నెలల్లో చేతికొస్తాయి. క్యారెట్, బీట్‌రూట్ మంచి ధర పలుకుతాయని, మొత్తంగా 40 సెంట్లకు రూ.3 లక్షలకు పైగానే ఆదాయం వస్తుందని, ఇదంతా నికరాదాయమేనని నారాయణ ధీమాగా చెబుతున్నారు. రూ. 1,500లతో విత్తనాలు కొనటం తప్ప వేరే ఏ ఖర్చూ లేదన్నారు. రసాయనాలు వేయకుండా పంటలను పసిబిడ్డల్ని చూసుకున్నట్లు చూసుకుంటున్నామని నారాయణ చెప్పారు. అంతర పంటల ద్వారా నిరంతరం ఆదాయం వస్తోందని చెబుతూ.. ఇదే ఏటీఎం మోడల్ పంటల వల్ల లాభం అన్నారు. తనను చూసి తన పక్క పొలం రైతు కూడా 20 సెంట్లలో ఈ నమూనాలో పంటలు వేశాడన్నారు. క్లస్టర్‌లో మరో 25 మంది రైతులు వేశారన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు


నారాయణ, పార్వతి

నేను అయిష్టంగానే ప్రకృతి వ్యవసాయాన్ని ఏడేళ్ల క్రితం మొదలు పెట్టాను. డీపీఎం లక్ష్మానాయక్, మాస్టర్ ట్రైనర్ శివశంకర్ అన్ని విషయాలూ అర్థమయ్యేలా చెప్పి సహకరించారు. ఘన, ద్రవ జీవామృతాలు తయారు చేసుకొని ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. పంటలకు ఎలాంటి తెగుళ్లు, వైరస్‌లు రాలేదు. పండ్ల తోటల్లో కూడా ఐదారు రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే ఒకదాని తర్వాత ఒకటి మనకు పంట చేతికొస్తుంది. మంచి నికరాదాయం వస్తుంది. ఇది రైతులకు ఎంతో మేలైన పద్ధతి. భూమి కూడా గుల్లబారి బాగుంటుంది. వాన నీరు బాగా ఇంకుతుంది. సహజ సిద్ధమైన ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తింటే మనిషి ఆరోగ్యం కూడా బాగుంటుంది. నన్ను చూసి కొందరు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి.

- హెచ్.నారాయణ (95504 84675), ప్రకృతి వ్యవసాయదారుడు, మల్లాపురం గ్రా., కళ్యాణదుర్గం మం., అనంతపురం జిల్లా

మామిడిలోనూ మంచి ఆదాయం


మామిడి పంటను కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే నారాయణ దంపతులు సాగు చేస్తున్నారు. ఘనజీవామృతం, జీవామృతాన్ని వినియోగిస్తూ మంచి దిగుబడి, ఆదాయం పొందుతున్నారు. గత ఏడాది మామిడి 8 టన్నుల దిగుబడి రాగా రూ.2 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ఇప్పటికే 6 టన్నులు పంట కోత కోశారు. మరో 3 టన్నులు పంట చేతికొస్తుంది. మామిడి ద్వారా రూ.3 లక్షలకు పైగా ఆదాయం వస్తుందని నారాయణ చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పండ్లు, కూరగాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటున్నాయని, రుచిగా ఉంటున్నాయని వినియోగదారులు సంతోషంగా మంచి ధరకు తీసుకుంటున్నారని నారాయణ, పార్వతి ఆనందంగా చెబుతున్నారు. వీరి పొలాన్ని ఇటీవల పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్, అనంతపురం జిల్లా కలెక్టర్ గౌతమి తదితరులు సందర్శించి అభినందించారు.

– ఈదుల శ్రీనివాసులు, సాక్షి, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా


మామిడి పండ్లను చూపుతున్న పార్వతి, నారాయణ

స్వయంగా చూస్తే గానీ నమ్మలేరు..

పది రకాల కూరగాయలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తూ అనంతపురం జిల్లాలో రైతులు సుమారు 400 మంది అత్యంత ఆశ్చర్యకరమైన రీతిలో అధికాదాయం పొందుతున్నారు. స్వయంగా వచ్చి చూస్తే గానీ ఇంత ఆదాయం వస్తున్నదని నమ్మకం కలగదు. నారాయణ, పార్వతి రైతు దంపతులు తమ మామిడి తోటలో 40 సెంట్లలో అంతర పంటలుగా కూరగాయలను సాగు చేస్తూ చక్కని ఆదాయం పొందుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటికి రూ. 1,20,000 ఆదాయం వచ్చింది. మరో రెండు నెలల్లో ఈ ఆదాయం రూ. 3 లక్షలకు పెరుగుతుందని రైతు ధీమాగా ఉన్నారు. జిల్లా కలెక్టర్ గౌతమి, ఏపీ రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయకుమార్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ కూడా ఇటీవల నారాయణ తోటను సందర్శించారు. అంత ఆదాయాన్ని పొందే అవకాశాలు ప్రకృతి వ్యవసాయంలో ఉన్నాయన్నది ఈ తోటలను స్వయంగా చూసిన వారికి అర్థం అవుతుంది. వారానికి రెండు, మూడు సార్లు కూరగాయలను విక్రయిస్తూ నిరంతరం ఆదాయం పొందుతున్నారు. అందువల్లనే ఈ నమూనాను 'ఏటీఎం మోడల్' అని పిలుస్తున్నాం.



- లక్ష్మానాయక్ (83310 57583), ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్, అనంతపురం జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



మురళీ శ్రీశంకర్‌కు స్వర్ణం

ఎంటీఏ హై పెర్ఫార్మెన్స్ అథ్లెటిక్స్ మీట్‌లో భారత ప్లేయర్ మురళీ శ్రీశంకర్ లాంగ్‌జంప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. కాలిఫోర్నియాలో జరిగిన ఈ మీట్‌లో 24 ఏళ్ల శ్రీశంకర్ 8.29 మీటర్ల దూరం గెంతి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ మీట్‌లో శ్రీశంకర్ వచ్చే ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ అర్హత ప్రమాణాన్ని (8.25 మీటర్లు) అధిగమించాడు. అయితే మైదానంలో గాలివేగం నిర్ణీత ప్రమాణంకంటే ఎక్కువ ఉండటంతో శ్రీశంకర్ ప్రదర్శనకు ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ లభించలేదు.

బెంగళూరు జట్టులో కేదార్ జాదవ్



తాజా ఐపీఎల్ టోర్నీలో మైక్ పట్టుకొని మరాఠీ వ్యాఖ్యానం చేసుకుంటున్న భారత క్రికెటర్ కేదార్ జాదవ్‌కు బ్యాట్ పట్టుకొని మైదానంలోకి దిగే అవకాశం దక్కింది. గాయంతో జట్టుకు దూరమైన బౌలర్ విల్లీ స్థానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు కేదార్ జాదవ్‌ను అతడి కనీస ధర రూ. 1 కోటికి కొనుగోలు చేసింది. మహారాష్ట్రకు చెందిన 38 ఏళ్ల కేదార్ 93 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 1,196 పరుగులు చేశాడు.

హుసాముద్దీన్ శుభారంభం



తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (57 కేజీలు) శుభారంభం చేయగా... వరిందర్ సింగ్ (60 కేజీలు) మాత్రం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. తొలి రౌండ్‌లో హుసాముద్దీన్ 5–0తో అలెన్ రుస్తెమోవ్స్కీ (మెసెడోనియా)పై గెలుపొందగా... వరిందర్ 0–5తో తుర్సునోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ నుంచి 13 మంది బాక్సర్లు బరిలో ఉన్నారు.

'ఇది భారత కుర్రాళ్ల ఐపీఎల్'

ఎమ్మెస్కే ప్రసాద్ వ్యాఖ్య



ముంబై: గత సీజన్లతో పోలిస్తే ఐపీఎల్–2023 మరింత ఆసక్తికరంగా సాగుతోందని భారత మాజీ క్రికెటర్, సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అన్నింటికంటే ముఖ్యంగా లీగ్‌లో భారత యువ ఆటగాళ్లు సత్తా చాటడం మంచి పరిణామమని ఆయన అన్నారు. ఎమ్మెస్కే ఈ ఐపీఎల్ సీజన్‌లో స్టార్ స్పోర్ట్స్–తెలుగు చానల్‌లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. 'స్టార్' కార్యక్రమంలో ఆయన తాజా సీజన్ గురించి తన అభిప్రాయాలు వెల్లడించారు. 'సగం టోర్నమెంట్ ముగిసేసరికే ఈ ఐపీఎల్ గత సీజన్‌ల రికార్డులను అధిగమించింది. 200కు పైగా స్కోర్లు పెద్ద సంఖ్యలో నమోదు కాగా, సిక్సర్ల సంఖ్య కూడా చాలా ఎక్కువ. ఇది లీగ్ ఎంతగా విజయవంతం అయిందో చూపిస్తోంది' అని ప్రసాద్ అన్నారు. కొత్తగా తీసుకొచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ అంశం మంచి ప్రభావం చూపిస్తోందని ప్రసాద్ చెప్పారు. 'ఇంపాక్ట్ ప్లేయర్ వల్ల ఈ సీజన్‌లో ఐపీఎల్ టీమ్ హోమ్ అడ్వాంటేజ్ పోయింది. ప్రత్యర్థి జట్టు వ్యూహాన్ని మార్చుకునే అవకాశం కలుగుతోంది. అందుకే చాలా మ్యాచ్‌లలో సొంత మైదానాల్లో జట్లు ఓడిపోతున్నాయి' అని ఎమ్మెస్కే విశ్లేషించారు. ప్రధానంగా భారత యువ ఆటగాళ్లు మంచి ప్రదర్శనలు ఇవ్వడం చెప్పుకోదగ్గ అంశమని ఈ భారత మాజీ వికెట్ కీపర్ వ్యాఖ్యానించారు. 'ఇది భారత క్రికెట్‌కు మేలు చేసే అంశం. తిలక్ వర్మ, సాయిసుదర్శన్, రింకూ సింగ్, యశస్వి, ధ్రువ్ జురేల్ తమ ఆటతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడం సానుకూలాంశం.' అని ప్రసాద్ పేర్కొన్నారు.

లక్నో 'సూపర్' ఫ్లాప్

- 127 లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన లక్నో సూపర్ జెయింట్స్
- 18 పరుగులతో నెగ్గిన బెంగళూరు
- రాణించిన డుప్లెసిస్, హాజల్‌వుడ్



లక్నో: లక్నో సూపర్ జెయింట్స్ చెత్తగా ఆడి చిత్తుగా ఓడింది. బెంగళూరు స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకొని తమ సొంతగడ్డపై ఎదురైన పరాజయానికి లక్నో గడ్డపై ప్రతీకారం తీర్చుకుంది. సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో 18 పరుగులతో బెంగళూరు గెలుపొందింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లకు 126 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డుప్లెసిస్ (40 బంతుల్లో 44; 1 ఫోర్, 1 సిక్స్) రాణించాడు. తర్వాత లక్నో 19.5 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది.

బెంగళూరు జట్టు తరఫున ఓపెనర్లవే పరుగులు... ఆ తర్వాత కష్టాలే! కోహ్లి (30 బంతుల్లో 31; 4 ఫోర్లు), కెప్టెన్ డుప్లెసిస్ ఆడినంత వరకు స్కోరు బోర్డు నడిచింది. పవర్‌ప్లేలో 42 పరుగులే అయినా వికెట్‌ను కాపాడుకుంది. అయితే రవి బిష్ణోయ్ కోహ్లిని స్టంపౌట్ చేయడంతో 61 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దినేశ్ కార్తీక్ (16) మినహా ఇంకెవరూ పట్టుమని పది పరుగులైనా చేయలేదు. లక్నో కళ్ల ముందున్న లక్ష్యం చిన్నది. కానీ బ్యాటర్ల నిర్లక్ష్యం జట్టును పవర్‌ప్లేలోనే 'ఫ్లాప్' చేసింది. మేయర్స్ (0), కృనాల్ (14), బదోని (4), దీపక్ హుడా (1)లను బెంగళూరు బౌలర్లు సిరాజ్, మ్యాక్స్‌వెల్, హాజల్‌వుడ్, హసరంగ తలా ఓ దెబ్బ తీశారు. 5.1 ఓవర్లలో 27/4 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కృష్ణప్ప గౌతమ్ (13 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మిశ్రా (30 బంతుల్లో 19; 2 ఫోర్లు) చేసిన పరుగులు లక్నోను కష్టంగా 100 దాటించాయే తప్ప లక్ష్యాన్ని చేర్చలేదు. ఫీల్డింగ్ సమయంలో కెప్టెన్ కేఎల్ రాహుల్ (0 నాటౌట్) తొడ కండరాలు పట్టేయడంతో ఓపెనింగ్ చేయలేదు. 11వ స్థానంలో వచ్చి నాటౌట్‌గా నిలిచాడంతే!

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (స్టంప్డ్) పూరన్ (బి) బిష్ణోయ్ 31; డుప్లెసిస్ (సి) కృనాల్ (బి) మిశ్రా 44; అనూజ్ (సి) మేయర్స్ (బి) గౌతమ్ 9; మ్యాక్స్‌వెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 4; ప్రభుదేశాయ్ (సి) గౌతమ్ (బి) మిశ్రా 6; దినేశ్ కార్తీక్ (రనౌట్) 16; మహిపాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) నవీనుల్ 3; హసరంగ (నాటౌట్) 8; కరణ్ శర్మ (సి) గౌతమ్ (బి) నవీనుల్ 2; సిరాజ్ (సి) పూరన్ (బి) నవీనుల్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 126. వికెట్ల పతనం:** 1–62, 2–75, 3–80, 4–90, 5–109, 6–114, 7–117, 8–121, 9–121. **బౌలింగ్:** కృనాల్ పాండ్యా 4–0–21–0, స్టొయినిస్ 1–0–11–0, నవీనుల్ హక్ 4–0–30–3, రవి బిష్ణోయ్ 4–0–21–2, అమిత్ మిశ్రా 3–0–21–2, యశ్ 2–0–12–0, గౌతమ్ 2–0–10–1.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేయర్స్ (సి) అనూజ్ (బి) సిరాజ్ 0; బదోని (సి) కోహ్లి (బి) హాజల్‌వుడ్ 4; కృనాల్ (సి) కోహ్లి (బి) మ్యాక్స్‌వెల్ 14; హుడా (స్టంప్డ్) కార్తీక్ (బి) హసరంగ 1; స్టొయినిస్ (సి) ప్రభుదేశాయ్ (బి) కరణ్ శర్మ 13; పూరన్ (సి) మహిపాల్ (బి) కరణ్ శర్మ 9; గౌతమ్ (రనౌట్) 23; బిష్ణోయ్ (రనౌట్) 5; మిశ్రా (సి) కార్తీక్ (బి) హర్షల్ 19; నవీనుల్ (సి) కార్తీక్ (బి) హాజల్‌వుడ్ 13; రాహుల్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.5 ఓవర్లలో ఆలౌట్) 108. వికెట్ల పతనం:** 1–0, 2–19, 3–21, 4–27, 5–38, 6–65, 7–66, 8–77, 9–103, 10–108. **బౌలింగ్:** సిరాజ్ 3–0–24–1, హాజల్‌వుడ్ 3–0–15–2, మ్యాక్స్‌వెల్ 1–0–3–1, హసరంగ 4–0–20–1, కరణ్ శర్మ 4–0–20–2, హర్షల్ పటేల్ 3.5–0–20–1, మహిపాల్ 1–0–4–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	0.638
రాజస్తాన్	9	5	4	10	0.800
లక్నో	9	5	4	10	0.647
చెన్నై	9	5	4	10	0.329
బెంగళూరు	9	5	4	10	-0.038
పంజాబ్	9	5	4	10	-0.447
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	8	2	6	4	-0.898

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

గుజరాత్ × ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'బ్రిజ్‌భూషణ్‌ను రక్షించే ప్రయత్నమిది'

- నవజోత్ సింగ్ సిద్ధూ విమర్శ
- కొనసాగుతున్న రెజ్లర్ల నిరసన



న్యూఢిల్లీ: తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తున్న భారత అగ్రశ్రేణి రెజ్లర్లకు అన్ని వైపుల నుంచి సంఘీభావం లభిస్తోంది. తాజాగా కాంగ్రెస్ నేత, భారత మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ కూడా వేదిక వద్దకు వచ్చి తన మద్దతు ప్రకటించాడు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అతనిపై చర్యకు వెనుకాడుతోందని సిద్ధూ విమర్శించాడు. 'ఎఫ్‌ఐఆర్ ఎందుకు ఆలస్యం చేశారు. అందులో వివరాలు ఎందుకు బయటపెట్టడం లేదు. దానిని బలహీనంగా తయారు చేశారని అర్థమవుతోంది. అన్నీ దాచేసి బ్రిజ్‌భూషణ్‌ను రక్షించే ప్రయత్నమే ఇదంతా. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తే ఇప్పటి వరకు అరెస్ట్ ఎందుకు చేయలేదు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలి' అంటూ సిద్ధూ వ్యాఖ్యానించాడు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా కూడా రెజ్లర్లకు సంఘీభావం పలకగా... రేడియోలో 'మన్‌కీ బాత్' కాదు, రెజ్లర్ల వద్దకు వచ్చి వారి మన్‌కీ బాత్ వినాలని ప్రముఖ న్యాయవాది కపిల్ సిబాల్ సూచించారు. మరోవైపు తనను ఉరి తీసినా పర్వాలేదని, రెజ్లింగ్ పోటీలు మాత్రం ఆగరాదని బ్రిజ్‌భూషణ్ అన్నాడు. 'గత నాలుగు నెలలుగా రెజ్లింగ్ కార్యకలాపాలు ఆగిపోయాయి. పిల్లల భవిష్యత్తుతో ఆడుకోకండి. తక్షణం ఎవరి ఆధ్వర్యంలోనైనా క్యాడెట్ నేషనల్స్ నిర్వహించండి. లేదంటే వయసు పెరిగి కుర్రాళ్లు అవకాశం కోల్పోతారు. నన్ను ఉరి తీయండి కానీ ఆట మాత్రం ఆగవద్దు' అని బ్రిజ్‌భూషణ్ చెప్పాడు.

కోహ్లి X గంభీర్



లక్నో, బెంగళూరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ ముగిసిన తర్వాత కోహ్లి, లక్నో కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్రంగా వాదించుకోవడం కనిపించింది. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లో వీరిద్దరి మధ్య జరిగిన గొడవను ఇది గుర్తుకు తెచ్చింది. అయితే ఇందులో నేరుగా గంభీర్ పాత్ర లేకపోయినా...అతని జోక్యంతో పరిస్థితి కాస్త వేడిగా మారింది. బెంగళూరు విజయం తర్వాత షేక్ హ్యాండ్‌ల సమయంలో కోహ్లి, లక్నో పేసర్ నవీనుల్ హక్ (అఫ్గానిస్తాన్) మధ్య ఏదో వాదన జరిగింది. చేతులు విసిరికొట్టి మరీ ఇద్దరూ విడిపించుకున్నారు. అయితే ఆ తర్వాత నవీన్‌ను పిలిచి కోహ్లి ఏదో చెప్పేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ముందుగా కైల్ మేయర్స్ (వెస్టిండీస్), ఆ తర్వాత గంభీర్ తమ ఆటగాడికి అండగా నిలుస్తూ మధ్యలోకి వచ్చారు. దాంతో కోహ్లి, గంభీర్ తీవ్రంగా వాదించుకున్నారు. చివరకు రాహుల్, మిశ్రా జోక్యం చేసుకొని విడిపించాల్సి వచ్చింది. ఆ తర్వాతా కోహ్లి పదే పదే ఇదే విషయాన్ని రాహుల్‌కు ఫిర్యాదు చేయడం కనిపించింది. నిజానికి గత మ్యాచ్‌లో గెలిచిన తర్వాత చిన్నస్వామి స్టేడియంలో నోరు మూయమంటూ ప్రేక్షకులను ఉద్దేశించి గంభీర్ సైగ చేయగా... ఈసారి గెలుపు బాటలో కోహ్లి అదే తరహాలో సైగ చేస్తూ దానిని గుర్తు చేయడం కూడా ఒక కారణం కావచ్చు!

ఆసియా క్రీడలకు సైనా దూరం!



న్యూఢిల్లీ: భారత మహిళా స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ ఈ ఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లలో చైనాలో జరిగే ఆసియా క్రీడలకు దూరం కానుంది. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే భారత బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక కోసం ఈనెల 4 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న సెలెక్షన్‌ట్రయల్స్ టోర్నీలో సైనా నెహ్వాల్ పాల్గొనడంలేదు. 'ఫిట్‌నెస్ సంబంధిత సమస్యల కారణంగా సైనా ట్రయల్స్‌లో బరిలోకి దిగడంలేదు. సైనాతోపాటు పురుషుల డబుల్స్ జోడీ కుశాల్ రాజ్, ప్రకాశ్ రాజ్ కూడా ట్రయల్స్ టోర్నీ నుంచి వైదొలిగారు' అని భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) కార్యదర్శి సంజయ్ మిశ్రా తెలిపారు.

సినిమా

పక్కా మాస్ డ్రైవర్



● చిరంజీవి

ఇక్కడున్న చిరంజీవి ఫొటో చూశారు కదా.. టాక్సీ డ్రైవర్ గెటప్‌లో మాస్‌గా కనిపిస్తున్నారు. జస్ట్ 30 ఏళ్లు వెనక్కి వెళితే 'రౌడీ అల్లుడు'లో ఆటో డ్రైవర్ జానీగా చిరంజీవి మాస్ గెటప్‌లో అలరించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'భోళా శంకర్'లో టాక్సీ డ్రైవర్‌గా మాస్ లుక్‌లో కనిపించనున్నారు చిరంజీవి. సోమవారం మే డే సందర్భంగా ఈ టాక్సీ డ్రైవర్ లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. చిరంజీవి, తమన్నా జంటగా మెహర్ రమేష్ తెరకెక్కిస్తున్న చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి చెల్లెలిగా కీర్తీ సురేష్ నటిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇటీవల చిత్రీకరించిన ఇంటర్వెల్ ఎపిసోడ్‌తో ఈ చిత్రం 80 శాతం పూర్తయింది. ''నెక్ట్స్ షెడ్యూల్‌ను కోల్‌కతాలో ఆరంభిస్తాం. ఆ తర్వాత చిరంజీవి, తమన్నాపై యూరప్‌లో ఒక పాటను చిత్రీకరిస్తాం. అక్కడ నుంచి వచ్చాక కొంత టాకీ, క్లయిమాక్స్, ఒక సెట్ సాంగ్ చిత్రీకరణను ప్లాన్ చేశాం. జూన్ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. ఆగస్టు 11న చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వర సాగర్, కెమెరా: డడ్లీ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: కిషోర్ గరికిపాటి, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్, నిర్మాత: రామబ్రహ్మం సుంకర.

నా ఉగ్ర రూపం చూస్తారు - 'అల్లరి' నరేశ్



● హరీష్ పెద్ది, సాహు, విశ్వక్ సేన్, సందీప్ కిషన్, 'అల్లరి' నరేశ్, విజయ్, మిర్నా

''ఇప్పటి వరకూ మిమ్మల్ని (ప్రేక్షకుల్ని) కితకితలు పెట్టించాను.. మరికొన్ని సినిమాల్లో కన్నీళ్లు పెట్టించాను. కానీ, 'ఉగ్రం' చిత్రంలో నా ఉగ్ర రూపం చూస్తారు. 'నాంది' సినిమాని ఎంత ఆదరించారో అంతకుమించి పదిరెట్లు 'ఉగ్రం' ని ఆదరించాలని కోరుకుంటున్నాను'' అని హీరో 'అల్లరి' నరేశ్ అన్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో 'అల్లరి' నరేశ్, మిర్నా మీనన్ జంటగా నటించిన చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో 'అల్లరి' నరేశ్ మాట్లాడుతూ – ''ఉగ్రం' నా కెరీర్‌లో 60వ సినిమా. 'అల్లరి' నుంచి 'ఉగ్రం' వరకూ నా జర్నీలో ఉన్న దర్శకులు, నిర్మాతలకు థ్యాంక్స్. నేను, విజయ్ 'నాంది' చేస్తున్నప్పుడు ఎలాంటి అంచనాలు లేవు. కానీ, 'ఉగ్రం' మూవీకి అంచనాలు పెరుగుతాయి.. వాటిని కచ్చితంగా చేరుకోవాలని యూనిట్ అంతా కష్టపడ్డాం. నాకు, విజయ్‌కి సింక్ బాగా కుదిరింది. మా కమిట్‌మెంట్స్ అయిపోయాక మూడో సినిమా కలిసి చేస్తాం. బడ్జెట్ ఎక్కువ అవుతున్నా మా నిర్మాతలు ఎప్పుడూ చర్చ పెట్టలేదు. సినిమాకి ఎంత ఖర్చు పెట్టారో, పబ్లిసిటీ కోసం కూడా బాగా ఖర్చు చేస్తున్నందుకు థ్యాంక్స్. ఈ మూవీ కోసం ప్రతిరోజూ దాదాపు 16 నుంచి 18 గంటలు పనిచేశాం''అన్నారు.

సాహు గారపాటి మాట్లాడుతూ– ''నరేశ్‌గారు ఇప్పటి వరకూ చేయని పాత్రని 'ఉగ్రం' సినిమాలో చేశారు. మేమంతా ఎంత థ్రిల్ అయ్యామో సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అంతే థ్రిల్ అవుతారు. ఆయన కెరీర్‌లో ఇది బిగ్గెస్ట్ మూవీ అవుతుంది'' అన్నారు.

హరీష్ పెద్ది మాట్లాడుతూ– ''విజయ్‌గారు అనుకున్నది సాధించుకునే వరకూ నిద్రపోడు.. ఎవర్నీ నిద్రపోనివ్వడు. ఆయనపై మేము పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ అవుతుంది'' అన్నారు.

విజయ్ కనకమేడల మాట్లాడుతూ– ''శ్రీచరణ్ పాకాల ఇప్పటి వరకూ కొంచెం క్లాస్ టచ్‌లో ఉన్న స్పై, థ్రిల్లర్ సినిమాలు చేశాడు. 'ఉగ్రం' తర్వాత 'మనకి పోటీగా ఇంకొకడు వచ్చాడ్రా' అంటూ మాస్ మ్యూజిక్ డైరెక్టర్స్‌కి కొంచెం భయం మొదలవుతుంది.. ఇది నిజం. 'ఉగ్రం' బడ్జెట్ ఎక్కువ అయినా నన్ను నమ్మి సపోర్ట్ చేసిన నిర్మాతలకు థ్యాంక్స్. ఈ సినిమా కోసం రాత్రిపూట వానలో తీసిన ఓ ఫైట్ కోసం నరేశ్‌గారు ఎంత కష్టపడ్డారో సినిమా చూస్తే తెలుస్తుంది'' అన్నారు. ''ఉగ్రం' సినిమా ఘన విజయం సాధించాలి'' అని హీరోలు అడివి శేష్, నిఖిల్, విశ్వక్ సేన్, సందీప్ కిషన్, దర్శకులు హరీష్ శంకర్, శివ నిర్వాణ, వశిష్ఠ, అనిల్ రావిపూడి, వీఐ ఆనంద్ అన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ సిద్, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల, కథ, మాటల రచయితలు తూము వెంకట్, అబ్బూరి రవి పాల్గొన్నారు.

అందుకే కొన్ని రోజులు మిస్సయ్యా!



● రష్మిక

''అందరూ క్షమించాలి. కొన్ని రోజులుగా మిమ్మల్ని మిస్సవుతూ వచ్చాను. ఎందుకంటే నెట్‌వర్క్ లేని ప్రాంతంలో షూటింగ్ చేస్తున్నాను'' అని రష్మికా మందన్నా సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. ఆమె కథానాయికగా తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రెయిన్ బో'. ఇందులో దేవ్ మోహన్ హీరో. ఈ చిత్రం షూటింగ్ కొన్నాళ్లు నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో జరిగింది. తాజాగా ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ పూర్తయి, నెట్‌వర్క్ ఉన్న ప్రాంతానికి రావడంతో రష్మిక పై విధంగా పేర్కొన్నారు. ఇంకా ఈ చిత్రం గురించి రష్మికా మందన్నా మాట్లాడుతూ – ''ఫస్ట్ చెన్నైలో కొన్ని రోజులు 'రెయిన్ బో' షూటింగ్ చేశాం. ఆ తర్వాత కొడైకెనాల్ వెళ్లాం. అక్కడ షూట్ చేసి, మున్నార్‌లో మొదలుపెట్టాం. ఈ రెండు ప్రాంతాల్లోనూ నెట్‌వర్క్ లేదు. అయితే షెడ్యూల్ చాలా కూల్‌గా జరిగింది. కొడైకెనాల్‌లో నా గది నుంచి సూర్యోదయాన్ని తిలకించడం ఓ అందమైన అనుభూతి. మంచుకి తడిచిన పువ్వులు కంటికి హాయినిచ్చాయి. మున్నార్ కూడా అంతే. అందమైన, ఆహ్లాదకరమైన ప్రాంతాల్లో షూటింగ్ చేయడం మనసుకి ఉల్లాసంగా అనిపించింది'' అన్నారు.

కొత్త హంగులతో మోసగాళ్లకు మోసగాడు రిలీజ్



● తమ్మారెడ్డి భరద్వాజ, అశ్వినీదత్, ఆదిశేషగిరి రావు, రామలింగేశ్వర రావు

''పద్మాలయ పిక్చర్స్‌కి పునాది - నిర్మాత ఆదిశేషగిరి రావు

'మోసగాళ్లకు మోసగాడు' చిత్రం. మా బ్యానర్‌లో ఎన్నో విజయవంతమైన సినిమాలు తీసినప్పటికీ ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రం ఇది. అభిమానుల కోరిక మేరకు సూపర్‌స్టార్ కృష్ణగారి పుట్టినరోజు సందర్భంగా మే 31న 'మోసగాళ్లకు మోసగాడు' చిత్రాన్ని సరికొత్త హంగులతో మళ్లీ విడుదల చేస్తున్నాం'' అని నిర్మాత ఆదిశేషగిరి రావు అన్నారు. సూపర్ స్టార్ కృష్ణ హీరోగా పద్మాలయ పిక్చర్స్‌లో రూపొందిన 'అల్లూరి సీతారామరాజు' చిత్రం విడుదలై సోమవారంతో 49 ఏళ్లు (1974 మే 1) పూర్తయింది. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో నిర్మాత అశ్వినీదత్ మాట్లాడుతూ– ''కృష్ణగారి వంటి నటులు మళ్లీ రారు. 'మోసగాళ్లకు మోసగాడు' సినిమాతో ఎప్పుడో పాన్ వరల్డ్ సినిమా చేశారాయన'' అన్నారు. ''పద్మాలయ పిక్చర్స్‌పై తీసిన తొలి కౌబాయ్ చిత్రం 'మోసగాళ్లకు మోసగాడు'' అన్నారు దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ''మోసగాళ్లకు మోసగాడు' ట్రెండ్ సెట్టర్'' అని డైరెక్టర్ బి. గోపాల్ అన్నారు.

కృష్ణగారు అవార్డుల పట్ల ఆసక్తి చూపేవారు కాదు. కానీ, ప్రభుత్వం గుర్తించి అవార్డులు ఇస్తే తీసుకునేవారు. ఇప్పుడు కూడా ఆయనకి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కోసం నేను ప్రయత్నం చెయ్యను.. ఎవరైనా చేస్తే సంతోషం. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రకటించే అవార్డులకు చాలా ప్రాముఖ్యత ఉండేది.. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తెలుగు రాష్ట్రాలు విడిపోయాక ఆయా ప్రభుత్వాల నుంచి నంది అవార్డుల ప్రస్తావనే రావడం లేదు.
– ఆదిశేషగిరి రావు

వాస్తవ ఘటనలతో...

అనిరుధ్, యశస్విని జంటగా భిక్షపతి రాజు పందిరి దర్శకత్వంలో చంద్రకళ పందిరి నిర్మించిన చిత్రం 'యాద్గిరి అండ్ సన్స్'. మే 5న విడుదల కానున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 'భీమ్లా నాయక్' చిత్ర దర్శకుడు సాగర్ కె. చంద్ర ట్రైలర్‌ని ఆవిష్కరించారు. అనంతరం సాగర్ కె. చంద్ర మాట్లాడుతూ– ''ఈ చిత్రం ట్రైలర్ కొత్తగా ఉండటంతో దర్శకుడిని కథ అడిగాను. వాస్తవ ఘటనలతో మంచి ప్రయత్నం చేశారు. ఈ సినిమా సక్సెస్ అవ్వాలి'' అన్నారు. ''హీరోగా నాకిది తొలి సినిమా'' అన్నారు అనిరుధ్. ''యాద్గిరి అండ్ సన్స్' ఇంటెలిజెంట్ మూవీ. చాలా సిన్సియర్‌గా మ్యూజిక్ చేశాను'' అన్నారు విజయ్ కురాకుల. ''ప్రేక్షకులకు మంచి సినిమా ఇస్తున్నాం. చూసి, నచ్చితే మరో పది మందికి చెప్పి, సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు భిక్షపతి రాజు.



● అనిరుధ్, సాగర్, భిక్షపతి

కొత్తదనం లేకపోతే ప్రేక్షకులు చూడరు - 'దిల్' రాజు



● కాశీ విశాల్, 'దిల్' రాజు, ఆశిష్

''ప్రేక్షకులకు విజయవంతమైన సినిమా ఇవ్వడం అంత తేలిక కాదు. 'బలగం, దసరా, విరూ పాక్ష'.. ఇలా కొత్తదనంతో నూతన దర్శకులు తీసిన చిత్రాలు ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నాయి. కొత్తదనం లేని సినిమాలు చూడటానికి రెడీగా లేరు.. అది ఇవ్వడానికి రాత్రీపగలు కష్టపడాల్సిందే'' అన్నారు 'దిల్' రాజు. ఆశిష్, ఇవానా జంటగా కాశీ విశాల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సెల్ఫిష్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, సుకుమార్ రైటింగ్స్‌పై 'దిల్' రాజు–శిరీష్ నిర్మిస్తున్నారు. ఆశిష్ పుట్టినరోజు (మే 1)ని పురస్కరించుకుని 'సెల్ఫిష్'లోని 'దిల్ ఖుష్..' అంటూ సాగే పాటని విడుదల చేశారు. మిక్కీ జె. మేయర్ స్వరపరచిన ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, జావేద్ అలీ పాడారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''నేను, సుకుమార్ సపోర్ట్‌గా ఉంటాం. కానీ, ప్రేక్షకులకు నచ్చాల్సింది మాత్రం ఆశిష్. దాని కోసం తను కష్టపడాలి'' అన్నారు. ''సెల్ఫిష్' కోసం నేను, కాశీ ప్రాణం పెట్టి కష్టపడుతున్నాం'' అన్నారు ఆశిష్. ''మాస్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోన్న చిత్రం ఇది'' అన్నారు విశాల్ కాశీ. ఈ చిత్రానికి సహనిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అశోక్ బంద్రెడ్డి.

పురుషోత్తముడు షురూ



● రాజ్ తరుణ్, హాసినీ సుధీర్

రాజ్ తరుణ్ హీరోగా 'పురుషోత్తముడు' చిత్రం షురూ అయింది. రామ్ భీమన దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో హాసినీ సుధీర్ కథానాయిక. రమేష్ తెజావత్, ప్రకాష్ తెజావత్ నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సి. కళ్యాణ్ క్లాప్ కొట్టారు. దర్శకుడు వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. రామ్ భీమన మాట్లాడుతూ– ''ఆకతాయి' చిత్రం తర్వాత నేను చేస్తున్న సినిమా 'పురుషోత్తముడు'. హైదరాబాద్, రాజమండ్రి, కేరళలో ఈ చిత్రం షూటింగ్‌ని ప్లాన్ చేశాం'' అన్నారు. ''ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు చక్కటి ఫ్యామిలీ డ్రామా, ఎమోషన్స్ ఉన్న చిత్రం ఇది'' అన్నారు రాజ్ తరుణ్. ''అమలాపురంలో పుట్టి కాకినాడలో పెరిగి ముంబైలో సెటిల్ అయ్యాం. రామ్‌గారు చెప్పిన కథ ఆకట్టుకోవడంతో ఈ సినిమా తీస్తున్నాం'' అన్నారు రమేష్ తెజావత్, ప్రకాష్ తెజావత్. సినిమాటోగ్రాఫర్ పీజీ విందా, సంగీత దర్శకుడు గోపీసుందర్, గీత రచయిత రామజోగయ్య శాస్త్రి, నిర్మాతలు దామోదర్ ప్రసాద్, దాసరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: వెంగళరావు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
463	150
61,112	18,065

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,252	▲	25
డోజోన్స్	34,162	▲	63
ఎఫ్‌టీఎస్ఈ 100	7,871	▲	39
డాక్స్	15,922	▲	122
షాంఘై	3,323	▲	37
నికాయ్	29,123	▲	267

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై

బంగారం (24 క్యారట్)	60,168	▽	347
బంగారం (22 క్యారట్)	59,927	▽	346
వెండి (కిలో)	73,868	▽	547

4 నెలల గరిష్టానికి తయారీ

ఏప్రిల్‌లో పీఎంఐ సూచీ @ 56.4



న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్ల వృద్ధి, ధరలపరమైన ఒత్తిళ్లు తగ్గుతుండటం తదితర సానుకూల అంశాల ఊతంతో దేశీయంగా తయారీ కార్యకలాపాలు ఏప్రిల్‌లో పుంజుకున్నాయి. నాలుగు నెలల గరిష్టానికి చేరాయి. ఇందుకు సంబంధించిన పీఎంఐ సూచీ (ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్) మార్చిలో 56.4 పాయింట్లు ఉండగా ఏప్రిల్‌లో 57.2 పాయింట్లకు పెరిగింది. సూచీ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దానికి దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. అంతర్జాతీయంగా అమ్మకాలు పెరుగుతుండటం, సరఫరా వ్యవస్థపరమైన పరిస్థితులు మెరుగుపడుతుండటం వంటివి కూడా ఇందుకు దోహదపడినట్లు ఎస్‌అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోల్యానా డి లిమా తెలిపారు. దీనికి సంబంధించిన సర్వే ప్రకారం.. ఈ ఏడాది ఇప్పటివరకు ఫ్యాక్టరీ ఆర్డర్లు, ఉత్పత్తి వృద్ధి రేటు పటిష్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో మరిన్ని ఉద్యోగాల కల్పన జరిగిందని, తగ్గిపోయే నిల్వలను భర్తీ చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా కంపెనీలు కూడా మరింతగా ముడి సరుకులను కొనుగోలు చేస్తున్నాయని లిమా వివరించారు. భారతీయ తయారీ సంస్థలు ముందుకు దూసుకెళ్లడానికి పుష్కలమైన అవకాశాలు కనిపిస్తున్నాయని లిమా పేర్కొన్నారు. మార్కెట్లో సానుకూల పరిస్థితులు, డిమాండ్ మెరుగ్గా ఉండటం వంటి అంశాలు కొత్త ఆర్డర్లకు దోహదపడుతున్నాయని చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-5-2023	
విశాఖ	430-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
1-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

జీఎస్‌టీ వసూళ్లు.. రికార్డు శుభారంభం

- ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో రూ.1.87 లక్షల కోట్లు
- 2017 జూలైలో ప్రారంభమైన తర్వాత భారీ వసూళ్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే రికార్డు సృష్టించాయి. ఏకంగా రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. అన్ని పరోక్ష పన్నులనూ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ, 2017 జూలైలో కొత్త పన్ను విధానం ప్రారంభమైన తర్వాత ఈ స్థాయి వసూళ్లు జరగడం ఇదే తొలిసారి. 2022 ఇదే నెలతో పోల్చితే వసూళ్లు 12 శాతం పెరిగాయి. 2022 ఏప్రిల్‌లో రూ.1.68 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. ఇప్పటివరకూ ఈ అంకెలే రికార్డు స్థాయి కావడం గమనార్హం.

విభాగాల వారీగా...

- మొత్తం పన్ను వసూళ్లు రూ.1,87,035 కోట్లు
- సెంట్రల్ జీఎస్‌టీ రూ.38,440 కోట్లు
- స్టేట్ జీఎస్‌టీ రూ. 47,412 కోట్లు
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.89,158 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.34,072 కోట్లుసహా)
- సెస్ రూ.12,025 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.901 కోట్ల వసూళ్లుసహా)

భారత్ ఎకానమీకి గొప్ప వార్త



రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు ప్రశంసనీయం. భారత ఆర్థిక వ్యవస్థకు ఇది గొప్ప వార్త. తక్కువ పన్ను రేట్లు ఉన్నప్పటికీ, పన్నుల వసూళ్లు నెలవారీగా ఈ స్థాయికి పెరగడం జీఎస్‌టీ పట్ల వ్యవస్థలో పెరిగిన విశ్వాసాన్ని, ఆమోదనీయతను, సమ్మతిని సూచిస్తోంది.

– ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్

- దేశీయ లావాదేవీల (సేవల దిగుమతులతో సహా) ద్వారా వచ్చే ఆదాయాలు గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 2023 ఏప్రిల్‌లో 16% వృద్ధి.
- ఏప్రిల్ 20 ఒకే రోజున అత్యధికంగా రూ. 68,228 కోట్ల చెల్లింపులు జరిగాయి.
- 2022–23లో జీఎస్‌టీ వసూళ్లు రూ.18.10 లక్షల కోట్లు. 2021–22 కంటే 22% అధికం.

కొనసాగిన ఆటో అమ్మకాల జోరు

- ఎస్‌యూవీలకు పెరిగిన డిమాండ్ ప్రభావం
- పెరిగిన మారుతీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ విక్రయాలు
- దూసుకెళ్లిన ద్విచక్ర వాహనాల అమ్మకాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి నెల ఏప్రిల్‌లో ఆటో అమ్మకాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. ప్రధానంగా స్పోర్ట్స్ యుటిలిటి వాహనాల(ఎస్‌యూవీ)కు డిమాండ్ కలిసొచ్చింది. దిగ్గజ కంపెనీలైన మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్ సంస్థలు డీలర్లకు అధిక సంఖ్యలో వాహనాలను సరఫరా చేశాయి. మారుతీ సుజుకీ గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో మొత్తం 1,50,661 వాహనాలను విక్రయించగా, ఏప్రిల్‌లో ఈ సంఖ్య 7 శాతం మేర పెరిగి 1,60,529 యూనిట్లకు చేరింది. ''చిప్ కొరతతో గత నెలలో కొంత ఉత్పత్తి నష్టం జరిగింది. అయితే ఎస్‌యూవీ విభాగంలో 21 శాతం వృద్ధి నమోదు కావడంతో మొత్తం అమ్మకాల పరిమాణం పెరిగింది. ద్రవ్యోల్బణ సమస్య, గ్రామీణ ప్రాంతాల్లో విక్రయాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో రానున్న రోజుల్లో సెంటిమెంట్ స్తబ్ధుగా ఉండొచ్చు'' అని ఎంఎస్ఐ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు.

- ద్విచక్ర వాహన విక్రయాలకు డిమాండ్ కొనసాగడంతో చెప్పుకోదగిన స్థాయిలో విక్రయాలు జరిగాయి. హీరో మోటోకార్ప్(5% క్షీణత) మినహా టీవీఎస్ మోటార్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్, హెచ్ఎంఎస్ఐ అమ్మకాలు వరుసగా 4%, 18%, 6% చొప్పున పెరిగాయి.

కంపెనీ	ఏప్రిల్ 2023	ఏప్రిల్ 2022	క్షీణత/వృద్ధి(శాతాల్లో)
మారుతీ సుజుకీ	1,60,529	1,50,661	(+)7
హ్యుందాయ్ మోటార్స్	58,201	56,201	(+)4
టాటా మోటార్స్	69,599	72,468	(-)4
ఎంఅండ్ఎం	58,801	54,455	(+)8
హోండా కార్స్	5,313	7,874	(-)33
ఎంజీ మోటార్స్	4,193	4,528	(-)7
టయోటా కిర్లోస్కర్	14,162	15,086	(-)6
కియా ఇండియా	23,216	19,019	(+)22
నిస్సాన్ మోటార్	2,617	2,110	(+)24
ద్విచక్ర వాహనాలు			
హీరో మోటోకార్ప్	3,96,107	4,18,622	(-)5
టీవీఎస్ మోటార్స్	3,06,224	2,95,308	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	73,136	62,155	(+)18
హెచ్ఎంఎస్ఐ	3,38,289	3,18,734	(+)6
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,567	5,525	(+)19
ఎస్కార్ట్స్	7,252	7,676	(-)9

- విద్యుత్ ద్విచక్ర వాహన అమ్మకాలు ఏప్రిల్‌లో గణనీయంగా తగ్గాయి. నెల ప్రాతిపదికన మార్చిలో 82,292 యూనిట్లు అమ్ముడయ్యాయి. అవి ఈ ఏప్రిల్‌లో 62,581 యూనిట్లకు తగ్గాయి.

జేపీ మోర్గాన్ చేతికి ఫస్ట్ రిపబ్లిక్



న్యూయార్క్: ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌లో తలెత్తిన సంక్షోభం మొత్తం వ్యవస్థకు వ్యాపించకుండా చూసేందుకు అమెరికా బ్యాంకింగ్ రంగ నియంత్రణ సంస్థలు రంగంలోకి దిగాయి. ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌ను తమ అధీనంలోకి తీసుకున్నాయి. బ్యాంకు డిపాజిట్లు, అసెట్లలో చాలా మటుకు భాగాన్ని జేపీ మోర్గాన్ చేజ్ బ్యాంక్‌నకు విక్రయించాయి. అమెరికా చరిత్రలో ఓ భారీ స్థాయి బ్యాంకు విఫలం కావడం ఇది రెండోసారి. 2008లో అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో వాషింగ్టన్ మ్యూచువల్ కుప్పకూలింది. ప్రస్తుత ఫస్ట్ రిపబ్లిక్ తరహాలోనే అప్పట్లో వాషింగ్టన్ మ్యూచువల్‌ను కూడా జేపీ మోర్గాన్ చేజ్ బ్యాంకే టేకోవర్ చేసింది. సోమవారం నుంచి ఫస్ట్ రిపబ్లిక్ బ్యాంక్‌కు ఎనిమిది రాష్ట్రాల్లో ఉన్న 84 శాఖలు .. జేపీమోర్గాన్ చేజ్ బ్యాంక్ బ్రాంచీలుగా పనిచేయడం ప్రారంభమవుతుందని ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డీఐసీ) వెల్లడించింది. ఏప్రిల్ 13 గణాంకాల ప్రకారం ఫస్ట్ రిపబ్లిక్‌కు 229 బిలియన్ డాలర్ల అసెట్లు, 104 బిలియన్ డాలర్ల మేర డిపాజిట్లు ఉన్నాయి. పరిమాణం ప్రకారం అమెరికన్ బ్యాంకుల్లో 14వ స్థానంలో ఉంది. సిలికాన్ వ్యాలీ బ్యాంకు సమస్య పరిష్కారానికి డిపాజిట్ ఇన్సూరెన్స్ ఫండ్‌పై 20 బిలియన్ డాలర్ల భారం పడగా, ఫస్ట్ రిపబ్లిక్‌పరంగా మరో 13 బిలియన్ డాలర్ల మేర ప్రభావం పడవచ్చని ఎఫ్‌డీఐసీ అంచనా వేసింది. సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌లు సంక్షోభంలో చిక్కుకున్న ప్రభావంతో మార్చి నుంచి ఫస్ట్ రిపబ్లిక్ సైతం సవాళ్లు ఎదుర్కొంటోంది. తక్కువ వడ్డీ రేట్లకు ఎక్కువగా రుణాలివ్వడం, అధిక శాతం డిపాజిట్లకు బీమా భద్రత లేకపోవడం వంటి అంశాల కారణంగా బ్యాంకుపై డిపాజిటర్లలో నమ్మకం సన్నగిల్లింది. ఫలితంగా బిలియన్ల కొద్దీ డాలర్ల విత్‌డ్రాయల్స్ వెల్లువెత్తాయి. ఒక దశలో ఫస్ట్ రిపబ్లిక్‌కి సహాయం చేసేందుకు ఇతర బ్యాంకులు కూడా ముందుకు వచ్చినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో గత వారాంతంలో భేటీ అయిన అమెరికా నియంత్రణ సంస్థలు పరిష్కార మార్గాన్ని అమలు చేశాయి.

ఏప్రిల్‌లో పెరిగిన ఇంధన డిమాండ్

7.15 మిలియన్ టన్నులకు డీజిల్ అమ్మకాలు; 6.7 శాతం అప్



న్యూఢిల్లీ: రబీ పంటల కోత పనులు ప్రారంభం కావడం, ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం వంటి అంశాల దన్నుతో ఏప్రిల్‌లో ఇంధనాలకు డిమాండ్ పెరిగింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే డీజిల్ అమ్మకాలు 6.7% పెరిగి 7.15 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. నెలవారీగా చూస్తే మార్చితో పోల్చినప్పుడు 4.8% వృద్ధి నమోదైంది. సోమవారం వెలువడిన గణాంకాల ప్రకారం.. పెట్రోల్ అమ్మకాలు ఏప్రిల్‌లో వార్షికంగా 2.5% పెరిగి 2.64 మిలియన్ టన్నులకు చేరగా, నెలవారీగా మాత్రం స్వల్పంగా 0.5% మేర తగ్గాయి. రబీ పంటల కోతకు ట్రాక్టర్లను ఉపయోగిస్తుండటం వల్ల డీజిల్ వినియోగం పెరుగుతుంది.

ఫ్యాప్సీలో లలితా జ్యువెల్లరి చైర్మన్‌కు ఘన సత్కారం



విశాఖపట్నం: లలితా జ్యువెల్లరి చైర్మన్ ఎం.కిరణ్ కుమార్‌ను ఏపీ మంత్రులు ఘనంగా సత్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్(ఫ్యాప్సీ) ఎక్సలెన్స్ అవార్డుల లాంచింగ్ కార్యక్రమం విశాఖపట్నంలో జరిగింది. ఈ సందర్భంగా మొత్తం 11 రంగాలలో రాణించిన వారికి ఫ్యాప్సీ ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. 2023 నుంచి 2033 వరకు పదేళ్ల కాలానికి అగ్రి, ఆక్వా ఆధారిత పరిశ్రమల్లో ఎక్సలెన్స్‌ను నెలకొల్పినందుకుగానూ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్‌లు కిరణ్‌కుమార్‌కు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, ఫ్యాప్సీ అధ్యక్షుడు కరుణేంద్ర జాస్తి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ గురుకులాల్లో 434 లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ-రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ).. తెలంగాణ సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థ(పాఠశాలలు)ల్లో డైరెక్ట్ ప్రాతిపదికన లైబ్రేరియన్(స్కూల్స్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 434

సొసైటీల వారీగా ఖాళీలు

» తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు–54.
» మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–180.
» తెలంగాణ మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలు–200.
» **అర్హత:** డిగ్రీతోపాటు లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష(పేపర్–1, పేపర్–2), సర్టిఫికేట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **వెబ్‌సైట్:** www.treirb.telangana.gov.in

రాయలసీమ యూనివర్శిటీలో 26 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు

కర్నూలులోని రాయలసీమ యూనివర్శిటీ, కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాలు/సబ్జెక్టుల్లో తాత్కాలిక ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 26
» **సబ్జెక్టులు/స్పెషలైజేషన్:** సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇంగ్లిష్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు బోధన /పరిశోధనానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్–2023/యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్ 2023 స్కోరు, స్క్రీనింగ్ టెస్ట్, సెమినార్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.05.2023.
» **వెబ్‌సైట్:** www.rayalaseemauniversity.ac.in

గణాంక శాస్త్రం..ఘనమైన కొలువు

» ఐఈఎస్, ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ విడుదల
» ఎకనామిక్స్‌లో పీజీ, స్టాటిస్టిక్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ పీజీ అర్హత
» మొత్తం 51 పోస్టులకు రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఎకనామిక్ సర్వీస్.. ఐఈఎస్‌గా సుపరిచితం! ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్.. సంక్షిప్తంగా ఐఎస్ఎస్!! ఈ రెండు సర్వీసుల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారు మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్; అలాగే కేంద్ర ఆర్థిక శాఖలో జూనియర్ టైమ్ స్కేల్‌తో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్, కెరీర్ స్కోప్ తదితర వివరాలు..

రెండు సర్వీసుల్లో.. 51 పోస్టులు

ఐఈఎస్/ఐఎస్ఎస్–2023 నోటిఫికేషన్ ద్వారా.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 33 పోస్టులను భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఐఈఎస్ అభ్యర్థులు ఎకనామిక్స్ లేదా అప్లైడ్ ఎకనామిక్స్ లేదా బిజినెస్ ఎకనామిక్స్ లేదా ఎకనోమెట్రిక్స్ స్పెషలైజేషన్లతో పీజీ ఉత్తీర్ణత సాధించాలి.
- ఐఎస్ఎస్ అభ్యర్థులు స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒక సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత(లేదా) స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లైడ్ స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ ఏడాది చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

- ఆగస్ట్ 1, 2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి(ఆగస్ట్ 2,1993–ఆగస్ట్ 1, 2002 మధ్యలో జన్మించి ఉండాలి).
- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఇస్తారు.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

యూపీఎస్సీ.. ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండంచెలుగా ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్టుకు 2.5 నిష్పత్తిలో తదుపరి దశలో పర్సనల్ ఇంటర్వ్యూకు పిలుస్తారు. రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో పొందిన మార్కుల ఆధారంగా నియామకాలు ఖరారు చేస్తారు.

రాత పరీక్షలు.. వేర్వేరుగా

- ఐఈఎస్, ఐఎస్ఎస్‌లకు సంబంధించి ఉమ్మడి నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ.. రాత పరీక్షలు మాత్రం రెండు సర్వీసులకు వేర్వేరుగా ఉంటాయి.
- ఐఈఎస్ రాత పరీక్షను ఆరు పేపర్లుగా వేయి మార్కులకు నిర్వహిస్తారు. అవి..
- పేపర్–1 జనరల్ ఇంగ్లిష్ 100 మార్కులు; పేపర్–2 జనరల్ స్టడీస్ 100 మార్కులు; పేపర్–3 జనరల్ ఎకనామిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 జనరల్ ఎకనామిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 జనరల్ ఎకనామిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 ఇండియన్ ఎకనామిక్స్ 200 మార్కులు. ఇలా మొత్తం 1,000 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఐఈఎస్ పరీక్ష పేపర్లన్నీ పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలోనే ఉంటాయి.
- పరీక్షకు కేటాయించిన సమయం 3 గంటలు.

ఐఎస్ఎస్‌కు ఇలా

- ఐఎస్ఎస్ రాత పరీక్షలోనూ ఆరు పేపర్లు ఉంటాయి. వేయి మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఐఈఎస్‌తో పోల్చితే.. ఐఎస్ఎస్ రాత పరీక్ష కొంత భిన్నంగా ఉంటుంది. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలతో ఆయా పేపర్లు ఉంటాయి.
- పేపర్–1 జనరల్ ఇంగ్లిష్–100 మార్కులు; పేపర్–2 జనరల్ స్టడీస్–100 మార్కులు; పేపర్–3 స్టాటిస్టిక్స్–1, 200 మార్కులు; పేపర్–4 స్టాటిస్టిక్స్–2, 200 మార్కులు; పేపర్–5 స్టాటిస్టిక్స్–3, 200 మార్కులు; పేపర్–6 స్టాటిస్టిక్స్–4, 200 మార్కులు; మొత్తం మార్కులు 1000.
- స్టాటిస్టిక్స్–1, స్టాటిస్టిక్స్–2 పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. వీటిలో 80 చొప్పున ప్రశ్నలు ఉంటాయి. వీటికి కేటాయించిన సమయం రెండు గంటలు. మిగతా పేపర్లకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- స్టాటిస్టిక్స్–3, 4 పేపర్లు డిస్క్రిప్టివ్ విధానంలోనే నిర్వహిస్తున్నప్పటికీ.. వీటిలో షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్, స్మాల్ ప్రాబ్లమ్ కొశ్చన్స్ ఉంటాయి. మొత్తం ప్రశ్నల్లో ఈ తరహా ప్రశ్నలు 50 శాతం మేరకు ఉంటాయి. మరో 50 శాతం ప్రశ్నలు దీర్ఘ సమాధాన ప్రశ్నలు, కాంప్రహెన్షన్ ప్రాబ్లమ్ ప్రశ్నలుగా ఉంటాయి.
- స్టాటిస్టిక్స్ పేపర్–4లో మొత్తం ఏడు సెక్షన్లలో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఛాయిస్ విధానంలో ఏదైనా రెండు సెక్షన్లు ఎంచుకుని.. ఆ రెండు సెక్షన్లలోనే పరీక్ష రాసే అవకాశం ఉంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

ఎంపిక ప్రక్రియలో చివరి దశ..పర్సనల్ ఇంటర్వ్యూ. తొలిదశ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, పోస్టుల సంఖ్య, రిజర్వేషన్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. ఇందులో చోటు సంపాదించిన వారికి మలిదశలో 200 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులోనూ ప్రతిభ కనబరిస్తే.. రాత పరీక్షలో మార్కులు, పర్సనల్ ఇంటర్వ్యూ మార్కులను క్రోడీకరించి తుది విజేతలను ఖరారు చేసి.. ఆయా సర్వీసులకు ఎంపిక చేస్తారు.

విజయానికి అడుగులు ఇలా

ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షల్లో విజయం సాధించడానికి అభ్యర్థులు ప్రధానంగా.. పీజీ స్థాయి పుస్తకాలను చదవడం ఎంతో ఉపకరిస్తుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్లు, మోడల్ పేపర్ల సాధన కూడా సత్ఫలితాలకు దోహదం చేస్తుంది.

జనరల్ ఇంగ్లిష్

రెండు సర్వీసులకు ఉమ్మడిగా ఉండే పేపర్ ఇది. ఇందులో ప్రశ్నల క్లిష్టత బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఉంటుంది. మంచి మార్కుల సాధనకు వొకాబ్యులరీని, రీడింగ్ కాంప్రహెన్షన్ టెక్నిక్స్‌ను పెంచుకోవాలి. ఇంగ్లిష్‌లో ఎక్కువగా ప్యాసేజ్ రైటింగ్, ప్రెసిస్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ స్టడీస్

రెండు సర్వీసుల అభ్యర్థులకూ ఉండే మరో పేపర్.. జనరల్ స్టడీస్. ఇందులో అధిక శాతం ప్రశ్నలు.. కరెంట్ ఈవెంట్స్, జనరల్ నాలెడ్జ్ నుంచి అడుగుతున్నారు. ఇందులో రాణించేందుకు తాజా పరిణామాలతోపాటు శాస్త్రసాంకేతిక రంగం, భారత రాజ్యాంగం, భారతదేశ చరిత్ర, జాగ్రఫీలపై పట్టు సాధించాలి. అభ్యర్థులు సివిల్స్ జనరల్ స్టడీస్ పేపర్లు, ప్రిలిమ్స్ పేపర్లు అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది.

ఐఈఎస్ సబ్జెక్ట్ పేపర్లకు ఇలా

జనరల్ ఎకనామిక్స్–1

సూక్ష్మ అర్థశాస్త్రం, మ్యాథమెటిక్స్, స్టాటిస్టికల్ ఎకనోమెట్రిక్ మెథడ్స్‌పై పట్టు సాధించాలి. సూక్ష్మ అర్థశాస్త్రానికి సంబంధించి వినియోగదారుని డిమాండ్ సిద్ధాంతం, ఉత్పత్తి సిద్ధాంతం, విలువ, పంపిణీ అంశాలు తెలుసుకోవాలి. అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉండే ఈ పేపర్ కోసం లారెంజ్ వక్ర రేఖ, ఏంజెల్ సూత్రం, షాడో ప్రైస్, పారెటో పంపిణీ సిద్ధాంతం, స్వల్ప కాల–దీర్ఘకాల వ్యయ రేఖలు తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ ఎకనామిక్స్–2

స్థూల అర్థశాస్త్రం, ఎకనామిక్స్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ ప్లానింగ్, అంతర్జాతీయ అర్థశాస్త్రం తదితర అంశాల కలయికగా ఉండే ఈ పేపర్ కోసం ప్రతి అంశాన్ని వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ చదువుకోవాలి. జాతీయాదాయం కొలమానం, గ్రీన్ నేషనల్ ఇన్‌కమ్, సంప్రదాయ ఉద్యోగితా సిద్ధాంతం, ఫిలిప్స్ రేఖ, ద్రవ్యరాశి సిద్ధాంతం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రపంచ వాణిజ్య సంక్షోభాలు–కారణాలు, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐఎంఎఫ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల తాజా కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఎకనామిక్స్–3

ఈ పేపర్ ప్రభుత్వ విత్త శాస్త్రం, పర్యావరణ అర్థశాస్త్రం, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాల సమ్మిళితంగా ఉంటుంది.ఇందులో మంచి మార్కుల కోసం పన్ను సంస్కరణలు, గరిష్ట సాంఘిక ప్రయోజన సిద్ధాంతం, ప్రభుత్వ వ్యయ సిద్ధాంతం, గ్రీన్ జీడీపీ, క్యోటో ప్రోటోకాల్, బాలి యాక్షన్ ప్లాన్, ఇండస్ట్రియల్ ఎకనమిక్స్ అంశాలపై అవగాహన పొందాలి.

ఇండియన్ ఎకనామిక్స్

సిలబస్‌లోని ముఖ్యాంశాలను వర్తమాన పరిస్థితులకు అన్వయిస్తూ నోట్స్ రూపొందించుకోవాలి. దీన్ని పదే పదే చదవాలి. అలాగే స్థిరీకరణ–నిర్మాణాత్మక సర్దుబాటు ప్యాకేజీ, విత్తరంగ సంస్కరణలు, నీతి ఆయోగ్ సిఫార్సులు, టోకు ధరల సూచీ–రిటైల్ ధరల సూచీ, భారత ద్రవ్య మార్కెట్, ఎఫ్‌డీఐ, డిజిన్వెస్ట్‌మెంట్ పాలసీ తదితర తాజా అంశాలపై దృష్టి సారించాలి.

ఐఎస్ఎస్ సబ్జెక్ట్ పేపర్లకు ఎలా

స్టాటిస్టిక్స్–1

ఈ పేపర్‌లో రాణించాలంటే..పలు సిద్ధాంతాలపై పట్టు సాధించాలి. స్టాటిస్టికల్ మెథడ్స్, న్యూమరికల్ అనాలిసిస్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.

స్టాటిస్టిక్స్–2

ఈ పేపర్‌లో లీనియర్ మోడల్స్, ఎస్టిమేషన్, హైపోథిసిస్ టెస్టింగ్, మల్టీవెరైటీ అనాలిసిస్(ఎస్టిమేషన్ ఆఫ్ మీన్ వెక్టార్ అండ్ కో వేరియన్స్ మ్యాట్రిక్స్ తదితర) అంశాలపై దృష్టిసారించాలి.



యూపీఎస్సీ ఎగ్జామ్స్

స్టాటిస్టిక్స్–3

శాంప్లింగ్ టెక్నిక్స్, ఎకనామిక్ సాటిస్టిక్స్, డిజైన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంట్స్, ఎకనోమెట్రిక్స్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

స్టాటిస్టిక్స్–4

- స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్, డెమోగ్రఫీ అండ్ వైటల్ ఛార్ట్స్, కంప్యూటర్ సిస్టమ్–సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వంటి కంప్యూటర్ సంబంధ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- డేటా ఆధారిత అంశాలు అధికంగా ఉండే స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ పేపర్లలో మంచి స్కోర్ చేయాలంటే.. వేగంతోపాటు కచ్చితత్వం, సునిశిత పరిశీలన అవసరం. ప్రిపరేషన్ సమయంలోనే ప్రతి అంశాన్ని నిర్దిష్ట కాలపరిమితి విధించుకుని చదవాలి. ముఖ్యంగా ఆయా సిద్ధాంతాలు..వాటిని వినియోగించి డేటా రూపకల్పన, ఛార్ట్స్, గ్రాఫ్స్ రూపకల్పన వంటి అంశాలపై పట్టు సాధించాలి.

జూనియర్ టైమ్ స్కేల్

ఐఈఎస్, ఐఎస్ఎస్‌లకు ఎంపికైన వారికి జూనియర్ టైమ్ స్కేల్ హోదాతో కెరీర్ ప్రారంభమవుతుంది. ఆర్థిక వ్యవహారాల సంబంధ శాఖల్లో అసిస్టెంట్ డైరెక్టర్, రీసెర్చ్ ఆఫీసర్ కొలువు లభిస్తుంది. నీతి ఆయోగ్, నేషనల్ శాంపుల్ సర్వే, లేబర్ బ్యూరో, ఆర్థిక సంఘం, గ్రామీణాభివృద్ధి, విద్య, వ్యవసాయం, వాణిజ్యం తదితర విభాగాల్లో నియమిస్తారు. అనుభవం, పనితీరు ఆధారంగా డిప్యూటీ డైరెక్టర్/అసిస్టెంట్ అడ్వైజర్(సీనియర్ టైం స్కేల్), జాయింట్ డైరెక్టర్/డిప్యూటీ అడ్వైజర్, సీనియర్ ఎకనమిక్ అడ్వైజర్ తదితర హోదాల నుంచి అత్యున్నత స్థాయి ప్రిన్సిపుల్ అడ్వైజర్ లేదా చీఫ్ అడ్వైజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** మే 9, 2023
- **దరఖాస్తు సవరణ అవకాశం:** మే 10–మే 16
- **పరీక్ష తేదీ:** జూన్ 23 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తు, పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https//www.upsconline.nic.in, https://www.upsc.gov.in

క్లుప్తంగా...

జీఎస్టీ వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డ్

ఏప్రిల్‌లో రూ.1.87లక్షల కోట్లు వసూలు



సాక్షి, న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో ఆల్‌టైమ్ రికార్డు నమోదైంది. ఏప్రిల్ నెలలో వసూళ్లు రికార్డు సాధించాయి. ఏప్రిల్‌లో సేకరించిన జీఎస్టీ ఆదాయం 1,87,035కోట్లుగా ఉందని ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. గత ఏడాది ఏప్రిల్ గణాంకాలతో పోలిస్తే ఇది రూ.19,495 కోట్లు అధికమని తెలిపింది. ఏప్రిల్ వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ రూ.38,440 కోట్లు, రాష్ట్ర జీఎస్టీ రూ. 47,412 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూ. 89,158 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన మొత్తం రూ.34,972 కోట్లతో కలిపి), సెస్ రూ.12,025 కోట్లు (వస్తువుల దిగుమతిపై సేకరించిన రూ.901 కోట్లతో కలిపి) ఉందని తెలిపింది. ఈ ఏప్రిల్ ఆదాయం గతేడాది కన్నా 12%ఎక్కువగా ఉందని పేర్కొంది.

తెలంగాణలో 13శాతం అధిక వసూళ్లు.. ఏపీలో 6శాతం..

ఇక జీఎస్టీ వసూళ్లలో రెండు తెలుగు రాష్ట్రాలు గణనీయ వృద్ధిని సాధించినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. తెలంగాణలో గత ఏడాది ఏప్రిల్‌లో రూ.4,955 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు 13 శాతం మేర పెరిగి రూ.5,622 కోట్లుగా ఉందని వెల్లడించింది. ఏపీలో జీఎస్టీ వసూళ్లు గత ఏప్రిల్‌లో రూ.4,067కోట్లు ఉండగా, అది ఈ ఏడాది 6శాతం మేర పెరిగి రూ.4,329 కోట్లకు చేరిందని తెలిపింది.

15 నుంచి 31 వరకు సీఎం కప్ పోటీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులలో ఉన్న ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో ఈనెల 15 నుంచి 31 వరకు మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న సీఎం కప్‌కు కార్యాచరణ సిద్ధం చేయాలని క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అధికారులను కోరారు. సోమవారం నూతన బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్–2న విజేతలకు సీఎం కప్ క్రీడా ట్రోఫీలు అందించాలని అధికారులను కోరారు.

పోటీలివే..: మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడలు.. జిల్లా స్థాయిలో వీటితో పాటు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, బ్యాక్సింగ్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటు క్రికెట్‌ను కూడా పరిశీలించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలోపై క్రీడలతోపాటు షూటింగ్, జిమ్నాస్టిక్స్, ఆర్చరీస్టిక్స్, ఆర్చరీ, హాకీ, టిబుల్ టెన్నిస్ క్రీడలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు.



రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్‌గా కోరం అశోకొరెడ్డి సోమవారం బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు.

లాట్ మొబైల్స్‌లో ఇక ఏసీలూ విక్రయం

కేవలం 90 నిమిషాల్లో హోమ్ డెలివరీ



సాక్షి, హైదరాబాద్: తెలుగురాష్ట్రాల్లో మొబైల్ ఫోన్ల విక్రయాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్న లాట్ మొబైల్స్ సంస్థ తన స్టోర్స్‌లో ఏసీల విక్రయం ప్రారంభించింది. ప్రముఖ కంపెనీలతో పాటు వివిధ బ్రాండ్లకు చెందిన ఏసీలను అమ్ముతున్నట్లు అధీకృత ప్రతినిధి ఎం.అఖిల్ ప్రకటించారు. తమ వద్ద ఏసీ ఖరీదు చేసిన వారికి కేవలం 90 నిమిషాల్లోనే హోమ్ డెలివరీ చేసే సదుపాయం ఉందని చెప్పారు. తమ దగ్గర ఏసీ కొనుగోలుపై 45 శాతం వరకు తగ్గింపు, 20 శాతం వరకు క్యాష్ బ్యాక్ సహా అనేక ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయని సంస్థ వెల్లడించింది.

రాష్ట్రంలో కొత్తగా 41 కరోనా కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం 4,859 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో 41 మంది వైరస్ బారినపడ్డారు. దీంతో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 8.43 లక్షలకు చేరింది. ప్రస్తుతం 318 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతుండగా.. 54 మంది కరోనా నుంచి కోలుకున్నట్లు అధికారులు తెలిపారు.



సూటి పెట్టి.. లాగి కొట్టి..

మంత్రి ఎర్రబెల్లి కాసేపు బాల్యంలోకి వెళ్లిపోయారు. పిల్లల్లో పిల్లాడిలా మారిపోయి కాసేపు గోలీలాడారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లిలో ఓ కార్యక్రమానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం హాజరయ్యారు. అలాగే స్థానిక పాఠశాల సందర్శనకూ వెళ్లారు. అక్కడ పిల్లలు గోలీలు ఆడుకుంటుండగా చూసి.. వారిలో కలిసిపోయారు. గోలీ చేతపట్టుకుని సూటి పెట్టి.. గురితప్పకుండా లాగి కొట్టడంతో పిల్లలంతా సంబరంలో మునిగిపోయారు. మంత్రి సైతం వారితో ఆటవిడుపుగా కాసేపు గడిపారు.

–దేవరుప్పుల

మెట్టెలు, మంగళసూత్రాలు.. 120 జంటలు



కొత్తగూడెంరూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వల్మీక వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 120 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. వేడుకకు హాజరైన 7వేల మందికి భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. స్వామివారి కల్యాణం సందర్భంగా గ్రామానికి చెందిన కొండపల్లి సాయిగోపాల్, సుజాత, గుంటూరు రమాదేవి ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా సామూహిక వివాహాలు జరిపిస్తున్నారు. కొత్త జంటలకు పట్టు వస్త్రాలతో పాటు వధువుకు మెట్టెలు, మంగళసూత్రాలు అందజేశారు. ఒకే వేదికలో జరిగిన 120 జంటల వివాహ వేడుకలను తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ వేడుకకు ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తరపున ఆయన క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి హాజరై, పట్టు వస్త్రాలు అందజేశారు.

ప్రాణులకు ప్లాస్టికోసిస్ ముప్పు

- ఆస్ట్రేలియా తీరంలోని పక్షుల్లో గుర్తించిన శాస్త్రవేత్తలు
- హవాయి ద్వీపంలో ఏటా 2.50 లక్షల అల్‌బట్రాస్ పక్షి పిల్లల దుర్మరణం
- దీనిని 'ప్లాస్టికోసిస్' వ్యాధిగా పేర్కొన్న నేచురల్ హిస్టరీ మ్యూజియం
- మనుషుల జీర్ణవ్యవస్థలోనూ మైక్రోప్లాస్టిక్ కణాల గుర్తింపు

ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చే వ్యాధిగా తొలిసారి గుర్తింపు



సాక్షి, అమరావతి: మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్లాస్టిక్.. సముద్ర పక్షులను సైతం పొట్టన పెట్టుకుంటోంది. సముద్ర జలాల్లోకి చేరుతున్న చిన్నచిన్న ప్లాస్టిక్ ముక్కలను ఆహారంగా భావించి తింటున్న పక్షులు మూకుమ్మడిగా మరణిస్తున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇటీవల ఆస్ట్రేలియా సమీపంలోని లార్డ్ హోవ్ ద్వీపంలో బ్రౌన్ సీగల్స్‌పై అధ్యయనం చేసి.. మరణించిన పక్షుల శరీరాలను పరీక్షించగా కడుపులో ప్రమాదకరమైన స్థాయిలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు తేలింది. అక్కడి ద్వీపంలోని 90 శాతం పక్షుల్లో ప్లాస్టిక్ ఆనవాళ్లు ఉన్నట్టు తేల్చారు. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం శాస్త్రవేత్తలు ఈ పరిస్థితికి 'ప్లాస్టికోసిస్' వ్యాధిగా నామకరణం చేశారు. వర్తమాన ప్రపంచంలో ప్లాస్టిక్ ద్వారా వచ్చే సమస్యకు పేరు పెట్టడం ఇదే తొలిసారి. ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజు దాదాపు 8 మిలియన్ ప్లాస్టిక్ ముక్కలు సముద్రాల్లోకి చేరుతున్నాయని, అందులో ఎక్కువ భాగం సముద్ర పక్షులు ఆహారంగా తీసుకున్నప్పుడు వాటి జీర్ణవ్యవస్థను నాశనం చేసి మరణానికి దారి తీస్తున్నట్టు తేల్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న పక్షులు చూడ్డానికి ఆరోగ్యంగా కనిపించినా తక్కువ కాలంలోనే జీర్ణ వ్యవస్థ పనిచేయక చనిపోతున్నట్టు నేచురల్ హిస్టరీ మ్యూజియం జీవశాస్త్రవేత్త అలెక్స్ బాండ్ ప్రకటించారు.

తరుణోపాయం ఇదొక్కటే

ప్లాస్టిక్ విచ్చలవిడి వినియోగం భవిష్యత్‌లో మరింత ప్రమాదకారిగా మారుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో–ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ)–2022 నివేదిక ప్రకారం మనం వినియోగిస్తున్న ప్లాస్టిక్‌లో కేవలం 9 శాతం మాత్రమే రీసైకిల్ చేస్తున్నట్టు తేలింది. ఇప్పటివరకు ఉత్పత్తి చేసిన 10 బిలియన్ టన్నుల ప్లాస్టిక్‌లో దాదాపు 6 బిలియన్ టన్నులు భూమిని, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నట్టు తేల్చారు. సాధ్యమైన మేర ప్లాస్టిక్‌ను వాడకపోవడమే ఉత్తమమని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ ప్రభుత్వాలు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్లు, కట్లర్లు, స్ట్రాలు, బెలూన్ స్టిక్స్, కాటన్ బడ్స్‌ను పూర్తిగా నిషేధించాయి. గతేడాది 175 దేశాలు 2024 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడానికి చట్టబద్ధమైన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. భారతదేశంలో సైతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించారు. అయినప్పటికీ మార్కెట్‌లో దాని వినియోగం మాత్రం తగ్గలేదు.

ప్లాస్టికోసిస్ అంటే..



పక్షులు ఆహారంగా భావించి తింటున్న ప్లాస్టిక్ వాటి జీర్ణ వ్యవస్థను దెబ్బతీసి ప్రాణాలను హరిస్తోంది. ఇది పక్షి కడుపులోని గ్రంథులను, జీర్ణ ప్రక్రియను నాశనం చేసి మరణానికి చేరువ చేస్తోందని శాస్త్రవేత్తలు తేల్చారు. ఈ మొత్తం ప్రక్రియకు 'ప్లాస్టికోసిస్'గా పేరు పెట్టారు. హవాయి ద్వీపంలోని అల్‌బట్రాస్ పక్షులు కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు తిని మరణిస్తున్నాయని, ఏటా 2.50 లక్షల అల్‌బట్రాస్ పక్షి పిల్లలు ఇలా ప్రాణాలు కోల్పోతున్నాయని గుర్తించారు. ఈ తరహా లక్షణాలు చాలా సముద్ర జంతువులు, జీవుల్లో కూడా కనిపించాయని పేర్కొన్నారు. ప్లాస్టికోసిస్ లక్షణాలు మానవుల్లోనూ కనిపించాయని, ఇటీవల ఆస్ట్రేలియాలో 52 మంది ప్రేగుల్లో మైక్రోప్లాస్టిక్ కణాలను గుర్తించడంతో శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆకలి మందగించడంతో పాటు ఇతర పరాన్నజీవులు శరీరంలోకి ప్రవేశించి మరణానికి దారితీయవచ్చని చెబుతున్నారు.

1,200కు పైగా జీవుల ఉనికి ప్రశ్నార్థకం



లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియం నుంచి వెళ్లిన శాస్త్రవేత్తల బృందం ఆస్ట్రేలియాకు 600 మైళ్ల దూరంలోని లార్డ్‌హోవ్ ద్వీపంలో పక్షుల మరణాలపై అధ్యయనం చేపట్టింది. అక్కడ డజన్లకొద్దీ చనిపోయి పడి ఉన్న బ్రౌన్ సీగల్స్ పక్షుల కళేబరాలను ల్యాబ్‌లో పరీక్షించి ఒక్కో పక్షి కడుపులో దాదాపు 200కు పైగా ప్లాస్టిక్ ముక్కలను వెలికితీశారు. ఈ తరహా ప్లాస్టిక్ ముక్కలు కేవలం సముద్ర పక్షులనే కాకుండా దాదాపు 1200కు పైగా సముద్ర జీవుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నట్టు గుర్తించారు. వాస్తవానికి 5 మి.మీ. కంటే చిన్న పరిమాణంలో ఉండే ప్లాస్టిక్ ముక్కలు జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తున్నట్టు రెండేళ్ల క్రితం ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో తేలింది. కానీ.. బయట వాతావరణంలో ఇలాంటి జబ్బును లార్డ్ హోవ్ ద్వీపంలోనే మొదటిసారి గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. పైగా.. జీవించి ఉన్న చాలా పక్షులు బరువు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వాస్తవానికి 2010లోనే ఈ పక్షులు తక్కువ బరువు ఉన్నట్టు గుర్తించినా కారణాలను మాత్రం అంచనా వేయలేకపోయారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన పరిశోధనల ప్రకారం వాటి కడుపులోని ప్లాస్టిక్ ముక్కలు జీర్ణం కాకపోవడం వల్లనే అవి ఆహారం తీసుకోవడం లేదని, ఫలితంగా రోజుల వ్యవధిలోనే మరణిస్తున్నట్టు గుర్తించారు.

'పెండింగ్'కు 'మధ్యవర్తిత్వం' చక్కటి పరిష్కారం

భరించలేని భారమైతే వ్యవస్థ దెబ్బతింటుంది

- హైకోర్టు జడ్జిలు.. మీడియేషన్‌ను ప్రోత్సహించాలి
- 'మధ్యవర్తిత్వం'పై చర్చలో హైకోర్టు సీజే



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జస్టిస్ నవీన్‌రావు

సాక్షి, హైదరాబాద్: భరించలేనంత భారం మోపితే ఏ వ్యవస్థ అయినా దెబ్బతింటుందని.. ఆ ఒత్తిడి తగ్గించేందుకు ప్రత్యామ్నాయం అవసరం అని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో వివాద పరిష్కారంలో మధ్యవర్తిత్వం అమలు విధానంపై చర్చా కార్యక్రమాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ నవీన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడు రోజులు జరగనుంది. ఈ సందర్భంగా జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మాట్లాడుతూ.. 'ఏటికేడు పెరిగిపోతున్న పెండింగ్ కేసులతో న్యాయవ్యవస్థపై విపరీత భారం పడుతోంది. న్యాయమూర్తులపై కూడా తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. దీనికి చక్కని పరిష్కారమే 'మధ్యవర్తిత్వం' అని వెల్లడించారు.

అవగాహన పెంచుకోవాలి..: 'హైకోర్టు న్యాయమూర్తులు కూడా మధ్యవర్తిత్వ విధానంపై మరింత అవగాహన పెంచుకోవాలి. దేశంలో దాదాపు 5 కోట్లు, రాష్ట్రంలో 10 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రోజూ ఎన్ని కేసులు పరిష్కరిస్తున్నారో.. అంతకు రెట్టింపు స్థాయిలో నమోదవుతున్నాయి. ఇక ప్రజలకు సత్వర న్యాయం ఎలా అందుతుంది? ఈ పరిస్థితులను అధిగమించేందుకు మధ్యవర్తిత్వం తోడ్పడుతుంది.' అని జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. 'జిల్లాస్థాయిల్లోనూ మీడియేషన్ సెంటర్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నాం. కుటుంబ వివాదాలు, భూ సమస్యలు, భార్యభర్తల గొడవలకు అక్కడే పరిష్కారం చూపిస్తే.. పెండింగ్ కేసుల భారం తగ్గే అవకాశం ఉంది' అని జస్టిస్ నవీన్‌రావు అభిప్రాయపడ్డారు. సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ చైర్మన్ జార్జి లిమ్ వర్చువల్‌గా మాట్లాడారు. అనంతరం జస్టిస్ చిల్లకూర్ సుమలత, జస్టిస్ అనుమప చక్రవర్తి, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి, జస్టిస్ వినోద్‌కుమార్‌లు అడిగిన ప్రశ్నలకు జస్టిస్ లావు నాగేశ్వర్‌రావు, జార్జి లిమ్ సమాధానం చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి(జడ్జి) గోవర్ధన్‌రెడ్డి, జడ్జి రాధిక, హైకోర్టు రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

అధిక పెన్షన్ ఆప్షన్‌కు రేపే ఆఖరు!

- సాంకేతిక అంశాలపై దరఖాస్తుదారుల్లో ఇంకా అయోమయమే
- పెన్షన్ ఫార్ములా తేలక దరఖాస్తులో కొందరి వెనుకబాటు
- గడువు పెంపు కోసం క్షేత్రస్థాయి నుంచి భారీగా వినతులు
- ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోని ఈపీఎఫ్‌ఓ

E.P.F

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) చందాదారులకు అధిక పెన్షన్ ఆప్షన్ గడువు ఈనెల 3వ తేదీతో ముగుస్తోంది. కానీ ఇప్పటికీ వెబ్‌సైట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్యలు తీరలేదు. అధిక పెన్షన్ అర్హత అవకాశాలు, అధిక పెన్షన్ లెక్కింపు సూత్రం తేలలేదు. కొత్త పాస్‌బుక్ డౌన్‌లోడ్‌కు ఇబ్బందులు తప్పడం లేదు.ఈ అంశాలను ఈపీఎఫ్‌ఓ అధికారులకు విన్నవించినా స్పందన లేదు. చాలా మంది చందాదారులు అధిక పెన్షన్‌కు దరఖాస్తు సైతం చేసుకోలేని పరిస్థితి నెలకొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈపీఎఫ్‌ఓ అధిక పెన్షన్‌కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ చేపట్టిన విషయం తెలిసిందే. తొలుత ఆప్షన్ ఇచ్చేందుకు మార్చి 3 వరకు గడువు పెట్టగా.. తర్వాత చందాదారుల విజ్ఞప్తులు, సాంకేతిక కారణాల నేపథ్యంలో గడువును మే3 వరకు పొడిగించింది.

పాస్‌బుక్.. ఎర్రర్..

పీఎఫ్ ఖాతాదారుల కోసం ఈపీఎఫ్‌ఓ సరికొత్త పాస్‌బుక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉద్యోగి సర్వీసులో చేరిన తేదీ, నాటి బేసిక్, డీఏ ఆధారంగా పీఎఫ్ చెల్లింపులు, సర్వీసు, మార్పులు, చేర్పులకు సంబంధించిన పలు అంశాలను జోడిస్తూ ఈ పాస్‌బుక్‌ను అప్‌డేట్ చేసింది. దాదాపు నెలన్నర నుంచి కొత్త పాస్‌బుక్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. చందాదారులు యూఏఎన్ నంబర్ ద్వారా లాగిన్ అయి.. కొత్త పాస్‌బుక్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. కానీ చాలామంది చందాదారులకు లాగిన్ అయ్యాక పాస్‌బుక్ డౌన్‌లోడ్ ఆప్షన్ ఎంచుకుంటే వెబ్‌పేజీ ఎర్రర్ వస్తోంది. చాలాసార్లు ప్రయత్నించినా డౌన్‌లోడ్ కావడం లేదు. అధిక పెన్షన్‌లో కీలకమైంది ఈపీఎస్ (ఎంప్లాయి పెన్షన్ స్కీం) చెల్లింపునకు సంబంధించిన సమాచారమే. ఉద్యోగి పొందుతున్న పూర్తిస్థాయి వేతనానికి అనుగుణంగా ఈపీఎస్ చెల్లించిన వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒకవేళ చెల్లింపుల్లో తేడాలుంటే అందుకు సంబంధిత కంపెనీ బాధ్యత వహించి చెల్లింపులు సర్దుబాటు చేయాలి. కొత్త పాస్‌బుక్‌లు డౌన్‌లోడ్ కాకపోవడంతో.. చాలామంది అధికపెన్షన్ దరఖాస్తు చేయలేకపోతున్నారు.

ఎన్నో సమస్యలు

మరోవైపు పేరా 26(6) ఆప్షన్ ఫారం (ఉద్యోగంలో చేరినప్పుడు అధిక పెన్షన్ ఆప్షన్ ఎంపిక పత్రం)ను ఇప్పుడు అధిక పెన్షన్ దరఖాస్తుకు తప్పకుండా జోడించాలని నిబంధన పెట్టారు. ఉద్యోగంలో చేరి చాలా ఏళ్ల గడిచిన వారికి ఈ ఫారం అందుబాటులో లేక దరఖాస్తు చేసుకోలేదు. వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తున్న సమయంలోనూ సాంకేతిక సమస్యలతో మొరాయిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనిపై ఈపీఎఫ్‌ఓ అధికారులకు చాలా ఫిర్యాదులు వస్తున్నాయి. దరఖాస్తులకు మరింత సమయం ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది. ఈపీఎఫ్‌ఓ మాత్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

సీపీజీఈటీ–2023 నోటిఫికేషన్ విడుదల

12 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు కాకతీయ, శాతావాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్‌టీయూ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ (సీపీజీఈటీ–2023) విడుదలైంది. వివిధ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, సోషల్‌సైన్స్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ కామన్ ఎంట్రన్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. జూన్ చివరి వారంలో జరిగే ప్రవేశ పరీక్షలకు మే 12 నుంచి జూన్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి, సీపీజీఈటీ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు.

రవ్వా శ్రీహరి రచనలు భావి తరాలకు అందిస్తాం

సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు



సాక్షి, హైదరాబాద్: మహామహోపాధ్యాయుడు రవ్వా శ్రీహరి తన జీవితకాలంలో చేసిన రచనలు, బోధనలను రాబోయే తరం చేతుల్లో పెట్టేందుకు సమగ్ర సంపుటాలను వెలువరించాలని నిర్ణయించినట్లు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. ఆయన రచించిన సుమారు ఎనిమిది వేల పేజీల సాహిత్యాన్ని ప్రచురిస్తామని స్పష్టం చేశారు. రవ్వా శ్రీహరి తెలుగు, సంస్కృతంలో మాండలిక పదకోశాల పేరుతో అనేక రచనలను చేశారని తెలిపారు. ఈ సాహిత్యాన్ని అందరికీ అందుబాటులో తేవాల్సిన బాధ్యతను తెలంగాణ సాహిత్య అకాడమీ తన భుజస్కంధాలపై వేసుకుంటుందని పేర్కొన్నారు. సోమవారం నాగోల్‌లో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పత్రికా సంపాదకులు, సంస్కృత ఆచార్యులు, శ్రీహరి శిష్యులు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో శ్రీహరి చిత్రపటానికి పలువురు ప్రముఖులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ శ్రీహరి సాహిత్య సేవలను కలకాలం గుర్తుంచుకునే విధంగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.